ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 212 | విజయవాడ, బుధవారం 2 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

అభ్యుదయ శాస్త్రవేత్త

పిఎం భార్గవ మృతి

ఎపి సిఎంతో సహా పలువురు ప్రముఖుల సంతాపం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభ్యుదయ శాస్త్రవేత్త సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సిసిఎంబి) వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పిఎం భార్గవ కన్ను మూశారు. ఆయన పూర్తి పేరు పుష్ప మిత్ర భార్గవ. వయస్సు 89 సంవత్సరాలు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో హైదరాబాద్, ఉప్పల్ ప్రశాంత్ నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. భార్గవకు కుమారుడు మోహిత్, కుమార్తె వినీత ఉన్నారు. ఆయన సతీమణి మనోరమ గతేడాది మరణించారు. కాగా భార్గవ మరణవార్త తెలుసుకున్న సిసిఎంబి డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, మాజీ డైరెక్టర్లు మోహన్‌రావు, లాల్‌జీ సింగ్, పలువురు శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు భార్గవ పార్థివదేహానికి నివాళు లర్పించారు. భార్గవ మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగానికి తీరని లోటుగా పేర్కొన్నారు. భార్గవ కుటుంబ సభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఎం తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సహా పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

పది వామపక్ష పార్టీల సంతాపం

పిఎం భార్గవ (89) మృతిపట్ల పది వామపక్ష పార్టీల నేతలు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ వై సాంబశివరావు, ఎంసిపిఐ(యు) ఎం వెంకటరెడ్డి, సిపిఐ(ఎంఎల్) గుర్రం

మిగతా 9లో

పార్లమెంట్‌లో గ్యాస్ మంటలు

- దద్దరిల్లిన ఉభయ సభలు
- ధర పెంపును విరమించుకోవాలని విపక్షాల డిమాండ్
- లోక్‌సభలో వాకౌట్ ..
- రాజ్యసభ రెండు సార్లు వాయిదా
- స్పందించని కేంద్ర ప్రభుత్వం
- నోరెత్తని తెలుగు ఎంపిలు
- ప్రజలపై అధిక భారం: ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో గ్యాస్ మంటలు రగిలాయి. వంట గ్యాస్‌పై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసేందుకు సన్నద్ధమైన మోడీ సర్కార్, ప్రతి నెలా నాలుగు రూపాయల చొప్పున ధర పెంచుతామని ప్రకటించడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిరసన ధ్వనులతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. గ్యాస్ ధర పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఇది సామాన్యులపై అధిక భారం మోపుతుందని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రతిపక్షాల వాయిదా తీర్మానాలను స్పీకర్ సుమిత్రా మహాజన్ తిరస్కరించారు. లోక్‌సభ నుండి ప్రతిపక్షాలు వాకౌట్ చేయగా, గందరగోళ పరిస్థితుల మధ్య రాజ్యసభ రెండు సార్లు వాయిదా పడింది. ఉభయ సభల్లోనూ తెలుగు రాష్ట్రాల ఎంపిలు కనీసం స్పందన వ్యక్తం చేయకపోవడం గమనార్హం. లోక్‌సభలో వంట గ్యాస్ ధర పెంపుపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో సభలో వున్న టిడిపి, వైసిపి, టిఆర్‌ఎస్ సభ్యుల గొంతులు మూగబోయాయి.

వంటగ్యాస్‌పై రాయితీని క్రమంగా ఎత్తివేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రతి నెలా గ్యాస్ ధర పెంపుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. విపక్ష సభ్యులు పోడియం వద్దకు దూసుకువెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర. గందరగోళం నెలకొంది. దీంతో సభ రెండు సార్లు వాయిదా పడింది.

ప్రతినెలా గ్యాస్ సిలిండర్ ధరను రూ.4 మేర పెంచాలని చమురు, సహజ వాయు మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయడాన్ని తొలుత టిఎంసి సభ్యుడు డెరెక్ ఓ బ్రెరాన్ సభలో ప్రస్తావించారు. ధరలు తగ్గిస్తామంటూ గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్డీఏ సర్కార్ విస్మరిస్తోందని విమర్శించారు. ఈ అంశంపై తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని డిమాండ్ చేశారు. దీనికి ఇతర ప్రతిపక్ష సభ్యులు మద్దతు తెలుపుతూ,



రాయితీ ఎత్తివేతపై రాజ్యసభకు కనీసం సమాచారమైనా ఇవ్వ లేదని ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. ఎన్డీఏ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వంటగ్యాస్‌పై రాయితీ ఎత్తివేయరాదంటూ నినదించారు. ఈ గందరగోళం మధ్య రాజ్యసభ తొలిసారి వాయిదా పడింది. సభ తిరిగి సమావేశమయ్యాక చమురు, సహజ వాయువు శాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్

మిగతా 9లో

గ్యాస్ సబ్సిడీ ఎత్తివేతను ఉపసంహరించుకోవాలి

సిపిఎం డిమాండ్



న్యూఢిల్లీ : వంట గ్యాస్‌పై సబ్సిడీ పూర్తిగా రద్ద య్యేవరకూ నెలకు రూ. 4 చొప్పున తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిపిఐ (ఎం) పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ప్రధాని మోడీ చేసిన 'గివ్ ఇట్ అప్' ప్రచారానికి ఈ నిర్ణయం పూర్తి విరుద్ధమని ఒక ప్రకటనలో పేర్కొంది. ధనవంతులు తమ సబ్సిడీని వదులుకుని పేదలకు ఆ ఫలితాన్ని ఇవ్వాలని మోడీ పెద్ద ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు చేసింది. అంతర్జాతీయంగా పెట్రోల్ ఉత్పత్తుల ధరలు తగ్గుతున్న సమయంలో కేంద్రం ఇలాంటి నిర్ణయాన్ని తీసుకోవడాన్ని పొలిట్ బ్యూరో తప్పుపట్టింది. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవడం కోసం పేదలపై దోపిడీని తీవ్రతరం చేస్తోందని పొలిట్ బ్యూరో విమర్శించింది. మన దేశంలోని అత్యధిక ప్రజలపై భారాన్ని మోపే ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని పొలిట్ బ్యూరో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

అసెంబ్లీ సీట్ల పెంపు లేదు

పునఃస్పష్టీకరించిన కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజక వర్గాల పెంపు ఇప్పట్లో చేపట్లే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3)ని సవరిస్తే కానీ అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యం కాదని పునరుద్ఘాటించింది. రాజ్యాంగ సవరణ చేయకపోతే 2026 తర్వాత వచ్చే జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పెంపుదల ఉంటుందని హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారాం అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వ వైఖరేమిటనీ టిడిపి ఎంపి మురళీమోహన్, టిఆర్‌ఎస్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. దీనిపై హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ లిఖిత పూర్వకంగా సమాధా నమిచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3)కి లోబడే సీట్ల పెంపుదల ఉంటుందని స్పష్టం చేశారు.



ఆర్టికల్ 170(3)కి లోబడి ఆంధ్రప్రదేశ్‌లో 153 నుంచి 225 సీట్లు, తెలంగాణలో 119 నుంచి 175 సీట్లు పెంచాలని చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఆర్టికల్ 170(3)ని సవరించాలని కేంద్రం భావిస్తోందా లేదా అన్నదానిపై కేంద్రం బదులివ్వలేదు.

కాంట్రాక్టు ఉద్యోగులకూ పెర్ఫార్మెన్స్

- జీతం పెంచకుండా ఇన్సెంటివ్
- పశుసంవర్ధక శాఖలో జీవో
- ఆర్థిక శాఖ అనుమతితో విడుదల
- ఆందోళనలో 417 ఎంపిడిఇఎలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పనితీరు ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణలకు సంబంధించిన ముసాయిదా ఉత్తర్వుల కలకలం కొనసాగుతుండగానే పశుసంవర్ధక శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులకు పెర్ఫార్మెన్స్ ప్రాతిపదికన జీతాలు చెల్లించేందుకు ఉద్దేశించిన మరో ఉత్తర్వు వివాదాస్పదమైంది. ఇప్పటి వరకు పెర్ఫార్మెన్స్ కత్తి ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమనుకోగా, పశుసంవర్ధక శాఖలో మంగళవారం విడుదలైన జీవోతో కాంట్రాక్టు ఉద్యోగుల మెడపైనా వేలాడుతోందని తెలుస్తోంది. పశుసంవర్ధక శాఖలో ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిలిచిపోవడంతో కాంట్రాక్టు ప్రాతిపదికన సిబ్బందిని ఎప్పటికప్పుడు నియమించుకొని నెట్టుకొస్తున్నారు. ఆ విధంగా 500 మంది మల్టీపర్పస్ డెయిరీ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్స్ (ఎంపిడిఇఎ)ను రిక్రూట్ చేసుకొని వారి సర్వీస్ కాంట్రాక్టును ఏడాదికేడాదీ పొడిగిస్తున్నారు. వారిలో 417 మంది ఎంపిడిఇఎల కాంట్రాక్టును ఈ ఏడాది జులై 31 వరకు పొడిగిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 12న అప్పటి పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ జీవోఆర్‌టి నెం.107 జారీ చేశారు. దానిలో ప్రతి ఉద్యోగికీ నెలకు రూ.8 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. సోమవారంతో ఎంపిడిఇఎల కాంట్రాక్టు గడువు ముగియడంతో వారి కాంట్రాక్టును మరోసారి పొడిగిస్తూ ప్రస్తుత ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జెఎస్‌వి ప్రసాద్ మంగళవారం జివోఆర్‌టి నెం.221 వెలువరించారు. ఎంపిడిఇఎల గౌరవ వేతనం రూ.8 వేల నుంచి పెంచాలని, పెర్ఫార్మెన్స్ ప్రాతిపదికన ప్రోత్సాహకం ఇవ్వాలని పశుసంవర్ధక శాఖ

మిగతా 9లో




పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చింతూరు సెంటర్ వద్ద నిర్వహించిన మహాధర్నా

7

బాబు మాటలు నమ్మి మోసపోవద్దు

పవన్‌కు ముద్రగడ లేఖ



ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నీటిమూటల్లాగే ఉన్నాయని, ఆయన మాటలు విని మోసపోవద్దని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో మంగళవారం ముద్రగడ బహిరంగలేఖ విడుదల చేశారు. జిఒ 30 సక్రమంగానే ఉన్నప్పటికీ అమలుకు నోచుకోలేద న్నారు. 2016 ఫిబ్రవరిలో మంత్రి అచ్చెన్నాయుడు మరో ఏడు నెలల్లో కమిషన్ రిపోర్టు తెచ్చుకుని అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్రానికి పంపుతామని చెప్పినట్లు వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు, కమిషన్ వేసి 18 నెలలు, పల్స్ సర్వే వేసి ఏడాదైనా ఆచరణకు నోచుకోలేదన్నారు. అబద్దాల మీద అబద్దాలు చెప్పేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు సిగ్గుపడడం లేదని, వారు మాటలు వినేందుకు కాపులు సిగ్గుపడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకూ కాపులకు చెప్పిన అబద్దాలు జనసేన అధ్యక్షునికి తెలియడం కోసం ఈలేఖ రాస్తున్నట్టుగా ఆయన ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే తెలుగుదేశం ప్రభుత్వం మాటలువిని కాపులు మోసపోయారని, పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి మాటలు విని ప్రజల్లో ఉన్న పరపతిని తగ్గించుకోవద్దని సూచించారు.

మంత్రుల నంద్యాల బాట

- డివిజన్ల వారీగా ఎన్నికల బాధ్యతలు
- అక్కడి నుండే సమీక్షలు
- రేపటి టిడిపి సమావేశంలో అదనపు బాధ్యతలు



నంద్యాలలో ఉప ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి, మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంద్యాలలో ఉప ఎన్నికల వేడి పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మంత్రులంతా అక్కడే తిష్ట వేశారు. ఎనిమిదిమంది మంత్రులకు నంద్యాలలో పూర్తి బాధ్యతల్ని అప్పగించారు. వ్యాపారవేత్తలుగా ఉన్న ఎంపిలూ అదే బాధ్యతల్లో మునిగి తేలుతున్నారు. పరిపాల నంతా నారా లోకేష్‌కు అప్పగించారు. పూర్తిగా నంద్యాల కేంద్రంగా మంత్రులు కార్యకలాపాల్ని నిర్వహిస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ వారికి కేటాయించిన డివిజన్లు, ప్రాంతాలను దాటి రావొద్దని సిఎం చంద్రబాబు ఆదేశిం చారు. దీనికోసం ఎనిమిది మంత్రులతో గతంలో ఒక కమిటీని కూడా వేశారు. మంత్రులతోపాటు 50 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎమ్మెల్సీలు పూర్తిగా అక్కడే ఉండి వ్యవహారాన్ని నడుపుతున్నారు. అమర్నాథరెడ్డి, జవహర్, సోమిరెడ్డి, దేవినేని ఉమా, పరిటాల సునీత, అచ్చెన్నాయుడు, సిద్ధా రాఘవరావు తదితరులు నంద్యాలకే పరిమితమ య్యారు. మంత్రి నారాయణకు కూడా అదనపు బాధ్యతల్ని అప్పగించారు. వీరితోపాటు ఎంపిలు సిఎం రమేష్, రాయపాటి, రామ్మోహన్‌నాయుడు, శివప్రసాద్ తదితరులు నంద్యాలలోనే మకాం వేశారు. ఇటీవల చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రజలు రాకపోవడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. దీంతో అక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలని చెబుతూ మంత్రుల్ని పురమాయిం చారు. దీనికితోడు వేలకోట్ల రూపాయలు అభివృద్ధి పనుల పేరుతో కేటాయిస్తున్నారు. ఒక్క నంద్యాలలోనే సుమారు రూ.1600 కోట్ల మేర పనులు మంజూరు చేయించారని తెలిసింది. గత నెలలో సిఎం కూడా నంద్యాలపై రోజు విడిచి రోజు సమీక్ష నిర్వహించారు. తెలుగుదేశంలో ఉన్న అసంతృప్తులను బుజ్జగించే పనిలో పడ్డారు. కేవలం సానుభూతిపై ఆధారపడి నంద్యాల ఉప ఎన్నికలు జరుగుతుండటంతో అధికారపక్షానికి అక్కడి వాతావరణం అర్థం కావడం లేదు. అలాగే ఇటీవల జరిగిన ఓ సభలో అవసరమైతే ఓటుకు ఐదువేలివ్వగలనని, కానీ ఇవ్వలేనని చెప్పడం ద్వారా అవసరమైతే ఐదువేలైనా పంచాలని మంత్రులకు సిఎం చెప్పినట్లుగా ఉందని ప్రతిపక్షనేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మంత్రివర్గంలో ఉన్న వారందరూ కచ్చితంగా రోజు విడిచి రోజు నంద్యాల వెళ్లి రావాలని ఆదేశించారు. 3న జరిగే పార్టీ సమావేశంలోనూ దీనిపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు తెలిసింది. నంద్యాల ఓటర్ల లిస్టును తెప్పించి దానికనుగుణంగా ఓటర్ల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలకు ప్రాంతాలను కేటాయించనున్నారు. ఈ మేరకు టిడిపి అధిష్టానం ప్రక్రియ పూర్తి చేసింది. దీంతోపాటు నంద్యాలలో ఉన్న కులాల వారీ ఓట్లను వర్గీకరించారు. కుల సంఘాల నాయకులనూ అక్కడ మోహరించాలని నిర్ణయించారు. ఇటీవల కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమించిన వారందరికీ నంద్యాల బాధ్యతల్ని అప్పగించారు. రాయలసీమ నాయకత్వం పూర్తిగా నంద్యాలపైనే దృష్టిపెట్టింది. విజయవాడలో బోండా ఉమాకు కూడా బాధ్యతలు కేటాయించారు. మరోవైపు టిడిపి కార్యకలాపాల్ని కూడా నంద్యాల నుండే నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికలయ్యేంతవరకూ రాష్ట్ర సమావేశాల్ని నంద్యాలలోనే జరపాలని చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యంగా కుల సమీకరణపైనే దృష్టిపెట్టి టిడిపి వ్యవహారం నడుపుతోంది. మరోవైపు వ్యాపారవేత్తల్ని రంగంలోకి దింపింది. గతంలో గుంటూరులో గల్లా జయదేవ్ అనుసరించిన

మిగతా 9లో

పనగారియా రాజీనామా



న్యూఢిల్లీ : నీతి ఆయోగ్ ఉపాధ్యక్ష పదవికి అరవింద్ పనగారియా రాజీనామా ప్రకటించారు. రెండున్నర ఏళ్లుగా ఈ పదవిలో కొనసాగుతున్న పనగారియా మంగళవారం హఠాత్తుగా తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ తిరిగి అధ్యాపక వృతిని చేపడతానని వెల్లడించారు. సెప్టెంబర్‌లో ఆయన న్యూయర్క్ చేరుకుని మళ్లీ కొలంబియా యూనివర్శిటీలో ఉద్యోగ బాధ్యతల్లో చేరనున్నారు. భారతలో జన్మించి అమెరికాలో ఆర్థికశాస్త్రం అభ్యసించిన పనగారియాను 2015 జనవరిలో ప్రధాని మోడీ నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. ప్రణాళిక సంఘం స్థానంలో నీతి ఆయోగ్‌ను మోడీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. మూడు సంవత్సరాల కాలంలో నీతి ఆయోగ్ సాధించినది శూన్యం. భారత్ కోసం ఏడు సంవత్సరాల వ్యూహం, 15 సంవత్సరాల విజన్‌ను కూడా నీతి ఆయోగ్ ప్రకటించలేదు. త్వరలో అతని వారసుడ్ని ఎంపిక చేసే అవకాశం వుంది.

ప్రజ్ఞ

1. రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణం వర్సిటీ అధికారుల క్రమ శిక్షణ చర్యలు కాదని తేల్చిన కమిటీ?
2. డిజిటల్ చెల్లింపులపై ప్రభుత్వం ఎవరి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది?
3. సుప్రీం కోర్టు ఈ-జడ్జి ఇన్‌చార్జిగా పునర్నియమితులైంది?
4. యుపిఎస్‌సి నూతన చైర్మన్?
5. కృష్ణా బోర్డు కొత్త చైర్మన్?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అమరావతికి 7 వేల కోట్లు

- ముందుకొచ్చిన ఏషియన్ ఇన్‌ఫ్రా బ్యాంక్
- రూ.2240 కోట్లతో రోడ్లు, రూ.2240 కోట్లతో వంతెనలు
- మరో రూ.2606 కోట్లతో తాగునీరు, పారిశుధ్య పనులు
- 7నుంచి అమరావతిలో పర్యటన



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో మూడు కీలక ప్రాజెక్టులకు ఏడు వేల కోట్ల రూపాయలకు పైగా నిధులిచ్చేందుకు ఎఐఐబి (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) ముందుకొచ్చింది. ఈ మేరకు త్వరలోనే అమరావతి రాజధానితోపాటు, ఇతర ప్రాంతాల్లో కూడా పర్యటించాలని నిర్ణయించింది. ఇదే విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌కు లేఖ ద్వారా వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లగా, వాటిని ఆమోదించిన కేంద్రం అవసరమైన రుణాన్ని అందించాలంటూ ఎఐఐబికి ప్రతిపాదన పంపించింది. ఈ మేరకే ఎఐఐబి రుణాన్ని అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో నిర్మించనున్న మండల, గ్రామీణ అను సంధాన రోడ్లకు రూ.2240 కోట్లు రుణంగా లభించనుంది. ఈ ప్రాజెక్టును ఎపి రోడ్ల అభివృద్ధి సంస్థ, ఆర్ అండ్ బి శాఖలు చేపట్టనున్నాయి. అలాగే రహదారులపై పలు వంతెనల నిర్మాణానికి మరో 2240 కోట్ల రూపాయలు కూడా రుణంగా లభించనుంది. ఈ వంతెనల నిర్మాణాన్ని కూడా రోడ్ల అభివృద్ధి సంస్థ, ఆర్ అండ్ బి శాఖలే చేపట్టనున్నాయి. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ తాగునీటి సరఫరా, మురుగు నిర్వహణ అభివృద్ధి ప్రాజెక్టును 2606 కోట్ల రూపాయలతో చేపట్టనున్నారు. ఈ నిధుల్ని కూడా ఎఐఐబి రుణంగా అందించనుంది.
ఈ నేపథ్యంలోనే ఈ నెల 7 నుంచి 9వరకు ఎఐఐబి ప్రతినిధుల బృందం రాష్ట్రంలో పర్యటించనుంది. అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయనుంది. ఈ పర్యటనలో భాగంగానే ముఖ్యమంత్రితో కూడా భేటీ కావాలని నిర్ణయించింది. అలాగే ఆర్థిక శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులతో భేటీ కానుంది. అలాగే మూడు ప్రధాన ప్రాజెక్టుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను కూడా పరిశీలించనుంది. ఈ పర్యటన కోసం స్థానికంగా ఏర్పాట్లు చేయాలని దినేష్‌కు రాసిన లేఖలో ఎఐఐబి ఉపాధ్యక్షుడు కోరారు.

రాష్ట్రంలో 10 వేల కిలోమీటర్ల భూగర్భ డ్రైనేజీ

సమీక్షా సమావేశంలో లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో సుమారు పది వేల కిలోమీటర్ల భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ అధికారులతో వెలగపూడి సచివాలయంలో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సిన గ్రామాల వివరాలను, యాక్షన్ ప్లాన్‌లను కలెక్టర్ల నుంచి సేకరించాలన్నారు. నరేగా అనుసంధానంతో సుమారు రూ.2600 కోట్ల అంచనాతో ఈ పనులు చేపట్టాలన్నారు. ఈ నెల 4లోపు పరిపాలనా అనుమతులు పూర్తి చేయాలని, 10 నాటికి మెటీరియల్ సరఫరా పూర్తి కావాలని, 15న శంకుస్థాపన చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 1 నుంచి నిర్మాణ పనులు ప్రారంభించాలని, డిసెంబర్ 31 నాటికి అన్ని గ్రామాల్లో అండర్ గ్రౌండ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి, కమిషనర్ రామాంజనేయులు, పంచాయతీరాజ్, నరేగా అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి
లోకేశ్‌ను కోరిన రేణిగుంట ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులు

చిత్తూరు జిల్లా రేణిగుంట ఎలక్ట్రానిక్ మ్యూనుఫ్యాక్చరింగ్ క్లస్టర్-2లో మౌలిక సదుపాయాలు, భూ కేటాయింపులు వీలైనంత త్వరగా కల్పించాలని ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులు ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. సిఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం లోకేశ్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. నెల రోజుల్లోగా భూ కేటాయింపులు పూర్తి చేసి వీలైనంత త్వరగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

అన్నపూర్ణ భోజన పథకంపై అధ్యయనం

హైదరాబాద్‌లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో విజయవంతమైన అన్నపూర్ణ భోజన పథకం అమలుతీరును ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాల కమిషనర్లు పరిశీలించారు. మంగళవారం జీహెచ్ఎంసీ పరిధిలో పర్యటించి ఐదు రూపాయల భోజన కేంద్రాలను సందర్శించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరికిరణ్, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ శోభ, విజయవాడ కమిషనర్ నివాస్, కర్నూల్ కమిషనర్ హరినాథ్‌రెడ్డి, నెల్లూర్ కమిషనర్ ఢిల్లీరావు, గుంటూరు కమిషనర్ అనురాధ, విజయనగరం కమిషనర్ ఎ.కనకమహాలక్ష్మి, ఒంగోలు కమిషనర్ వెంకటకృష్ణ, మచిలీపట్నం కమిషనర్ జశ్వన్‌రావు, కడప కమిషనర్ చంద్రమోళీశ్వర్‌రెడ్డి, అనంతపురం కమిషనర్ పి.వి.వి.ఎస్.మూర్తి, రాజమండ్రి అడిషనల్ కమిషనర్, తదితరులు ఉన్నారు. అనంతరం బల్దియా కార్యాలయంలో కమిషనర్ డా.బి.జనార్ధన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఏపీలోని మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో ఐదు రూపాయల భోజన పథకాన్ని ప్రారంభించాలని తమ ప్రభుత్వం నిర్ణయించినందున హైదరాబాద్‌లో అమలవుతున్న అన్నపూర్ణ ఐదు రూపాయల భోజన పథకాన్ని అధ్యయనం చేయడానికి హైదరాబాద్ వచ్చినట్టు వారు కమిషనర్‌కు వివరించారు. అన్నపూర్ణ పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో 150 అన్నపూర్ణ కేంద్రాల ద్వారా ప్రతిరోజు కేవలం ఐదు రూపాయలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకం అమలుకు బల్దియా బడ్జెట్‌లో సంవత్సరానికి రూ.39కోట్లు కేటాయించామని చెప్పారు. నగరంలో పేదలు, కార్మికులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, నగరానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి ఈ భోజన కేంద్రాల ద్వారా తక్కువ ధరకే భోజనం అందుతుందని కమిషనర్ వివరించారు. హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వంటశాలను వారు పరిశీలించారు.

జులైలో లోటు వర్షం!

- రుతు పవనాల విరామం
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి
రాష్ట్రంలో వర్షాభావం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఒక రకంగా వేసవిని తలపిస్తోంది. అడపాదడపా ఏర్పడిన ఆవర్తనాలు, ద్రోణుల ప్రభావంతో ఉరుములతో కూడిన జల్లులు కురుస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్నవి క్యుములోనింబస్ వర్షాలేనని, నైరుతి రుతుపవనాల ద్రోణులు 10 రోజులుగా ఉత్తరాదిలోనే చిక్కుకోవడమే దీనికి కారణమని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత డైరెక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. దేశంలో పడమటి, నైరుతి గాలులు తప్ప తూర్పు గాలులు వీయడం లేదన్నారు. అందువల్ల రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితులు నైరుతి రుతు పవనాలు విరామ (బ్రేక్ మాన్‌సూన్) దశకు సంకేతాలుగా పేర్కొన్నారు. మరో నాలుగైదు రోజులు ఈ విరామం కొనసాగుతుందన్నారు. బంగాళాఖాతంలో బలమైన అల్పపీడనం లేదా వాయుగుండం వంటివి ఏర్పడితే రుతుపవన ద్రోణులు కిందకి దిగుతాయన్నారు. ఆగస్టు రెండో వారంలో తెలుగు రాష్ట్రాల్లో ఆశాజనకమైన పరిస్థితులు నెలకొంటాయని, వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో లోటు వర్షపాతం కొనసాగుతోంది.

రాష్ట్రంపై ద్రోణి

ఒడిశా నుంచి కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములతో కూడిన క్యుములో నింబస్ వర్షాలు పడతాయని తెలిపింది. మంగళవారం సాయంత్రం రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములతో కూడిన ఓ మోస్తరు నుంచి చెదురుమదురు జల్లులు పడ్డాయి. ఉదయం ఎండ తీవ్ర ప్రభావం చూపగా, మధ్యాహ్నం ఉక్క పోత, సాయంత్రం ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది.

జులై 20 నుంచి 27 వరకు నమోదైన వర్షపాతం

ప్రాంతం	కురిసింది	కురవాల్సింది	లోటు
తూ.గో	20.7	52.1	-60
గుంటూరు	3.3	39.2	-92
కృష్ణా	13.7	57.6	-76
నెల్లూరు	4.3	26.2	-82
ప్రకాశం	0.4	27.0	-98
శ్రీకాకుళం	2.1	46.2	-95
విశాఖపట్నం	8.9	46.0	-81
విజయనగరం	1.2	44.3	-97
ప.గో	24.1	64.1	-62
అనంతపురం	1.9	17.5	-89
చిత్తూరు	5.3	29.2	-82
కడప	0.4	28.9	-99
కర్నూలు	0.5	31.3	-98
ఆంధ్రప్రదేశ్	5.5	35.4	-84

ఎస్‌ఎఫ్‌సి ఇన్‌చార్జి ఎండిగా సిద్ధార్థజైన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఎపి స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సి) ఇన్‌చార్జి ఎండిగా సిద్ధార్థజైన్‌ను నియమిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోకియారాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఎండి డబ్ల్యు వియర్ మూర్తి ఈ నెల 1 నుంచి 19 వరకు సెలవుపై వెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జూన్ వరకు వ్యాట్ కట్టాల్సిందే

కాంట్రాక్టర్లకు ప్రభుత్వం స్పష్టీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
జూన్ నెలాఖరు వరకు జరిగిన పనులపై వ్యాట్ చెల్లించాలని, ఆ తరువాత జరిగే పనులపై జిఎస్‌టి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. జూన్ నెల్లో జరిగిన పనులకు బిల్లుల్ని జూలైలో దాఖలు చేసినప్పటికీ వ్యాట్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. వివిధ నిర్మాణ రంగ ప్రాజెక్టుల ద్వారా పన్ను చెల్లింపులపై ప్రభుత్వం వివరణిచ్చింది. జూలై ఒకటి నుంచి జిఎస్‌టి అమలులోకి వచ్చిన నేపథ్యంలో పన్ను వసూళ్లపై సందిగ్ధత నెలకొనడంతో వాణిజ్య పన్నుల శాఖ స్పష్టత ఇచ్చింది. ప్రధానంగా నీటిపారుదల, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల్లో ఎక్కువగా ఇటువంటి సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో వాణిజ్య పన్నుల శాఖ వివరణివ్వడం విశేషం.

విలీన మండలాల్లో వైద్య సదుపాయల కోసం రూ. 4.41 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
తెలంగాణ నుంచి తూర్పు గోదావరి జిల్లాలో కలిపిన నాలుగు ఏజెన్సీ విలీన మండలాల్లో వైద్య సదుపాయాల కోసం రూ. 4.41 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన ఉపప్రణాళికలో 'ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' కార్యక్రమం కోసం కేటాయించిన నిధుల నుంచి ఈ కేటాయింపులు చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధుల్లో సుమారు రూ. 1.83 కోట్లతో నాలుగు మండలాల్లోని వైద్య, ఆరోగ్య కేంద్రాల్లో సివిల్ వర్క్ పనులు చేపట్టనున్నారు. మరో రూ. 2.58 కోట్లతో వైద్య, ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన వాహనాలు, వైద్య పరికరాలు కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎపిఎంఎస్ఐడిసి ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనున్నారు.

5 నుంచి ఎంసెట్ తుది విడత కౌన్సిలింగ్

8న సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఈ నెల 5 నుంచి ఎమ్‌పిసి స్ట్రీమ్‌కు సంబంధించి ఎంసెట్ తుది విడత కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని ఎపి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ విజయరాజు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కౌన్సిలింగ్ వివరాలను వెల్లడించారు. ఎమ్‌పిసి స్ట్రీమ్ విద్యార్థులకు 5, 6 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహించి 8న సీట్లు కేటాయించనున్నారు. బైపిసి స్ట్రీమ్ (బి, డి ఫార్మశీ, బయో టెక్నాలజీ)కు చెందిన విద్యార్థులకు ఈనెల 8 నుంచి 10 వరకు మూడు రోజులు మొదటి విడత కౌన్సిలింగ్ నిర్వహించి 11న సీట్లు కేటాయిస్తారు. మిగిలిన సీట్లకు సంబంధించి బైపిసి విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 24 వరకు మూడు రోజులు తుది విడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. తుది విడత కౌన్సిలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు 25న సీట్ల కేటాయిస్తారు. ఎమ్‌బిఎ, ఎమ్‌సిఎ విద్యార్థులకు సంబంధించి ఈ నెల 6, 7 తేదీల్లోనే ఎపి ఐసెట్ కౌన్సిలింగ్ ఉంటుంది. వీరికి ఈ నెల 9న సీట్లను కేటాయిస్తారు.

తెలుగు రాష్ట్రాల సీఎస్‌లకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్
పంట పొలాల్లో విద్యుత్‌లైన్లు వేసినందుకు రైతులకు పరి హారం ఇవ్వడం లేదన్న కేసులో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యుత్ నియంత్రణ మండళ్లు, విద్యుత్ సంస్థలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రైతుల పంట భూముల్లో వేసిన విద్యుత్ లైన్లకు పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్స్ (సీఐఎఫ్ఎ) ప్రధాన సలహాదారు పి.చంగల్‌రెడ్డి వేసిన రిట్ పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది.
2003 విద్యుత్ చట్టం, వర్క్స్ ఆఫ్ లైసెన్సీస్ రూల్స్ 2006లకు వ్యతిరేకంగా ఏపీ, తెలంగాణ ప్రభుత్వ చర్యలున్నాయని చంగల్‌రెడ్డి రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది, ఇదే అంశంపై గతంలో ఉన్న పిల్‌తో కలిపి ఈకేసు కూడా బెంచ్ జరిపిన విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఆయేషా హత్య కేసులో పోలీసుల వైఫల్యంపై చర్యలేవీ?

అపెక్స్ కమిటీ తీసుకున్న చర్యల్ని వివరించాలని హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్
విజయవాడలో పెనుసంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో అసలు నేరస్తులను గుర్తించడంలో విఫలమైన వారిపై అపెక్స్ కమిటీ ఏవిధమైన చర్యలు తీసుకుందో తెలియజేయాలని ఏపీ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయేషా హత్య కేసులో హైకోర్టు వెలువరించిన తీర్పులో పి. సత్యంబాబు నిర్ధోషి అని ప్రకటిస్తూనే పలు సందేహాల్ని వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసును తిరిగి దర్యాప్తు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రమా మేల్కోటే, సామాజిక కార్యకర్త వల్లూరుపల్లి సంధ్యారాణి, జర్నలిస్టు కె.సజయ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. పోలీసులు వైఫల్యం కారణంగా సత్యంబాబుకు కింది కోర్టు శిక్ష విధించిందని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేలా డీజీపీ, హెూం శాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శి ఇతరులతో కూడిన అపెక్స్ కమిటీకి నివేదించాలని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నా నేటి వరకు ఆ కమిటీకి నివేదించలేదని పిటిషనర్ల తరపు న్యాయవాది వసుధా నాగరాజ్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. వాదనల అనంతరం హైకోర్టు స్పందిస్తూ.. నేరస్తుల్ని గుర్తించడంలో విఫలమైన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారా లేదా. గత మార్చి 31న హైకోరు ఆదేశాల మేరకు ఈ వ్యవహారాన్ని అపెక్స్ కమిటీకి నివేదించారా లేదా. నివేదించి ఉంటే ఆ కమిటీ ఏం చర్యలకు సిఫార్సు చేసింది. కమిటీ ఏమీ చేయకపోతే అందుకు కారణాలు.. వంటి పూర్తి సమాచారాన్ని తెలియజేయాలని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. కేసు విచారణ 8కి వాయిదా వేసింది.

కేంద్రం నిధుల్ని పూర్తిగా వినియోగించుకోవాలి

సిఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికేట్లను ఎప్పటికప్పుడు కేంద్రానికి సమర్పించాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై సిఎస్ సమీక్ష నిర్వహించారు. జాతీయ సంస్థల ఏర్పాటుకు సంబంధించిన భూ కేటాయింపులు, కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నిధుల విడుదల, వినియోగంపై చర్చించారు. జాతీయ స్థాయిలో ఆర్థిక సంవత్సరానికి ముందే బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇప్పటినుంచే అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జాతీయ సంస్థలకు భూ కేటాయింపుల్లో జాప్యం జరగరాదని, ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు స్పష్టంచేశారు. 2016-17లో వివిధ పథకాలకు సంబంధించి రూ 10,400 కోట్లు కేంద్రం నుంచి వచ్చాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ 15 వేల కోట్లు వచ్చేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి రూపాయిని ఖర్చు చేసి, దానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్ వెంటనే కేంద్రానికి పంపేలా ఆయా శాఖల ఉన్నతాధికారులు కృషిచేయాలన్నారు.

గో రక్షణ పేరుతో.. ప్రజా భక్షణ : సురవరం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ గో రక్షణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి తెలిపారు. గో రక్షణ పేరుతో సంఘ్ పరివార్ శక్తులు ప్రజలను భక్షిస్తున్నాయని విమర్శించారు. ప్రధాని మోడీ హెచ్చరించినా.. రిమోట్ ఆర్ఎస్ఎస్ చేతుల్లో ఉన్నందున చర్యలు తీసుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లో 'తెలంగాణ సమగ్రాభివృద్ధి- సామాజిక న్యాయం' అంశంపై సిపిఐ తెలంగాణ కమిటీ మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మోడీ అనుసరిస్తున్న ప్రమాదకర కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా ధనికులు, పేదల మధ్య వత్యాసం పెరిగిందన్నారు. ముకేశ్ అంబానీ వంటి పారిశ్రామిక వేత్తల ఆస్తులు లక్షల కోట్లకు చేరుకుంటే.. ప్రజలు దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను చివరకు న్యాయస్థానాలు కూడా ఎత్తి చూపడం లేదన్నారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదన్నారు. ప్రతిపక్షాలను దెబ్బతీస్తున్నా.. ప్రజల ఆగ్రహం, వ్యతిరేకత నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు., మోడీ కంటే ముందు మేమే దేవుళ్లం అనుకున్న వారందరూ కాలగర్భంలో కలిసి పోయారని తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలనపై వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు సమైక్యంగా పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ తెలంగాణ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, టిజెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్లు హరగోపాల్, విశ్వేశ్వరరావు, గద్దర్, విమలక్క, ఆర్ఎస్పీ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంసిపిఐ(యు), ఎస్‌సియుఐ(సి) నేతలు మాట్లాడారు.

డ్రగ్స్ కేసులో ముగిసిన 'సిట్' విచారణ

- సిటీ సివిల్ కోర్టుకు కేసు డైరీ, సీడీలు
- మూడు గంటల్లోనే హీరో నందు విచారణ పూర్తి




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలుగు సినీ పరిశ్రమలో అలజడి సృష్టించిన డ్రగ్స్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ముగిసింది. చివరిగా యువ హీరో నందును సిట్ మంగళవారం ప్రశ్నించింది. కేవలం మూడు గంటల్లోనే నందు విచారణను ముగించారు. ఈకేసులో చిత్ర పరిశ్రమకు చెందిన 12 మందికి సిట్ నోటీసులు జారీచేయగా వారందరూ విచారణకు హాజరయ్యారు. వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో సాక్షులు వెల్లడించిన అంశాలతో రూపొందించిన వీడియో సీడీలు, కేసు డైరీని సిట్ అధికారులు సిటీ సివిల్ కోర్టుకు త్వరలో సమర్పించనున్నారు. వాటిని న్యాయస్థానం పరిశీలించిన తర్వాత ఇచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి. సిట్ నోటీసుల మేరకు విచారణకు హాజరైన వారిపై కేసులు నమోదు చేసే విషయంలో కూడా అప్పుడే స్పష్టత రానుంది.
జులై 19న ప్రముఖ దర్శకులు పూరి జగన్నాథ్‌తో సిట్ విచారణ మొదలయింది. తరువాత వరుసగా కెమేరామెన్ శ్యామ్.కె.నాయుడు, నటుడు సుబ్బరాజు, హీరోలు నవదీప్, తరుణ్, హీరోయిన్ ఛార్మి, ముమైత్‌ఖాన్, రవితేజ, రవితేజ డ్రైవర్ శ్రీనివాసరావు, తనీష్, నందులను సిట్ అధికారులు ప్రశ్నించారు. మొదటి ఐదు రోజుల విచారణలో సిట్ కీలక సమాచారం సేకరించింది. పూరి, శ్యామ్ కె నాయుడు, సుబ్బరాజు, నవదీప్, తరుణ్‌లను రాత్రి పదకొండు గంటల వరకు విచారించారు. రక్తం, తలవెంట్రుకలు, గోళ్ళ నమూనాలను కూడా సేకరించారు. నోటీసులు ఇచ్చిన వారిని సాక్షులుగానే పిలిచామని అధికారులు చెబుతున్నా.. వారిపై ప్రశ్నల వర్షం కురిపించి సమాధానాలు రాబట్టారు. విచారణ నుంచి తప్పించుకునేందుకు నటి చార్మీ హైకోర్టు తలుపు తట్టినా ఉపయోగం లేకపోయింది. సిట్ విచారణలో వెల్లడైన సమాచారం ఆధారంగా డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్న వారి పేర్లతో సిట్ రెండో జాబితా సిద్ధం చేసింది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలతో వారిని గోప్యంగా ప్రశ్నించనున్నట్లు తెలిసింది.

నేను అమాయకుడ్ని : నందు

మంగళవారం ఉదయం 10.30 గంటలకు నందు సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. డ్రగ్స్‌కు సంబంధించి తనకు తెలిసిన విషయాలను వెల్లడించిన నందు, కెల్విన్‌తో తనకు స్నేహం లేదని చెప్పారు. సినిమాలకు సంబంధించి ఒకటి, రెండు సార్లు మాట్లాడానని తెలిపారు. డ్రగ్స్ ఎప్పుడూ వినియోగించలేదని, వాటివల్ల దుష్పరిణామాలు తెలుసునని అన్నారు. తాను అమాయకుడ్ని అని, ఈకేసులో నోటీసులు రావడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఇప్పటివరకు సిట్ ముందు హాజరైన వారిలో నందు విచారణే త్వరగా ముగిసింది.

ఆరోగ్య రంగంలో పిపిపి!

అవి'నీతి'కి 'ఆయోగ్' రాచబాట



ప్రజానీకానికి అత్యంత కీలకమైన ఆరోగ్యరంగాన్ని పూర్తిస్థాయిలో ప్రైవేటు రంగానికి అప్పచెప్పడానికి కేంద్ర సర్కారు సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని నీతి అయోగ్ ఒక పథకం ప్రకారం ముందుకు తెస్తోంది. ప్రపంచబ్యాంకు భాగస్వామ్యంతో దేశ వ్యాప్తం గా ఆరోగ్యరంగంలో పిపిపి మోడల్‌ను అమలు చేయాలన్నది నీతి ఆయోగ్ ప్రతిపాదన! ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులు పేరుకే పరిమితమయ్యాయి. వసతులు లేక కునారిల్లుతున్నాయి. వాటిని బలోపేతం చేయడానికి బదులుగా కేంద్ర సర్కారు అనుసరించనున్న ఈ విధానం సామాన్య ప్రజానీకానికి వైద్యాన్ని మరింత దూరం చేస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అదే సమయంలో భారీ ఎత్తున అవినీతికి రాచ బాట వేసే అవకాశమందున్న విశ్లేషణలు వస్తు న్నాయి. ఆ దిశలో ఇప్పటికే అడుగులు వేసిన కర్నాటక అనుభవాలు క్లుప్తంగా:

దేశవ్యాప్తంగా రెండో స్థాయి, మూడో స్థాయి పట్టణాల్లో అంటు వ్యాధులుకాని రోగాలకు చికిత్స కోసం ప్రైవేటు భాగస్వామ్యాన్ని అమలు చేయాలని కేంద్ర సర్కారు భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ, నీతి ఆయోగ్ ఈ మేరకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. ప్రపంచబ్యాంకు భాగస్వామ్యంతో ఈ పథకం దేశ వ్యాప్తంగా అతి త్వరలోనే అమలులోకి రానుందని సమాచారం.

ప్రైవేటు ఎందుకు?

వ్యాధుల నివారణకు నిర్దిష్ట చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రస్తుతమున్న వ్యవస్థ అడ్డంకిగా మారిందని, అందువల్ల ప్రజలకు వైద్యాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ముందుకు తెస్తున్నామని నీతి ఆయోగ్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ కూడా.. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ రంగ మూ కొనసాగుతుందని, అదే సమయంలో పిపిపి వైద్యమూ అందుబాటులోకి వస్తుందని తెలిపింది. ఇప్పటికే మానవ వన రులు, మౌలిక సదుపాయాల కొరత కారణంగా గ్రామీణ ప్రజల్లో 72 శాతం మంది, పట్టణ ప్రజల్లో 79 శాతం మంది ప్రైవేటు రంగం లోనే ఆరోగ్య సేవలు పొందాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్యాన్ని అభివృద్ధి చేయడానికి నిర్దిష్ట చర్యలు తీసుకున్నట్లు నీతి ఆయోగ్ చెబు తున్నప్పటికీ దానికి తగ్గ ఆధారాలు ఎక్కడా కనిపించక పోవడం గమనార్హం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల నుండి మందుల వరకు అన్నింటికీ కొరత నెలకొంటున్న విషయం తెలిసిందే! మరి నీతి ఆయోగ్ పేర్కొన్న నిర్దిష్ట చర్యలేమిటో?. అదే సమయంలో భారీ ఎత్తున వైఫల్యాలు ఉన్నప్పటికీ ప్రపంచ బ్యాంకు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహి స్తోంది. ప్రపంచబ్యాంకు బాటలో నడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటువైపే మొగ్గుచూపుతున్నాయి.

పిపిపిలో సూపర్ స్పెషాల్టీ వైద్యసేవ ఇలా!

కర్నాటక ప్రభుత్వం 1997లో రాయ్‌చూర్ లో సూపర్ స్పెషాల్టీ వైద్య సౌకర్యాలు అందించేందుకు ఆర్‌జిఎస్ఎస్‌హెచ్‌ను ఏర్పాటు చేసింది. 73 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌కు పెట్రోలియం ఎగుమతి కంపెనీల సంస్థ నుండి రూ.60 కోట్ల ఆర్థిక సహాయం అందింది. సూపర్ స్పెషాలిటీ సేవలు అందించడంలో ఆర్‌జిఎస్ఎస్‌హెచ్‌లో పిపిపి పద్ధతిని అంచనా వేసేందుకు ప్రభుత్వ తనిఖీ బృందం హాస్పటల్‌ను సందర్శించింది. ఆ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం దశాబ్ద కాలంగా హాస్పిటల్ పనితీరుపై ఎటువంటి అధ్యయనం జరపలేదు. అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఇటు నిర్వహణ కాంట్రాక్ట్ తీసుకున్న అపోలో హాస్పిటల్స్ కానీ ఈ పని చేయలేదు. ఆర్‌జిఎస్ఎస్‌హెచ్ స్థాపించడంలో ప్రధాన ఉద్దేశం గుల్బర్గా డివిజన్ మొత్తం జనాభాలో దాదాపు 67 శాతంగా ఉన్న పేదరికపు గీతకు కిందనున్న వారి(బిపిఎల్) కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం. కానీ పదేళ్ల కాలానికి సంబంధించిన హాస్పిటల్ గణంకాలను పరిశీలిస్తే ఇన్ పేషెంట్లలో 25 శాతం వరకే బిపిఎల్ కుటుంబాలకు సేవలు అందించగా, అవుట్ పేషెంట్ల విషయంలో 15 శాతం మందికే సేవలు అందాయి. మొత్తం 350 బెడ్లలో 154 మాత్రమే పని చేస్తున్నాయి. అందులోనూ కేవలం 40 బెడ్లు మాత్రమే బిపిఎల్ కుటుంబాలకు అందుబాటులో ఉన్నాయి. ఇంత తక్కువ స్థాయిలో హాస్పిటల్ సామర్థ్యం వినియోగంలో ఉండడం పిపిపి మోడల్ నిర్వహణ పట్ల చిత్తశుద్ధినే ప్రశ్నిస్తున్నదని తనిఖీ బృందం తన నివేదికలో పేర్కొంది.

ఫీజు కట్టాల్సిందే ...!

బిపిఎల్ కుటుంబాలకు సరైన వైద్య సేవలు అందడం లేదంటూ కర్నాటక జన ఆరోగ్య సంస్థ నిజనిర్ధారణ కమిటీ, కర్నాటక రాజ్య రైతు సంఘం ఫిర్యాదు చేశాయి. ఆ తర్వాత బ్రోకర్లు, మధ్యవర్తులు కమిషన్ కోసం రోగులను తెచ్చి చేర్చారు. ఆ తర్వాత బిపిఎల్ కుటుంబాల నుంచి కూడా ఫిర్యా దులు వచ్చాయి. హాస్పిటల్ నిర్వాహకులు ముందు గా రూ.25 వేలు కట్టాలని అడిగారని, కార్డు రెగ్యులరైజ్ అయిన తర్వాత తిరిగి చెల్లిస్తామనే వారని రోగులు చెప్పారు. డబ్బులు కట్టిన తర్వాత రియంబర్స్‌మెంట్ కోసం కార్డు ఇస్తే అది రద్దు అయ్యిందంటూ హాస్పిటల్ నిర్వాహకులు చెప్పేవారని రోగులు పిర్యాదు చేశారు. ఇదో పెద్ద కుంభకోణంగా మారింది. ఈ వ్యవహారాన్ని స్థానిక సంఘాలు బయటపెట్టిన తర్వాత 144 బిపిఎల్ కుటుంబాలకు కార్డులిచ్చి బిల్లు మొత్తాలను తిరిగి చెల్లించారు. ఈ భాగోతాన్నంతా కర్నాటక ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి వివరించారు. దీంతో విచారణకు ఆదేశించారు. అయితే విచారణ కమిటీ అపోలో హాస్పిటల్‌ను సేకరించిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని మాత్రమే ఆదేశించింది. 2012 మే 31న అపోలోతో కాంట్రాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.

ప్రాథమిక వైద్యానికి గండి ఇలా!

కరుణా ట్రస్ట్ ఏడు రాష్ట్రాలైన కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సా, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్‌ల్లో 80 ప్రాథమిక చికిత్సా కేంద్రాలను నిర్వహించే ఒప్పందాన్ని కలిగి ఉంది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బోస్క్ ఫౌండేషన్, పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఇండియా డెవలప్‌మెంట్ ఫౌండేషన్, మెక్ ఆర్థర్ ఫౌండేషన్, కర్నాటక హెల్త్ ప్రమోషన్ ట్రస్ట్‌లతో కరుణా ట్రస్ట్ భాగాస్వామ్యాన్ని కలిగి ఉంది.

రాష్ట్రాలతో కరుణా ట్రస్ట్ సంతకం చేసిన పిపిపి ఒప్పందం ప్రకారం ఎటువంటి షరతులు పెట్టకుండా ఎవరైనా నిధులను దానమిస్తే ఆ మొత్తాన్ని ఆరోగ్య రక్షా సమితిలో డిపాజిట్ చేయాలి. ఒక వేళ ఏవైనా షరతులు ఉంటే వాటిని జిల్లా ఆరో గ్య సంఘానికి పంపించాలి. ఆరోగ్య రక్షా సమితిలో పంచాయితీరాజ్ సంస్థల ప్రతి నిధులు, ఎన్జీవోలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది సభ్యులుగా ఉంటారు. వీరంతా కలిసి ట్రస్టీలుగా ఆసుపత్రిని నిర్వహిస్తారు. సివిల్ వర్క్స్‌కు సంబంధించి రూ.లక్ష లోపు ఉన్న పనులన్నింటిపైనా ఆరోగ్య రక్ష సమితే నిర్ణయం తీసుకుంటుంది. అంతకన్నా ఎక్కువ మొత్తం అయితే జిల్లా ఆరోగ్య సంఘం అనుమతి కోసం పంపిస్తారు. అయితే కరుణా ట్రస్ట్ నిధుల సేకరణ సమయంలో నేరుగా ఒప్పందాలు చేసుకుంది. ఆరోగ్య రక్షా సమితిలను కనీసం సంప్రదించలేదు. ప్రాథమిక చికిత్సా కేంద్రం నిర్వహణకు నిధులను సమీకరించేందుకు గాను యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘించింది. ఆరోగ్య రక్షా సమితిలను పూర్తిగా విస్మరించి కరుణా ట్రస్ట్ మొబైల్ హెల్త్, దంత వైద్యం, టెలీ మెడిసిన్, అంటు వ్యాధులుకాని రోగాలు, సంప్రదాయ వైద్యం, అత్యవసర వైద్యం, ఔషధాలు, కంటి సంరక్షణ, పిల్లల ఆరోగ్యం, ఎయిడ్స్ వ్యాధులకు నిధులను సేకరించింది.

మృతదేహాలు మాయం!

కరుణా ట్రస్ట్ నడుపుతున్న ఒక ప్రాథమిక చికిత్సా కేంద్రంలో 2010 డిసెంబరులో 286 మంది రోగులు చనిపోయారు. చాలా మృతదేహాలు కనిపించకుండా పోయాయి. ఇదో పెద్ద సమస్యగా మారింది. ఆ ప్రాథమిక చికిత్సా కేంద్రంలో గడువు ముగిసిన మందులు ఉన్నాయి. కేంద్రాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ అర్హతపైన కూడా అనుమానాలు ఉన్నాయి. మరణాలపై ప్రాథమిక చికిత్సా కేంద్రం చెప్పే లెక్కలకు, అధికారగణం చూపిన లెక్కలకు పొంతన లేదు. ఆ తర్వాత పూర్తి స్థాయి విచారణకు ఆదేశించిన నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ సెల్వకుమార్ మాట్లాడుతూ.. 'లెక్కకు రాని మృత దేహాలను అమ్మేశారా లేదా వాటి అవయవాలతో వ్యాపారం చేశారా అన్నది తేలాల్సి ఉంది' అని పేర్కొన్నారు. ప్రాథమిక చికిత్సా కేంద్రం రిజిస్టర్‌లో ఎటువంటి రికార్డులు లేకుండానే డెత్ సర్టిఫికెట్లను జారీ చేయడం వల్లే ఈ అనుమానం వచ్చింది. కర్నాటక రాష్ట్ర గుల్బార్గా జిల్లాలోని వి.కె.సాల్గర్ గ్రామంలో జరిపిన ప్రజా విచారణలో కరుణా ట్రస్ట్ నడుపుతున్న ప్రాథమిక చికిత్సా కేంద్రంలోని వైఫల్యాలన్నీ బయటపడ్డాయి. నాణ్యత కల్గిన సేవలు లేక పుట్టిన పిల్లలు, తల్లులు చనిపోయారు. సరైన మౌలిక సదుపాయాలు లేవు. ఒక్కో ప్రసవానికి ఐదు వేల నుండి పది వేల రూపాయల వరకు వసూలు చేశారు.

ఒప్పందం నుంచి వెనక్కు ...!

ఇంత జరిగినా ఆరు సంవత్సరాల తరువాత 2016 జనవరి 6న కర్నాటక ప్రభుత్వం పిపిపిలో ఉన్న ప్రాథమిక చికిత్సా కేంద్రాలన్నింటినీ అప్పజెప్పాలని కరుణా ట్రస్ట్‌ను ఆదేశించింది. దాదాపు 52 ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఎన్జీవోలకు, ఛారిటబుల్ ట్రస్టులకు, ప్రయివేట్ మెడికల్ కాలేజీలకు అప్పగించిన ఆరోగ్య బంధు పథకాన్ని రద్దు చేసుకుంటున్నట్లు కర్నాటక ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నిబంధనలు పాటించక పోవడం, నిధుల దుర్వినియోగం, జవాబుదారీతనం లేకపోవడం, రోగులకు నాణ్యమైన సేవలను అందించడంలో విఫలం కారణంగా అన్ని ప్రాథమిక చికిత్సా కేంద్రాలను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. "మా నివేదిక ప్రకారం ప్రాథమిక చికిత్సా కేంద్రాల నిర్వహణలో జవాబుదారీతనం లేదు. కొన్ని ఎన్జీవోలు అవసరమైన డాక్టర్లను కూడా నియమించలేదు. కొన్నిచోట్లతే అయూష్ డాక్టర్లతో పని కానిచ్చేశారు. కొన్ని కేంద్రాల్లో శిక్షణ లేని నర్సులను నియమించారు" అని అప్పుడు ఆరోగ్య శాఖా మంత్రి చెప్పారు.

ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న వైఫల్యాల ఉదాహరణలను పరిగణనలోకి తీసుకోకుండా పిపిపి మోడల్‌ను అనుసరించాలని నీతి ఆయోగ్ నిర్ణయించడం దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. భారత విధాన నిర్ణేతలు ఆధారాలు గురించి మాట్లాడుతూ ఉండవచ్చు గానీ, వాస్తవంలో అన్ని ఆధారాలను పక్కకు తోసేసి ప్రపంచ బ్యాంక్, కార్పొరేట్ మాఫియా వైద్య రంగాన్ని కబళించడానికి సిద్ధంగా ఉన్నాయి. కర్నాటకతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ విఫలమైన పిపిపి మోడల్ ఒక ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఈ ప్రయోగం వల్ల ప్రజా ఆరోగ్య వ్యవస్థకు, ప్రజల ఆరోగ్యానికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు..?

కర్నాటక.. ఎపి.. తెలంగాణల్లో..

దేశవ్యాప్తంగా అమలు చేస్తామని నీతి ఆయోగ్ చెబుతున్న పిపిపి విధానం ఇప్పటికే కర్నాటకలో అమలవుతోంది. ప్రణాళికా సంఘం కర్నాటకలో రెండు ప్రభుత్వ-ప్రయివేట్ భాగస్వామ్య(పిపిపి) మోడల్స్‌ను చేపట్టింది. ఒకటి రాయ్‌చూర్‌లో రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రెండోది రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కరుణా ట్రస్ట్ ప్రాథమిక చికిత్సా కేంద్రాల నిర్వహణ, గ్రామీణ ఆరోగ్య సేవలను అందించడం. ఈ రెండూ ప్రాజెక్టులూ విఫలమయ్యాయి. పూర్తిస్థాయిలో, తక్కువ ఖర్చుతో వైద్యం అందించడానికి ఈ రెండు రకాల నమూనాలు పనికిరావని తేలిపోయింది. వాజ్‌పేయి ఆరోగ్యశ్రీ పథకం ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత చిన్నాభిన్నం చేసింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం గుర్తించిన ఆస్పత్రులు ప్రభుత్వ డబ్బుతో పేదలకు వైద్యాన్ని అందిస్తాయి. ఈ పథకం కారణంగా బెంగళూర్‌లోని ప్రయివేట్ ఆసుపత్రులన్నీ బాగుపడ్డాయి. ఈ పథకంలో లొసుగుల్ని నియంత్రించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు కార్పొరేట్ ఆసుపత్రులు అడ్డుపడుతున్నాయి. అంతేకాదు వైద్యాన్ని ఒక సరుకుగానే చూడాలనే భావనను కల్గిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ పథకం ఇదే నమూనాలో అమలవుతున్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రాల్లోనూ ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రులే లబ్ధి పొందుతున్న విషయం తెలిసిందే.

అభివృద్ధికి అడ్డుపడుతున్న జగన్ : కెఇ

ప్రజాశక్తి- నంద్యాల

నంద్యాల అభివృద్ధిని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఉపముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి ఆరోపించారు. మంగళవారం కర్నూలు జిల్లా నంద్యాలలో ఆయన మాట్లాడారు. నంద్యాలలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచి ప్రతిపక్షంగా ఉన్న జగన్మోహన్‌రెడ్డికి చేతులు కాళ్లు ఆడటం లేదన్నారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకోజూశారని, అది చేతకాకపోవడంతో నేడు నంద్యాల అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అవినీతిలో పుట్టి అవినీతిలో పెరిగిన సాక్షిని అడ్డం పెట్టుకుని వైసిపి అభివృద్ధి నిరోధకుల పార్టీగా మారిందని ధ్వజమెత్తారు. కేసుల నుంచి తప్పించుకోడానికే ప్రధాని మోడీ ముందు మోకరిల్లిన జగన్ అవినీతి, ఆరోపణల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి మైనార్టీలను అనేక ఇబ్బందులకు గురిచేసిన కారణంగా ముస్లిం మైనార్టీలు పూర్తిగా దూరమయ్యారని అన్నారు. మాజీ మంత్రి ఫరూఖ్‌కు పదవి రాకుండా అడ్డుపడిన ఘనత ఆయనదేనన్నారు. జగన్మోహన్‌రెడ్డి సొంత ప్రాంతంలో ఎమ్మెల్సీని గెలిపించుకోలేకపోయారని, అలాంటి వ్యక్తి నంద్యాలకు వచ్చి ఏమి చేస్తారని ఎద్దేవా చేశారు.

పిడుగుపాటుకు మరో రైతు మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లాలో మంగళవారం పిడుగుపాటుకు మరో రైతు మృతి చెందాడు. ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ గ్రామానికి చెందిన ఉప్పాడ పురుషోత్తం (35) పొలం పనులు చేసుకుంటున్న సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సమీపంలో పిడుగు పడటంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన రైతు లండ ముఖలింగం (58) పిడుగుపాటుకు సోమవారం మృతి చెందిన సంగతి తెలిసిందే.

వందేమాతరం, జనగణమన ఆలపించాల్సిందే

ప్రజాశక్తి - తిరువూరు

ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో తప్పనిసరిగా ప్రతిరోజూ అసెంబ్లీ నిర్వహించి వందేమాతరం, జనగణమన గీతాలాపన చేయాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి (ఆర్‌ఐఒ) ఆనంద్‌కుమార్ చెప్పారు. కృష్ణాజిల్లా తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడెడ్ జూనియర్ కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపల్స్‌తో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో ఇక నుంచి అసెంబ్లీ సమావేశం నిర్వహించి సూక్తితో కూడిన ఒక మంచి సందేశాన్ని విద్యార్థులకు వివరించాలన్నారు. జిల్లాలోని 266 కళాశాలల్లో దీనిని అమలు చేయాలన్నారు.

కొలిక్కిరాని టీచర్ల బదిలీలు

- కలెక్టర్, మంత్రి రోజుకో మాట
- విద్యార్థుల జీవితాలతో ఆట



ప్రజాశక్తి - చిత్తూరు ప్రతినిధి

రాష్ట్రంలో ఏ జిల్లాలోనూలేని విధంగా చిత్తూరు జిల్లాలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయి తరగతులు జరుగుతుంటే.. చిత్తూరు జిల్లాలో మాత్రం ఇంకా రేషనైలేజేషన్‌తోనే కుస్తీ పడుతున్నారు. దీంతో అటు ఉపాధ్యాయుల్లోనూ, ఇటు విద్యార్థుల్లోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వరుసగా మూడుసార్లు పదోతరగతిలో చివరి స్థానంలో ఉన్న ఈ జిల్లాలో ప్రభుత్వ తీరు మరింత ఆవేదనను మిగుల్చుతోంది.

రోజుకో నిర్ణయం

జిల్లాలో ఒక్క పాఠశాలను మూత వేసేందుకు వీల్లేదని కలెక్టర్ ప్రద్యుమ్న, మంత్రి అమర్‌నాథరెడ్డి ఆది నుంచీ ప్రకటిస్తూ వచ్చారు. అన్ని రకాల ప్రయత్నాలూ చేసి, ప్రభుత్వ నిర్ణయాల్లో భాగంగా జిల్లాలో 51 పాఠశాలలు మూతపడతాయని కలెక్టర్ ఇటీవల ప్రకటించారు. వీటిల్లో ప్రాథమిక పాఠశాలలు 20, ప్రాథమికోన్నత పాఠశాలలు 28, ఉన్నత పాఠశాలలు మూడు ఉన్నాయి. ఈ మేరకు అధికారులు రేషనైలేజేషన్‌ను ప్రారంభించారు. నెల రోజుల నుంచి వేచి చూస్తున్న ఉపాధ్యాయుల్లో దీనిపై హర్షం వ్యక్తమైంది. అయితే మంత్రి అమర్‌నాథరెడ్డి ప్రాథమిక పాఠశాలలన్నీ ఉంటాయని, ప్రభుత్వంతో మాట్లాడుతున్నాని చెప్పారు. దీంతో బదిలీ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో రేషనైలేజేషన్ పూర్తయ్యింది. నెల్లూరు మినహా అన్ని ప్రాంతాల్లోనూ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయి ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు చెబుతున్నారు.

బదిలీల కోసం పదివేల మంది ఎదురు చూపు

చిత్తూరు జిల్లాలో 10 వేల మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ఇది పూర్తయితే తప్ప వారు పూర్తి స్థాయిలో విద్యార్థులకు పాఠాలు చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. రేషనలైజేషన్ పూర్తయితే పాయింట్ల ఆధారంగా సీనియారిటీ జాబితా సిద్ధం చేయాల్సి ఉంది. తరువాత దీనిపై అప్పీళ్లు ఉంటాయి. ఇది ఒకే అయిన తరువాత మళ్లీ సినియారిటీ జాబితా సిద్ధం చేయాల్సి ఉంది. తరువాత బదిలీల షెడ్యూలు, ఉపాధ్యాయులు వారికి కేటాయించిన స్థానానికి వెళ్లేందుకు మరింత సమయం పడుతుంది. ఇలా ఈ తంతంగం పూర్తయ్యే సరికి కనీసం 20 రోజులు పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పిల్లల చదువులు కొండెక్కినట్టేనని విమర్శలు వస్తున్నాయి.

కేశవరెడ్డి బాధితులకు న్యాయం చేస్తాం

బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-నంద్యాల క్రైం

కేశవరెడ్డి బాధితులకు న్యాయం చేస్తామని వైసిపి రాష్ట్ర నాయకులు బొత్సా సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా నంద్యాలలో కేశవరెడ్డి బాధితులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శిల్పా మోహన్ రెడ్డి నివాసం వద్ద బొత్స సత్యనారాయణను కలిసి బాధితుల పక్షాన ప్రభుత్వంపై వత్తిడి తేవాలని వినతి పత్రం అందజేశారు. బాధితులు ముందుగా ఆర్‌టిసి బస్టాండ్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు ప్రదర్శన చేశారు. వీరి ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, నాయకులు సద్దాం హుసేన్, నర్సింహా, లక్ష్మన్, శ్రీధర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల నిమిత్తం లక్షల రూపాయలు వసూలు చేశారు. స్కూల్ మూసివేయడంతో 10,336 మంది కేశవరెడ్డి బాధితులు ఉన్నారని, వారికి మొత్తం రూ.300 కోట్లు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేశవరెడ్డిని కాపాడుతుందని, అతని ఆస్తులు జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మస్తాన్‌వలి మాట్లాడారు. కేశవరెడ్డి వియ్యంకుడు, మంత్రి ఆదినారాయణరెడ్డి కేశవరెడ్డి ఆస్తులను తన పేరుమీద రాయించుకుని బాధితులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. సంక్షేమ ప్రభుత్వంమని చెబుతున్న టిడిపికి చిత్తశుద్ధి ఉంటే కేశవరెడ్డి ఆస్తులమ్మి బాధితులకు డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ దృష్టికి కేశవరెడ్డి బాధితుల సమస్యను తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆదివాసీల ఆరోగ్య పరిరక్షణకు కృషి

రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ఆదివాసీల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని గిరిజన గురుకుల పాఠశాలల్లోనూ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో 'ఆదివాసీ ఆరోగ్యం' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. మంగళవారం గుంటూరులోని ఎస్‌టి బాలుర హాస్టల్‌లో ఆదివాసీ ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించి 'స్పర్శ్' మొబైల్ యాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపి, వారిలో తీవ్రమైన వ్యాధులుంటే ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలతో పోషకాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రంలో 565 గిరిజన పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను నియమించి వారి ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోన శశిధర్, స్థానిక ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ ఎయస్ రామకృష్ణ, గిరిజన సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో భూముల సర్వే రికార్డులను పరిశీలించాలి

లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ

ప్రజాశక్తి - అనకాపల్లి (విశాఖ)

ప్రతి 10, 15 ఏళ్లకు ఒక్కసారైనా క్షేత్రస్థాయిలో భూముల సర్వే రికార్డుల పరిశీలన జరగాలని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ తెలిపారు. పట్టణంలోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి క్రయవిక్రయాలు సేల్‌డీడ్‌తో సరిపుచ్చకుండా టైటిల్ డీడ్ గుర్తించే విధంగా చట్టాన్ని మార్పు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తొలిత భూములు రికార్డులు, సర్వే విధానం, రెవెన్యూ సేవలపై విషయ పరిజ్ఞానం కలిగించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. రికార్డుల నమోదుపై సరైన అవగాహన లేకపోవడం వల్ల తప్పులు దొర్లుతున్నాయని, వాటిని సరిచేయడం కష్టతరం కాదని పేర్కొన్నారు.ఆచరణ సాధ్యమైన సేవలు అందించడంలో కూడా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడం ఆక్షేపణీయమన్నారు.



షాపు వద్ద గుమిగూడిన బాధితులు

బోర్డు తిప్పేసిన సాయిరామ్ ట్రేడర్స్

రూ.2 కోట్లతో ఉడాయించిన మోసగాళ్లు

ప్రజాశక్తి-సత్యవేడు (చిత్తూరు)

'సగం ధరకే వస్తువులు ఇస్తాం' అని నమ్మబలికి దాదాపు 400 మంది దగ్గర రూ.2 కోట్లను వసూలు చేసి సాయిరామ్ ట్రేడర్స్ బోర్డు తిప్పేసి ఉడాయించింది. విషయం తెలుసుకున్న బాధితులు మంగళవారం షాపు వద్దకు వచ్చి లబోదిబోమన్నారు. బాధితుల కథనం మేరకు.. గత నెల 13న సత్యవేడు పెట్రోల్‌బంక్ సమీపంలోని కాంప్లెక్స్‌లో 'సాయిరామ్ ట్రేడర్స్ మరియు ఆర్డర్ సప్లయర్స్' పేరుతో నూతన షాపును ప్రారంభించారు. ప్రారంభ ఆఫర్‌గా ఆడినెల (ఆషాడమాసం) పూర్తిగా 10-40 శాతం వరకు తక్కువ ధరకు వస్తువులను అందిస్తామని ప్రకటించారు. బీరువా, వాషింగ్‌మిషన్, ఎల్ఇడి టీవీ, ఫోన్లు, వంటసామాగ్రి అన్ని రకాల వస్తువులను 40 శాతానికే విక్రయించనున్నట్లుగా షాపులో ప్రదర్శనకు ఉంచారు. డబ్బు కట్టిన వారికి 10 రోజుల తరువాత వస్తువులు ఇస్తామని నమ్మబలికారు. ముందుగా డబ్బు కట్టి ఆర్డర్ చేయడం వలనే ఇంత తక్కువ ధరకు ఇవ్వగలుగుతున్నామన్నారు. మొదట్లో డబ్బు కట్టిన కొంతమందికి తక్కువ ధరకే వస్తువులను ఇవ్వడంతో జనం నమ్మారు. తాము దాదాపు రూ.25 లక్షలు షాపుకు అడ్వాన్స్ ఇచ్చినట్లు చెప్పారు. పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ వద్ద డబ్బులు చెల్లించారని రశీదులు చూపించారు. మంగళవారం ప్రజలు వస్తువుల కోసం షాపు వద్దకు వెళ్లగా చాలా సేపటి వరకూ షాపు తెరవకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా షాపు యజమానులు వారి నివాస స్థలం నుంచి ఉడాయించినట్లు తెలిసింది. రూ.100 నుంచి రూ.3 లక్షల వరకు కట్టిన బాధితులు షాపు ముందు గగ్గోలు పెట్టారు. పెద్దఎత్తున జనం పోగవడంతో ఎస్ఐ మల్లేష్‌యాదవ్ పోలీసు బృందంతో షాపు వద్దకు చేరుకుని బాధితుల ఫిర్యాదులను స్వీకరించారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. షాపు యజమానుల అడ్రస్సును, ఆధార్‌కార్డు, జిఎస్‌టి వివరాలను పోలీసులకు అందించారు. ఎటువంటి గ్యారంటీ లేకుండా ఇటువంటి వ్యాపారాలు చేస్తుంటే ముందుగా పోలీసులకు ఎందుకు అనుమానం రావడం లేదని సోమశేఖర్ ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

సామాన్యునిపై గ్యాస్ బాంబు

కార్పొరేట్ల సేవలో తరిస్తున్న బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్యుని ఇంట గ్యాస్ బాంబు పేల్చింది. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పతనమవుతున్న నేటి పరిస్థితుల్లో వంటగ్యాస్ వినియోగదారులకు ఊరట కల్పించాల్సిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా సామాన్యుల నడ్డి విరిచేందుకు పూనుకుంది. పెట్రోల్, డీజిల్ ధరలపై నియంత్రణ ఎత్తేసి, వినియోగదారులను మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేసిన విధానాల దుష్పరిణామాలేమిటో నేడు మనం అనుభవిస్తున్నాం. దాని నుంచి గుణపాఠం తీసుకోవడానికి బదులు అవే విధానాలను మరింత ఉధృతంగా అమలు చేయాలని చూడడం ప్రభుత్వ దుర్మార్గానికి, ప్రజావ్యతిరేక ధోరణికి నిదర్శనం. స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ సంస్థల ప్రాపకం కోసం నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వ తాజా చర్య వంటగ్యాస్‌ను సామాన్యులకు అందుబాటులో లేకుండా చేస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా, ఇక్కడ పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. పెట్రోల్, డీజిల్ ధరలను అదే పనిగా పెంచుకుంటూ పోతుండడంతో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వంట గ్యాస్‌పై సబ్సిడీని ఎత్తివేస్తే సామాన్యుడి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. ఇప్పటికే వంటగ్యాస్ సబ్సిడీపై చాలా వరకు కోత పెట్టిన సర్కార్, దానిని పూర్తిగా ఎత్తేసేంతవరకు నిద్రపోనంటున్నది! అటు పొయ్యి మీది, పొయ్యి కింది వాటి ధరలను పెంచుతూ సామాన్యుల జీవితాలతో ప్రభుత్వం క్రూర పరిహాసమాడుతున్నది.

చావు కబురు చల్లగా చెప్పినట్లు 2018 మార్చినాటికి లేదా వీలైతే అంతకన్నా ముందే గ్యాస్ సబ్సిడీకి పూర్తిగా మంగళం పాడాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో వున్నట్లు సంబంధిత శాఖామాత్యులు ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం లోక్‌సభకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో చాలా చక్కగా సెలవిచ్చారు. ఒకేసారి సబ్సిడీని పూర్తిగా ఎత్తివేస్తే ప్రజల నుంచి ఎక్కడ ప్రతిఘటన ఎదురవుతుందోనన్న భయంతోనే బిజెపి ప్రభుత్వం ఈ 'స్లో పాయిజన్' పద్ధతిని చేపట్టింది. జూన్ ఒకటి నుంచి గ్యాస్ సిలిండర్‌పై ప్రతి నెలా నాలుగు రూపాయలు చొప్పున పెంచుకుంటూ, సబ్సిడీ పూర్తిగా రద్దయ్యేంతవరకు కొనసాగిస్తామని మంత్రి వెల్లడించారు. తాము అధికారంలోకి వస్తే ప్రజల సామాజిక, ఆర్థిక జీవన స్థితిగతులను సమూలంగా మార్చేస్తామని బిజెపి అంటే ప్రజలు నిజమే అనుకున్నారు. తమపై బిజెపి ప్రభుత్వం ఈ విధంగా యుద్ధం ప్రకటిస్తుందని వారు ఊహించలేకపోయారు. మోడీ ప్రభుత్వం గత మూడేళ్లలో వంట గ్యాస్ ధరను అర డజను సార్లు పెంచేసింది. గత నెలలో సిలిండర్‌పై ఒకేసారి 32 రూపాయలు వడ్డించింది. గత ఏడాది జులై 1 నుంచి ప్రతి నెలా రెండు రూపాయలు చొప్పున పెంచుకుంటూ వస్తున్నది. ఈ సబ్సిడీ ఉపసంహరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు జూన్1 నుంచి సిలిండర్‌కు నాలుగు రూపాయలు చొప్పున పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితమే ఉత్తర్వులు జారీ చేసినా, మంత్రి పార్లమెంటులో వెల్లడించేంతవరకు అందులోని వివరాలు పూర్తిగా బయటకు రాలేదంటే ప్రభుత్వం ఈ విషయంలో ఎంత మోసకారిగా వ్యవహరించిందీ విదితమవుతుంది.

సబ్సిడీలేకుండా గ్యాస్ కొనుక్కోగలిగే స్తోమత వున్నవారు స్వచ్ఛందంగా సబ్సిడీని వదులుకోవాలని తానిచ్చిన పిలుపునకు అద్భుతమైన స్పందన వుందంటూ ఆర్భాటంగా ప్రచారం చేసిన మోడీ ప్రభుత్వం ఇంతలోనే తన వైఖరిని మార్చుకోవడంలో ఆంతర్యమేమిటి? గ్రామీణ పేద మహిళలకు ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని పెద్దయెత్తున టముకు వేసుకున్న ప్రభుత్వం ఇప్పుడు వారిని నట్టేట ముంచింది. కారణం పైకి ఏం చెప్పినప్పటికీ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఇదంతా చేస్తున్నదనేది నిర్వివాదాంశం. జిఎస్‌టి పేరుతో అత్యధిక సంఖ్యాకులుగా వున్న సామాన్య ప్రజానీకంపై మోడీ ప్రభుత్వం పెద్దయెత్తున భారాలు మోపింది. ఇంకో వైపు సంపన్నులకు పలు రాయితీలిచ్చింది. మహిళలు వినియోగించే శానిటరీ నాప్‌కిన్స్, వికలాంగులు ఉపయోగించే పరికరాలపై అధిక శాతం పన్ను వేసిన ప్రభుత్వం సంపన్నులు ఉపయోగించేవాటిపై తక్కువ పన్నులు వేసింది. తన బొక్కసం నింపుకోవడానికి ఈ విధంగా సామాన్యులపై భారాలు మోపడానికి పూనుకోవడం హేయమైన చర్య. గ్యాస్ సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయడం వల్ల వంట గ్యాస్ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతుంది. పేద మహిళలు వంటగ్యాస్ నుంచి తిరిగి కట్టెల పొయ్యివైపు నెట్టే ఈ చర్యను ఎంతమాత్రమూ అనుమతించరాదు. మహిళలు కన్నెర్ర చేయకముందే ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి.

మహనీయుల మాట




నీ కష్టాన్ని చూసి ఇంకెవరో నవ్వితే నవ్వనీ ఏం పర్వాలేదు. కానీ నువ్వు మాత్రం ఇంకొకరి కష్టాన్ని చూసి ఎప్పుడూ నవ్వకు.

- చార్లీ చాప్లిన్

చచ్చేంత చావొచ్చింది

ప్రజాగళం

చావు పుట్టుకలు చాలా సహజం వాటి గురించి చింతించుట అనవసరమని గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఈ విషయం కొందరు చదివుండొచ్చు, ఎక్కువ మంది ఘంటసాల వారి గళంలో విని ఉండొచ్చు. అంతలా పాడారాయన. ఆ విషయమే కాక ఇంకెన్నో చెప్పారందులో. ఐనా ఘంటసాల గీత వినబడిందంటే మాత్రం ఒకటే భావన. ఎవరో పోయారని. మహాప్రస్థాన రథాల్లో అదే పెడతారు. ఇక ఎటూ తప్పని ఆ 'పోయిన' విషయాన్ని పూర్వం వార్తాహరులు అంటే కొరియర్స్ తీసుకెళ్ళేవారు. వాళ్ళు ఆ విషయం, ఈ విషయం చెప్పి చావు కబురు చల్లగా చెబుతారు, వినేవాళ్ళకు టెన్షన్ లేకుండా. అదో టెక్నిక్. అందుకే అది నానుడిగా మారింది. ఇక అసలు విషయానికొద్దాం. పుట్టుక, గిట్టుక రెండూ సమానం కాబట్టి రెండూ నమోదు చేయాలన్నది ఏలినవారి ఆజ్ఞ. ఇప్పుడంటే నర్సింగుహోములొచ్చాయి కాబట్టి పట్టణాల్లో, మహా నగరాల్లో అది పెద్ద విషయం కాదు. పల్లెల్లో కూడా పుట్టిన వారి వివరాలు రాయించాలి. అలాగే పోయిన వారివీను. ఈమధ్య ఓ తెలిసినాయన తన ఇద్దరు తమ్ముళ్ళను, ఓ చెల్లిని పట్టుకొని తన తండ్రి ఆస్తి పంపకం చేసుకోవటానికని రిజిస్ట్రారు కార్యాలయానికి పోతే అక్కడ వారసత్వ సర్టిఫికెట్, తండ్రి మరణ ధృవపత్రం తెమ్మన్నారు. ఆయన పోయి నాలుగేళ్ళవుతోంది. కర్మకాండలు చేశారే కాని ఎక్కడా నమోదు చేయించలేదు. ఆ పని ఎవ్వరూ చేయటం లేదు. ఎవ్వరూ చెప్పలేదు కూడా. ఇక వారి తగాదాలతో పాటు, పోయిన ఆసామి పోయిన తేదీని, కర్మకాండలు చేసిన అయ్యవారి దగ్గర కనుక్కొని నానా అవస్థలూ పడుతున్నారు. ఇలాంటి కేసులెన్నో. ఆ తేదీ వివరాలు తీసుకొని విఆర్వో దగ్గరికో, రెవెన్యూ ఇనెస్పెక్టర్ దగ్గరికో పోయి దరఖాస్తు పెట్టి, మండల రెవెన్యూ అధికారి సంతకం తీసుకొని చివరికి ఆర్డీవో సంతకానికి పోవాలి. ఇదంతా పూర్తయ్యేటప్పటికి ఆ పోయినవాడికి దగ్గర దగ్గరగా ఈ బతికినోడూ పోయినట్టుంటుంది. ఇక ఆ ఆర్డీవో సంతకం అయ్యాక మున్సిపల్ ఆఫీసుకు పోయి అసలు సర్టిఫికెట్ తీసుకోవాలి.




ఇదంతా చూస్తే 'ప్రజల వద్దకు పాలన' అన్న ఏలిన వారి మాటల్ని ఎంతవరకు నమ్మాలి? ప్రజల వద్దకు మందు బాటిళ్ళు సరాసరి వచ్చి పడుతున్నాయి, కాని మిగతా పనులు అవుతున్నాయా? ఈ జనన మరణాల కోసం ఓ సింగిల్ విండో తెరవలేరా? కోట్లు విలువ చేసే బస్సులో వచ్చి రాత్రి వూర్లో బస చేసిన వ్యక్తికి మిగతా కష్టాలు తెలియవా? తెలిసెను పో ఏమైనా చేశాడా అన్న అనుమానాలు రావడం అతి సహజం. వీడియో కాన్ఫరెన్సులు, సింగపూరు తరహా పాలనలు ఆశ చూపే సదరు నాయకులకు అర ఎకరా భూమిని సొంత అన్నదమ్ములు పంచుకోవాలంటే ఎంతకష్టమో తెలిసేదెట్టా. రాజధానికి భూమి సేకరించటానికి అంత కష్టమైన రూల్సు ఏమీ ఉండవు కాని సామాన్యుడికి చావు సర్టిఫికేట్ సంపాదించాలంటే చచ్చేంత చావొస్తుందని ఏ పేపరులో రాస్తే దొరవారు చూస్తారో ఎలా తెలియటం? ఆయనకి ఎలా తెలియజేయటం? వచ్చే ఎన్నికల్లో ఈ సమస్యని పరిష్కరిస్తామని మానిఫెస్టోల్లో పెడతారా? ఇదివరకు చెప్పిన వాటికే గతిలేదని నిట్టూర్చాలా? గీతలో చెప్పినట్టు పుట్టినవాడు మరణించక తప్పదు, మరణించినవాడు పుట్టకా తప్పదు తరహాలో... గెలిచినవాడు ఓడక తప్పదు, ఓడినవాడు గెలవకా తప్పదు అని సామాన్యుడు అనుకోవాలేమో!!

జంధ్యాల రఘుబాబు

యాగం చేస్తే సిఎం యోగమా?

యజ్ఞయాగాలన్నీ కొంతమంది పొట్ట నింపుకొనేందుకు పన్నిన పన్నాగమేనని 400 ఏళ్ళ క్రితమే ప్రజా కవి వేమన ఎలుగెత్తి చాటాడు. ఈ మధ్య యజ్ఞయాగాల పిచ్చి విపరీతంగా పెరిగిపోయింది. ఆదిమ కాలంలోని మనిషి శాస్త్రీయ దృష్టి లేక యజ్ఞయాగాల వల్ల దేవతలు శాంతించి తమకు కావలసిన సౌకర్యాలు కలుగజేస్తారని భావించేవారు. పిల్లలు పుట్టకపోవడానికి కూడా కారణాలు తెలియక పుత్ర కామేష్టి యాగాలు, రావి చెట్టుకు, వేప చెట్టుకు వివాహాలు, శత్రువులను చంపేందుకు శత్రు సంహారక యాగాలు, వర్షం కోసం వరుణ యాగాలు చేసేవారు. మరి సైన్స్ ఇంతగా పెరిగిన ఈ రోజుల్లో ఏమొచ్చిందీ జనానికి? ఆస్పత్రుల్లో వైద్యం చేసి రోగాలు తగ్గించవలసిన డాక్టర్లు మృత్యుంజయ యాగాలు చేస్తున్నారు. ఇంత అసమర్థులైన డాక్టర్లను ఆ ఉద్యోగం నుంచి వెంటనే తొలగించాలి. వీరి చర్యల వలన వైద్య వృత్తి అపహాస్యం అవుతోంది. అప్పట్లో తెలంగాణ కోసం కెసిఆర్ చండీ యాగాలు చేశారు. ఆయన యాగాలు చెయ్యడం వలన రాష్ట్ర విభజన జరగలేదు. ప్రత్యేకరాష్ట్రం నినాదంతో ప్రజలను రెచ్చగొట్టారు, దాని ఫలితంగానే రాష్ట్రం ఏర్పడింది. ఇదిలావుంటే ఎపి లోని ప్రతిపక్ష నాయకుడు వచ్చే ఎన్నికల్లో ఎపికి ముఖ్యమంత్రి కావాలన్న కోరికతో వున్నారు. దీంతో ఆ పార్టీ అధికార ప్రతినిధి హైదరాబాదులోని మలక్‌పేటలో శ్రీ మహారుద్ర సహిత సహస్ర చండీయాగం తలపెట్టారు. వైజ్ఞానిక మార్పునే ఈ చర్య అపహాస్యం చేసినట్లు అయ్యింది. ముమ్ముందు బడి పంతుళ్ళు కూడా పిల్లలకు చదువు చెప్పడం మానుకొని సరస్వతి యాగాలు చేసినా చేయవచ్చు. మంత్రులు కూడా ప్రజల సంక్షేమాన్ని చూడటం చేతకాక సంక్షేమ యాగాలు చేసినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. 1924లో తమిళనాడులో రామస్వామి నాయకర్‌ను చంపేందుకు అక్కడ పురోహిత వర్గం శత్రుసంహార యాగం చేసింది. అయినా ఆయన వచ్చి యజ్ఞ గుండంలో పడలేదు. ముఖ్యమంత్రులు కావాలంటే ప్రజల మనస్సులు గెలుచుకోవాలే గాని ఇలా యాగాలు చేయడం ఏమిటి? ప్రజలతో పని లేకుండానే అధికారం వచ్చేస్తుందా? వారి అవసరం లేకుండానే ముఖ్యమంత్రి అయిపోతారా? ఏది ఏమైనా మేధావులు అనుకుంటున్న వారు, రాజకీయ నాయకులు ఇటువంటి చిల్లర పనులను ఇకనైనా మానుకోవాలి.



నార్నె వెంకటసుబ్బయ్య, ఎపి హేతువాద సంఘ అధ్యక్షులు


మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్ : editpageps@gmail.com

చిరునామా
ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం. 27-30-4,
ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

రుణమాఫీ చేయక తప్పదు!



ప్రభాత్ పట్నాయక్

రైతుల రుణ మాఫీ డిమాండ్ పట్ల చాలా అపోహలున్నాయి. అలాంటి రుణ మాఫీతో దేశంలో అప్పు-సంస్కృతి (క్రెడిట్ కల్చర్) బలహీనపడుతుందని విమర్శకులు వాదిస్తున్నారు. వీరి వాదనలు ఇలా ఉన్నాయి: 'రుణ మాఫీ తర్వాత తమ అప్పులను మాఫీ చేస్తారనే ఆశతో ప్రజలు తాము తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించరు. కొన్నేళ్ల క్రితం యూపీఏ ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేసింది. అయినప్పటికీ రైతులు తిరిగి అదే డిమాండ్‌ను ముందుకు తెస్తున్నారు. రైతులు అప్పులు కట్టటానికి బదులుగా తరచూ రుణ మాఫీ డిమాండ్ చేస్తుంటారు. అంతేకాకుండా ఈ భారాన్ని ఎవరో ఒకరు భరించవలసి ఉంటుంది. రైతులు ఆపని చేయకపోతే ఆ భారం ప్రభుత్వ బడ్జెట్లను కుంగదీస్తుంది. దాంతో సమాజం మొత్తం నష్టపోతుంది'.

ఈ వాదనల వెనుక సదుద్దేశం ఉన్నదని మనం అనుకున్నా ఇవి పూర్తిగా తప్పుడు అవగాహనపై ఆధారపడి చేసినవి. ఇది తెలియాలంటే ఆర్థిక వ్యవస్థలో క్రెడిట్ ఎలా చెలామణీలో ఉంటుందో ముందుగా మనం పరిశీలించాలి. సులభంగా అర్థం కావటానికి ఈ ఉదాహరణ తీసుకుందాం. ఒక రైతు రూ.100 ఆధార విలువగల తన పంట కోసం రూ.100 అప్పు చేశాడని అను కుందాం. రైతు తన పంటను అమ్ముకోవటానికి మార్కెట్‌కు తీసుకుపోయి నప్పుడు ఆ పంటను కొనదలచిన వ్యాపారి బ్యాంకు నుంచి రూ.100 అప్పు తీసుకుంటాడు. ఇలా తన పంటను అమ్మగా వచ్చిన డబ్బును రైతు బ్యాంకుకు చెల్లిస్తాడు. కాబట్టి బ్యాంకుకు రావలసిన బకాయి శేషం రూ.100 గానే ఉంటుంది. కానీ ఈ అప్పు చెలామణీలో ఉండగా అప్పు తీసుకున్నవాడు మారతాడు. ప్రారంభంలో రైతు రూ.100 బాకీ ఉంటాడు. అయితే ఇప్పుడు వ్యాపారి బ్యాంకుకు చెల్లించాల్సిన అప్పు కొనసాగుతుండగా రైతు బ్యాంకు నుంచి తీసుకున్న అప్పు తీరిపోతుంది.

అయితే అప్పుకు సంబంధించిన ఈ మొత్తం చెలామణీ ప్రక్రియలో తీర్చకుండా మిగిలిపోయిన బకాయికి సమానంగా సరుకుల నిల్వలు ఉంటాయి. ఉత్పాదకాల(ఇన్‌పుట్స్)ను కొనటానికి రైతు అప్పు తీసుకున్నప్పుడు ఈ ఉత్పాదకాల నిల్వ విలువ తీసుకున్న అప్పుకు సమానంగా ఉంటుందనేది స్పష్టం. ఆ తరువాత రైతు వద్ద నిల్వ వున్న పంట తీసుకున్న అప్పుకు సమానంగా ఉంటుంది. ఇంకా ఆ తరువాత వ్యాపారి దగ్గరున్న సరుకు అతను చేసిన అప్పుకు సమానంగా ఉంటుంది. అప్పు చెలామణీలో ఉన్నప్పుడు సరుకు రూపం, సరుకు స్థానం మారుతుంది. అయితే విలువ ప్రాతిపదికన చూసినప్పుడు ఎల్లవేళలా సమాన విలువగల నిల్వలుంటాయి. కాబట్టి బ్యాంకులు వత్తిడికి గురికావటమనే ప్రశ్నే (కరువు, ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు తప్ప) తలెత్తదు. నిల్వ సరుకును వినిమయదారుకు అంతిమంగా అమ్మినప్పుడు వచ్చే డబ్బు అప్పు తీర్చే క్రమంలో తిరిగి బ్యాంకుకు చేరుతుంది. కాబట్టి ప్రకతి విపత్తులు లేనప్పుడు, ఆధార ధర కొనసాగుతున్నప్పుడు రుణమాఫీ అడగటానికి కారణం కనపడదు. అలాగే బ్యాంకులు 'ఒత్తిడి'కి గురికావటం ఉండదు. వేరే మాటల్లో చెప్పాలంటే ఉత్పత్తికి చెందిన స్టాక్స్(నిల్వలు)కు అనుగుణమైన ధరలు లేనప్పుడు ఇచ్చిన అప్పు తిరిగి వచ్చే అవకాశం ఉండదు. కనుక బ్యాంకులు దివాళా తీస్తాయి.

ప్రకృతి విపత్తుల కారణంగా ఉత్పత్తి పడిపోవటం వల్ల రుణమాఫీ చేయాలని రైతులు ప్రస్తుతం డిమాండ్ చేయటం లేదు. అందుకు భిన్నంగా ఈ ఏడాది పంటలు బాగా పండాయి. పంటలు బాగా పండటం వల్ల ధరలు పడిపోవటంతో ఇలా డిమాండ్ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అంటే పైన వివరించిన ఉదాహరణ లోలాగా కొనసాగుతాయని అనుకున్న ఆధార ధరలు కొనసాగకపోగా పతన మయ్యాయి. ఈ పరిస్థితిలో పైన వివరించిన ఉదాహరణ ఎలా ఉంటుందో చూద్దాం.



మొదటిది, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు చెల్లించలేకపోవటానికి కారణం వారికి తీసుకున్న అప్పు తీర్చకపోవటమనే చెడు అలవాటు ఉండటంవల్ల కాదు. రెండవది, ప్రస్తుతం రుణమాఫీ జరిగి బ్యాంకులకు ఇక చెల్లించాల్సింది ఏమీ లేనప్పటికీ భవిష్యత్తులో కూడా ఇదే పరిస్థితి పునరావృతమౌతుంది. రుణమాఫీ డిమాండ్ మరలా మరలా ముందుకు రావటానికి కారణం రైతాంగం ఒకసారి లాభం పొంది, తిరిగి ఎదురుచూడటం అలవాటుగా మారటంవల్ల కాదు. అంటే వారికి దురాశ ఏర్పడటంవల్ల కాదు.

రైతాంగంలో చాలావరకు తమ ఉత్పత్తులను నిల్వ ఉంచుకునే సామర్థ్యం లేనందున ఉత్పత్తి 10 శాతం పెరిగిందని అనుకుంటే ధరలు 10 శాతం కంటే ఎక్కువగా పతనమవుతాయి. దాంతో రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంట విలువ తగ్గిపోతుంది. అయితే దిగుబడి తగ్గినప్పుడు రైతులకు ఈ పరిస్థితి ఏర్పడదు. కాబట్టి పై ఉదాహరణలో రూ.100 అప్పుగా తీసుకున్న రైతుకు తాను పండించిన పంటను వ్యాపారికి అమ్మగా వచ్చిన విలువ కేవలం రూ.70 అనుకుందాం. రైతు పండించిన పంటను కొనటానికి బ్యాంకులు ఈ 70 రూపాయలను వ్యాపారికి అప్పుగా ఇస్తాయి. ఈ రూ.70 రైతు ద్వారా బ్యాంకుకు తిరిగి చేరుతుంది. రైతు తీసుకున్న అప్పు రూ.100లో రూ.70 తీర్చగా రూ.30 బాకీ ఇంకా మిగిలే ఉంటుంది. ఇలా రైతు చెల్లించలేక మిగిలిపోయిన రూ.30 బాకీ బ్యాంకుల నిరర్థక ఆస్తిగా మారుతుంది. అయితే పంట కొన్నందుకు వ్యాపారి రైతుకు రూ.70 చెల్లిస్తాడు. కానీ ఈ వ్యాపారి వాస్తవంలో ఇదే పంటను రూ.100 కంటే తక్కువకు అమ్మడు. పంటలు బాగా పండినప్పుడు తగ్గిన ధరలతో ఏర్పడిన ప్రయోజనాలు వినియోగదారుడికి పూర్తిగా చేరవు. ఉత్పత్తిదారుకు, వినిమయదారుకు మధ్య ఎక్కడో ఈ పతనం పెద్ద ఎత్తున లాభంగా పరిణమించి గ్రహించబడుతుంది. 'వ్యాపారి' అనే పదాన్ని నేను వాడినప్పుడే అలా లాభపడేది ఎవరనేది తేలిపోయింది.

కాబట్టి పైఉదాహరణలోని అలాంటి వ్యాపారి బ్యాంకు నుంచి తీసుకున్న అప్పు రూ.70 కాగా అతని స్వాధీనంలో ఉన్న నిల్వ విలువ రూ.100గా ఉంటుంది. కాబట్టి వాస్తవంలో రైతుకు ఏర్పడిన లోటు రూ.30 కాగా ఆ మేరకు అది 'బ్యాంకుకు చెల్లించబడని అప్పు' అనే సమస్యగా మిగిలిపోతుంది. అదే సమయంలో వ్యాపారి సంపద సరిగ్గా ఆ మేరకు పెరుగుతుంది. అయితే బ్యాంకు తాను ఇచ్చిన అప్పును చెల్లించాలని వ్యాపారిని ఒత్తిడి చేయలేదు. తాను తీర్చగా మిగిలిన రూ.30 అప్పును తీర్చటానికి వనరులను సమీకరించమని రైతు వ్యాపారిని అడగలేడు.


ఈ కేసులో కూడా తీర్చని మొత్తం అప్పు రూ.100లే. ఈ రూ.100లో వ్యాపారికి అప్పుగా ఇచ్చిన రూ.70, రైతు తనకు ఇచ్చిన అప్పులో తీర్చలేక మిగిలిన రూ.30 ఉన్నాయి. వ్యాపారి దగ్గర వినియోగదారుకు అమ్మటానికి సిద్ధంగా వున్న స్టాకు విలువ రూ.100 ఉంటుంది. అయితే ఈ సరుకు స్టాకు మీద బ్యాంకుకు ఎటువంటి అధికారం లేదు. బ్యాంకుకు వ్యాపారి చెల్లించవలసింది రూ.70 మాత్రమే. తిరిగి చెల్లించని సమస్యగా మనం పిలిచే విషయం రైతు నుంచి వ్యాపారికి బదిలీ అయినది తప్ప మరొకటి కాదు. ఇలా బదిలీ కావటం వల్లనే బ్యాంకుల వ్యాపారం దెబ్బతింటున్నది. ఇప్పుడు మిగిలిన రూ.30 చెల్లించాలని బ్యాంకు రైతుపై ఒత్తిడి తెస్తే రైతు నిస్పృహ చెంది అన్ని చోట్లా జరుగుతున్నట్టుగా ఆత్మహత్య కూడా చేసుకునే అవకాశం ఉంటుంది. రైతుకు ఇటువంటి గతిపట్టకుండా ఉండటానికే రుణమాఫీ జరగాలని రైతాంగం ఉద్యమిస్తున్నది.

ఈ చిన్న ఉదాహరణ నుంచి అనేక విషయాలు మనకు అర్థమౌతాయి. మొదటిది, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు చెల్లించలేకపోవటానికి కారణం వారికి తీసుకున్న అప్పు తీర్చకపోవటమనే చెడు అలవాటు ఉండటంవల్ల కాదు. రెండవది, ప్రస్తుతం రుణమాఫీ జరిగి బ్యాంకులకు ఇక చెల్లించాల్సింది ఏమీ లేనప్పటికీ భవిష్యత్తులో కూడా ఇదే పరిస్థితి పునరావృతమౌతుంది. రుణమాఫీ డిమాండ్ మరలా మరలా ముందుకు రావటానికి కారణం రైతాంగం ఒకసారి లాభం పొంది, తిరిగి ఎదురుచూడటం అలవాటుగా మారటంవల్ల కాదు. అంటే వారికి దురాశ ఏర్పడటంవల్ల కాదు. దీనికి కారణం ఆర్థిక వ్యవస్థ నిర్మాణ స్వభావం వల్ల పంటలు బాగా పండినప్పుడు ధరలు పతనమవటం. మూడవది, బ్యాంకులకు తీర్చని అప్పులు పేరుకు పోవటానికి కారణం అవి అప్పుగా ఇచ్చిన డబ్బు గాలిలో కలిసిపోవటంవల్ల కాదు. అయితే బ్యాంకుల డబ్బు వ్యాపారులకు బదిలీ కావటంవల్ల ఇలా జరుగుతున్నది. ఇలా బదిలీ అయిన డబ్బును తాకటానికి రైతుకు తాహతు చాలదు. బ్యాంకులకు ఆ అధికారం ఉండదు.

సంస్థాగత యంత్రాంగ వైఫల్యం 'అలవాటు'గా రైతులు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తారని విమర్శించేవారు పంటలు బాగా పండినప్పుడు ధరలు పతనం కాకుండా తగిన సంస్థాగత ఏర్పాట్లు చేయాలని అడగాలి. నయా ఉదారవాద విధానాలు అమలు జరగక ముందు దేశంలో అలాంటి సంస్థాగత యంత్రాంగం ఉండేది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) 22 రకాల పంటలను విస్తతంగా సేకరించి, మద్దతు ధర ప్రకటించేది. వాణిజ్య పంటలకు సంబంధించిన టీ బోర్డు, కాఫీ బోర్డు, రబ్బర్ బోర్డు వంటి అనేక కమోడిటీ బోర్డులు ఉండేవి. ఈ బోర్డులు మార్కెటింగ్ విధులను నిర్వర్తించటమే కాకుండా ధరలు పతనం అయినప్పుడు మార్కెట్‌లో జోక్యం చేసుకునేవి. ఈ జోక్యాలు తగినంత స్థాయిలో ఉండేవి కావు. ఎఫ్‌సీఐ తగిన సమయంలో కొనుగోళ్ళు చేసేది కాదు. తరచుగా పేద రైతులు... పంటను అమ్మకుండా ఆపుకోలేని దిగువ మధ్య తరగతి రైతులు... ఎఫ్‌సీఐ ఏజెంట్లు మార్కెటింగ్ రంగం లోకి దిగే లోగానే తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవలసి వచ్చేది. అయినప్పటికీ కనీసం సమస్య పట్ల అవగాహన ఉండేది. దానిని పరిష్కరించే ప్రయత్నం ఎంతో కొంత జరిగేది. అయితే నయా ఉదారవాద విధానం అమలుతో ఇదంతా వెనుకపట్టు పట్టింది. ఎఫ్‌సీఐ ఇంకా అస్తిత్వంలో ఉన్నదనేది నిజం. అది రైతులకు కావలసినన్ని పంటలను కాకపోయినా కొన్ని పంటల విషయంలో మార్కెట్‌లో జోక్యం చేసుకుంటున్న విషయం కూడా నిజం. రాబోయే రోజుల్లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఒప్పందంలో భాగంగా ఎఫ్‌సీఐ ఈ మాత్రం కూడా జోక్యం చేసుకోలేదు. కానీ కమోడిటీ బోర్డుల మార్కెటింగ్ విధులు పూర్తిగా నిలిపివేయబడినాయి. దీంతో అటువంటి బోర్డులు రుణాలు అందించటం ద్వారా సహాయపడే వాణిజ్య పంటలకు చేయూత కరువైంది. ఇలా సంస్థాగత ఏర్పాట్లు విఫలం కావటంతో రైతాంగంలో నిస్పృహ పెరిగి, తరచూ రుణమాఫీ కోసం డిమాండ్ చేయటం జరుగుతున్నది. ఇప్పటివరకూ ఈ వైఫల్యంతో లాభపడింది నేను పేర్కొన్న 'వ్యాపారులు'. అయితే వ్యవసాయ వ్యాపారం (అగ్రి బిజినెస్)లో వున్న బహుళ జాతి కంపెనీలు, దేశీయ కార్పొరేట్ ఫైనాన్షియల్ పెట్టుబడిదారీ వర్గం నేడు ఈ 'వ్యాపారుల'లో చేరిపోయారు. వీరందరూ వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌లోకి ప్రవేశించారు. ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించటానికి రైతాంగానికి రుణ మాఫీ చేయటమే కాకుండా భవిష్యత్తులో ధరలు పతనం కాకుండా నయా ఉదారవాదం నాశనం చేసిన యంత్రాంగాన్ని తిరిగి పునరుద్ధరించవలసిన అవసరం ఉన్నది.

మరో సాంస్కృతిక పునరుజ్జీవనం అవసరం

ఎమ్. రాంప్రదీప్



చర్చ

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా రెండు ప్రధాన సమస్యలు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఒకటి పర్యావరణ కాలుష్యం. రెండు మతోన్మాదంతో కూడిన ఉగ్రవాదం. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ జాన్ ట్రంప్ వాతావరణ కాలుష్య నియంత్రణపై జరిగిన పారిస్ ఒప్పందం నుండి తమ దేశం తప్పుకుంటునట్లు ప్రకటించడంతో పర్యావరణ ప్రేమికులలో ఆందోళన పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ భూగ్రహం గురించి ఒక ఆసక్తికర ప్రకటన చేశారు. 'మరో వంద సంవత్సరాల్లో మనిషి తన మనుగడ కోసం మరో గ్రహాన్ని వెతుక్కోవాల్సిందే' అని తేల్చి చెప్పారు. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న వాతావరణ కాలుష్యాన్ని గమనిస్తుంటే హాకింగ్ మాటలు వాస్తవ దూరం కాదనిపిస్తుంది. ఒక వైపు ప్రపంచం కుల, మత, వర్గ, ప్రాంత, జాతి బేధాలు లేకుండా కాలుష్య కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతుండగా మరో వైపు మతోన్మాదంతో కూడిన ఉగ్రవాదం దశదిశలా ఉగ్రరూపం దాల్చుతోంది.

అనాది నుండి 'మతం-సైన్స్' రైలు పట్టాల్లాగా సమాంతరంగా ప్రయాణిస్తున్నాయి. మధ్యయుగం వరకు మతానిదే పైచేయి. 17వ శతాబ్దం నుండి సైన్స్ తన పరిధిని విస్తరించుకుంటూ వస్తోంది. కోపర్నికస్ 'సూర్యకేంద్ర సిద్ధాంతం', డార్విన్ 'జీవ పరిణామ సిద్ధాంతం', ఫ్రాయిడ్ 'మనో విశ్లేషణ సిద్ధాంతం', ఐన్‌స్టీన్ 'సాపేక్ష సిద్ధాంతం' ప్రపంచ స్థితిగతులను మార్చాయి. అందుకు తోడు బ్రూనో బలిదానం, గెలీలియో త్యాగాలు మనిషి అన్వేషణను అవని నుండి అంతరిక్షం వరకు విస్తరించేలా దోహదపడ్డాయి. మత ప్రాభవం గత వైభవంగా మిగిలిపోతున్న దశలో మతాధికారులు తమ గ్రంథాల్లోని నియమాలకు కొత్త భాష్యాలు చెప్పటం, నూతన నిబంధనలను చేర్చటం, సైన్స్ ఫలాలను అందిపుచ్చుకోవటం ద్వారా మతం ఉనికిని ఆధునిక కాలంలో కూడా నిలబెట్టగలుగుతున్నారు. అందుకు తోడు సైన్స్ సాధించిన విజయాలు కేవలం ఉన్నత, మేధావి వర్గాలకు మాత్రమే చేరువవుతున్నాయి. వాటి ఫలాలను పేదవారికి అందించటంలో పాలక వర్గాలు విఫలం అవుతున్నాయి. దీంతో ప్రజలు రకరకాల వ్యక్తిగత విశ్వాసాలను ఆశ్రయిస్తున్నారు. వ్యక్తిగత అంశం అయిన మతాన్ని పాలకులు అత్యంత సున్నితమైన అంశంగా మార్చారు.

17,18 శతాబ్దాలలో ప్రపంచ వ్యాప్తంగా చాలా వరకు మతపరమైన సంస్కరణలు జరిగాయి. అనేకమంది ప్రవక్తలు తమ తమ మతాలలో ఉన్నటువంటి మూఢ విశ్వాసాలకు స్వస్తి చెప్పడమో లేదా ఇతర మతాలలో ఉన్న మంచిని స్వీకరించడమో చేశారు. మానవసేవ అనే అంశాన్ని ప్రముఖంగా తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు. వివిధ మతాధిపతులు ఈ దిశగానే ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్యం అంశాలను తమ కార్యక్రమాలలో ప్రధానాంశాలుగా చేర్చి పలు ప్రాంతాలలో అనేక విద్యాలయాలు, వైద్యశాలలను స్థాపించారు. ఈ విషయంలో క్రైస్తవ మిషనరీలు అనేక దేశాలలో తమ ప్రార్థనా మందిరాలకు అనుబంధంగా వైద్యశాలలను, విద్యాలయా లను ఏర్పాటు చేసి ప్రజలకు మతబోధనతో పాటు పలు రకాలైన సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. భారతదేశంలో సైతం స్వామి వివేకానంద, రాజరామ్మోహన్ రాయ్, స్వామి దయానంద సరస్వతి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దేవేంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయులు... భారతీయులు అచరించే సంప్రదాయాలలో, ఆచార వ్యవహారాలలో పలు మార్పులను తీసుకొచ్చేందుకు విశేష కృషి చేశారు. వారి కృషి ఫలితంగానే సతీసహగమనం మన దేశంలో నిషేధించబడింది. బాల్యవివాహాలు కొంతమేరకు తగ్గాయి. మానవసేవ అనే భావనను భారత దేశంలో మత ప్రచారం చేసే అనేక మంది ఆధ్యాత్మికవేత్తలు తమ కార్యక్రమాలలో ఒక ప్రధానాంశంగా చేర్చారు. స్వామి వివేకానంద ప్రారంభించిన 'రామకృష్ణ మిషన్' అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. హిందూ, ఇస్లాం మతాల్లోని ప్రధానాంశాలు తీసుకొని కొంత మంది ప్రవక్తలు సూఫీ మతాన్ని ప్రచారం చేశారు. దర్గాలు మన దేశంలో మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. నేటికీ చాలా ప్రాంతాలలో మొహరం పండుగను హిందూ ముస్లింలు ఐక్యంగా జరుపుకుంటారు. అనేక మంది మత ప్రవక్తలు తమ మతాలలో పలు మార్పులను చేర్చి ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేశారు. అయితే దురదృష్టవశాత్తూ ప్రస్తుత కాలంలో మనిషి మరోసారి మధ్య యుగంలోకి వెళ్తున్నట్లు కనిపిస్తోంది.



మతాన్ని అనుసరించే ప్రతి వ్యక్తి తాను అనుసరించే మార్గమే గొప్పదని అదే సత్యం అని, విశ్వసించటం, ఆ భావనలను ప్రచారం చేయటం, ఎదుటివారిపై బలంగా రుద్దటం వంటి ధోరణులు ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా మత పరమైన దాడులు పెరుగుతున్నాయి. ఆఖరికి సామాజిక మాధ్యమాలను కూడా తమ తమ వాదనలను వినిపించుకునేందుకు వివిధ మతాధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మరోసారి సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలలో రోజురోజుకూ మత అసహన ధోరణులు పెరుగుతున్నాయి. 'మన దేశంలో శౌచాలయాల కంటే ప్రార్థనాలయాలు ఎక్కువగా ఉండటాన్ని' సుప్రీంకోర్టు సైతం ప్రత్యేకంగా ప్రస్తావించింది.


మనిషి నుండి మతాన్ని వేరు చేయటం అంత సులభ సాధ్యం కాదు. ప్రతి మనిషికీ కొన్ని బలాలు, బలహీనతలు ఉంటాయి. నమ్మకాలకు, మూఢనమ్మకాలకు మధ్య సరిహద్దులు చెరిగి పోతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలు మరింత బలోపేతం కావాల్సి ఉంది. విద్యావంతులు, మేధావులు, రచయితలు అందరూ సమిష్టిగా ఒక తాటి పైకి వచ్చి మత సామరస్యానికి కృషి చేయాలి. ప్రభుత్వాలు కూడా సర్వమత సమ్మేళనాలు ఏర్పాటు చేయాలి. శాస్త్రీయ అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజలలో సమైక్య భావనను పెంచాలి. ఈ దిశగా చర్చలు, అవగాహన సదస్సులు జరగాలి. లేనట్లయితే మతోన్మాదం మరింత ఉగ్రరూపం దాల్చి మానవ వినాశనానికి దగ్గర మార్గం వేస్తుంది. మతం కూడా సైన్స్‌లో భాగమే విశ్వ రహస్యాలను ఛేదించే క్రమంలో పూర్వీకులు కొన్ని వ్యూహాత్మక భావనలను ఏర్పరచుకున్నారు. వాటిలో ఎక్కువ శాతం అర్థసత్యాలే. మార్పులు కోరుకోని సైన్స్ పరిశోధనలు మతంగా స్థిరపడగా, నిరంతరం నూతన అన్వేషణలకు దారిచూపిన పరిశోధనలు సైన్స్ అండ్ టెక్నాలజీగా అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం మనం మత ఆరాధకులను ద్వేషించి ప్రయోజనం లేదు. లేదా వారికి వ్యతిరేకంగా వ్యాఖ్యానాలు చేయటం వలన ఉపయోగం లేదు. భక్తి అనే అంశం మూఢత్వంలోకి వెళ్ళకుండా ప్రజల సమస్యలను సానుకూలం గా పరిశీలించాలి. వారి పట్ల సహానుభూతిని ప్రదర్శించాలి. సమస్యలకు శాస్త్రీయ పరమైన పరిష్కార మార్గాలను చూపాలి. ప్రస్తుతం జనవిజ్ఞాన వేదిక పైన వున్న తక్షణ కర్తవ్యం ఇదే.

సెల్ : 9492712836

జీవన the family

సుక్కీ... ఒక్కటే పీస్..!!

ఉషా ఉషా ఉషా



"ఏందిరోయ్.. పొద్దున్నే పెనం మీద మాడిపోయిన దిబ్బరొట్టెలా మొఖమేసుకుని కూకున్నావ్..? ఏంది మళ్ళీ జరక్కూడందేదైనా జరిగిందా ఏటీ?" స్నేహితుడ్ని కాస్తంత ప్రేమతోనే అడిగాడు సుబ్బారావు అలియాస్ సుబ్బి.

"నిజ్జంగా పేణ స్నేహితుడంటే నువ్వేరా.. మొఖం చూసి గుండెకాయలో ఎంత బాధుందో సెప్పెత్తావ్..! యస్ నువ్వే కరెస్టు.. నువ్వన్నట్టే జరక్కూడందే జరిగిందిరా.. గుండెకాయలో చానా మనేదిగా ఉన్నాది.." బాధపడుతూ చెప్పాడు అప్పారావు అలియాస్ అప్పి.

"అయ్యో.. అదేందిరా.. రేతిరికి రేత్రే.. జాడించి నాలుగు ఇరేచనాలుగానీ అయినాయా ఏంది?" చేయి పట్టుకుని పరీక్షగా చూస్తూ అడిగాడు సుబ్బి

"రేయ్.. నీయేలాకోళం పాడుగానూ.. అట్టాంటిదేదైనా జరిగితే.. ఇంటిపట్టునే కూకుంటాగానీ.. ఈడకెందుకొత్తారా.. మళ్ళీ కడుపులో గుడగుడమంటే.. లగెత్తొద్దూ.. అట్టాంటిదేం కాదుగానీ.." అని అప్పి అనగానే..

"మరీ.. ఫైనాన్సింగ్ ప్రోబ్లమా.. సెప్పు.. పదో పరకో అప్పిత్తాగానీ.. నువ్వూరికే.. ఏదేదో కడుపులో ఎట్టేసుకుని.. ఇదైపోబాక.." భుజం తట్టి మరీ ఓదార్చాడు సుబ్బి.

"అరే.. సుబ్బిగా.. అట్టాంటి ఫైనాన్సింగ్ ప్రోబ్లమేం లేదుగానీ.. ఇది చానా పర్సనల్ ఇసయంరా.. నీతో తప్ప ఇంకెవళకీ సెప్పుకోలేనూ..." చాలా విచారంగా మొఖం పెట్టి అన్నాడు అప్పి.

"కొంపదీసి.. అదేంకాదు కదా!" దగ్గరగా వెళ్ళి, చెవులో ఏదో అడిగాడు సుబ్బి.

"చాల్లేరా సంబడం.. నీయేలాకోళానికి ఓ హద్దుండాలా..! అట్టాంటి సమస్య కాదుగానీ.." అంటూ మెలికలు తిరిగిపోతూ అన్నాడు అప్పి.

"అట్టాంటిదో.. ఎట్టాంటిదో సెప్తే కదా నాకు తెల్సేది.." కసిరినట్టే అన్నాడు సుబ్బి.

"మరేటంటే.. మీ సెల్లెమ్మ ఉంది కదా..! నిన్నటిదాకా ఎట్టా ఉండేది..?" అని అప్పి అనగానే.. "మాసెల్లమ్మకేందిరా.. ఒక్కటే పీస్.. 'ఫిదా' సినిమాలో భానుమతి లెక్క.. అట్టాంటమ్మాయి నీ మొఖానికి దొరకడమే పెద్ద గొప్ప!!" వెటకారంగా అన్నాడు సుబ్బి.

"నిన్నటిదాకా నేనూ.. ఆమెని.. అట్టాగే 'ఒక్కటేపీస్..!' అని అనుకుని ఎంతో మురిసిపోయా.. కానీ ఏటయ్యింది.. ఈ మధ్య అస్సలు మర్యాద లేకుండా మాటాడతాంది.." బేర్‌మన్నాడు అప్పి.

"ఓర్నీ.. అట్టా ఏడవకరా.. అసలు మాసెల్లెమ్మ ఏటందో.. ముందు సెప్పు.." కళ్ళు తుడుస్తూ అడిగాడు సుబ్బి.

"పొద్దున్నే లేచి.. నా మానాన నేను సంగీత సాధన చేసుకుంటున్నానా..?! అంతే ఉన్నఫళంగా వచ్చి 'ఛీ.. పాడు..!" అని యెటకారంగా నవ్వేసి.. వంటింట్లోకి పరుగెత్తుకు పోయింది. అంటే ఏటీ..? నన్నూ, నా సంగీతాన్ని ఆ మాదిరి మాటల్తో.. తక్కువ సేసినట్టా కాదా?!" కళ్ళింత చేసుకుని మరీ అడిగాడు అప్పారావు.

"ఓర్నీ.. 'ఛీ.. పాడు..!' అని.. మా సెల్లెమ్మ నిన్ను ఎక్కిరించిందా..? మా సెల్లెమ్మ అట్టాంటి మాటలు అనదే.." ఆలోచనలోపడ్డాడు సుబ్బి.

"నిన్నటిదాకా నేనూ అట్టాగే అనుకున్నా.. అసలు ఇయ్యాలే కాదు.. నిన్నా నేను వరండాలో సంగీత సాధన చేసుకుంటూ.. 'కిట్టమ్మా.. గోపాలా బాలా కిట్టమ్మా..!' అని కోలాటగీతం పాడుకుంటా ఉంటాంటే.. 'ఛీ.. పాడూ..!' అని వంకరగా నావైపు చూసి.. జెర్రిగొడ్డులెక్క వంటింట్లోకి సర్రున పారిపోయింది. అసలు పెనిమిటిని పట్టుకుని.. అంత యెటకారాం చెయ్యొచ్చా?! ఆ.. చెయ్యొచ్చా?!" అంటూ మరోసారి బాధపడ్డాడు అప్పారావు.



"నువ్వూరికే బాధపడమాకరా.. అసలు సెల్లెమ్మ ఆ మాదిరిగా ఎందుకందో.. ఇంటికెళ్ళి అడుగుదాం పా...?!" అని బయలుదేరారు అప్పి, సుబ్బి.

❄❄❄

"సెల్లెమ్మా..! ఓ సెల్లెమ్మా..! నీకిదేమైనా నాయంగా ఉందా..? చెట్టంత పెనిమిటిని పట్టుకుని.. 'ఛీ.. పాడూ..!' అంటూ యెటకారం సేత్తవా..?!" ఉత్తుత్తినే అడుగుతున్నట్టుగా నాలుక బయటపెట్టి సైగచేసి మరీ అడిగాడు సుబ్బారావు.

"అలా అడుగు.. కాస్త బుద్ధొత్తాది..! నాలాంటి కళాకారుడ్ని అట్టుకుని.. 'ఛీ..పాడూ!' అని పాడు మాటలంటదా..? ఇయ్యాలతో ఇసయం అటో ఇటో తేలిపోవాలా?" ధైర్యం కూడదీసుకుని అడిగేశాడు అప్పి.

"ఏందమ్మా సెల్లెమ్మా..! అప్పిగాడు సెప్పేది నిజమేనా..?! ఆడిలోని కళను యేలాకోళం సేత్తన్నావంటా నిజమేనా..?!" మరోసారి ఉత్తుత్తినే అడుగుతున్నా.. అన్నట్టు సైగచేసి అడిగాడు సుబ్బారావు.

"అయ్యో.. అయ్యో.. నా పెనిమిటిని అంతలేసి మాటలంటానా అన్నయ్యా! ఆయనలోని కళాకారుడ్ని ఎంకరేజింగ్ సేద్దామని.. ఆ మాటలన్నానేగానీ.. అట్టా అపార్థం చేసుకుంటే ఎట్టా అన్నయ్యా..?!" సాగదీసుకుంటూ భర్త వంక ఓరకంట చూస్తూ అంది సుబ్బలక్ష్మి అలియాస్ సుక్కీ.

"అంటే.. అంటే.. ఎంకరేజింగ్ అంటే.. అట్టా యెటకారంగా.. 'ఛీ.. పాడూ..!' అంటారా ఎవరైనా..?" ఉక్రోషంగా అన్నాడు అప్పారావు.

"ఒరేయ్ అప్పిగా.. నువ్వుండ్రా.. సెల్లెమ్మను నేను వివరంగా అడుగుతున్నాగా..! అదికాదమ్మా.. నువ్వు.. 'ఛీ..పాడూ..!' అని ఎందుకన్నావ్..?" అప్పి తరపు వకాల్తా పుచ్చుకున్నట్టుగా నటిస్తూ అడిగాడు సుబ్బి.

"అన్నయ్యా..! చూడు నేను మరోపాలి సెప్తున్నా.. ఆయన్ని ఎంకరేజింగ్ సేద్దామనే అట్టా అన్నా.. అంతే..!!" కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది సుక్కీ.

"అదిగో చూడ్రా.. అనరాని మాటలన్నీ అనేసి.. ఎట్టా మాటాడతాందో చూడు.." పళ్ళు కొరుకుతూ అన్నాడు అప్పి.

"ఏమ్మా సెల్లెమ్మా.. నువ్వు ఎవ్వర్నీ వూరికే ఒక్కమాటనవని నాకు తెల్వదా ఏటీ..?! అసలు 'ఛీ.. పాడూ!' అని ఎందుకన్నావో ఓపాలి.. నాకైనా అర్థమయ్యేలా సెప్పరాదా..?!" రిక్వెస్ట్‌గా అడిగాడు సుబ్బి.

"మరేంలేదన్నయ్యా.. ఈ హోల్ మండలంలో సోలో సింగరంటే ఆయనే కదా.. ఆయన పొద్దుపొద్దున్నే లేచి.. మండువాలో కూసుని.. ఎంచక్కా.. 'కిట్టమ్మా.. గోపాలా బాలా కిట్టమ్మా..!' అని కోలాటం పాట పాడుతూ.. సంగీత సాధన చేత్తాంటే.. నాకెంత ముచ్చటేసిందనీ... అందుకే ప్రేమగా.. 'ఛీఛీ.. నా కన్నవు కదూ..! నా బుజ్జిగాడివి కదూ..!! ఇంకా పాడునాయనా.. పాడు..!!' అన్నా.. ఆయనేమో సంగీత సాధనలో మునిగిపోయి.. 'ఏంటీ అన్నావ్..?' అని అడిగారు.. నేను మళ్ళీ సెప్పిందే చెప్పలేక షార్ట్‌కట్‌గా.. 'ఛీ.. పాడూ!' అని చిలిపిగా అనేసి.. సిగ్గుతో ఇంట్లోకి పరుగెత్తుకుపోయా" ముసిముసిగా నవ్వుతూ అసలు విషయం చెప్పుకొచ్చింది సుక్కీ.

"ఓర్నీ అప్పిగా..! ముందే సెప్పానా.. సెల్లెమ్మ.. సింగిల్ పీస్ భానుమతి లెక్కని.. నువ్వే నా బంగారంలాంటి సెల్లెమ్మను అపార్థం చేసేసుకున్నావ్.." నవ్వుతూ వాతావరణాన్ని తేలికచేశాడు సుబ్బారావు.

"ఏటీ.. 'ఛీ.. పాడూ..!' అంటే ఇంత అర్థముందా..? తెల్వక.. అపార్థం చేసుకుని తెగ ఇదైపోయా.. 'సుక్కీ..! స్వారీయే.. ఏమీ అనుకోబాకే!' అని భార్యను గెడ్డం పట్టుకు బతిమాలుతూ... 'కిట్టమ్మా.. గోపాలా బాలా కిట్టమ్మా..!' అని హుషారుగా సంగీత సాధనలో మునిగిపోయాడు అప్పి.. అలియాస్ అప్పారావు.

రాత-గీత: గంగాధర్ వీర్ల



పూర్ణం పేరు వింటేనే నోరూరిపోతుంది కదూ! వాటిని శనగపప్పుతో చేయడం అందరికీ తెలిసిందే. అలా కాకుండా నువ్వులు, ఆలూ, అరటితో పూర్ణాలు చేస్తే..'భలే బాగున్నాయే!' అనక మానరు. పిల్లలూ, పెద్దలూ అందరూ 'ఇంకొకటి ఇంకొకటి..!' అంటూ వీటిని ఇష్టంగా తింటారు. అలా అని ఎక్కువ తినేశారో.. కష్టమేనండోయ్..!! కాకపోతే ఇవి భలే రుచిగా.. పసందుగా ఉంటాయి.. మరి ఈ కొత్తరకం పూర్ణాలు ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం పదండి!





పసందైన పూర్ణాలు




గోధుమపిండితో..

కావల్సిన పదార్థాలు : గోధుమ పిండి – పావు కేజీ, పచ్చి శనగపప్పు – పావు కేజీ, బెల్లం– పావు కేజీ, పచ్చికొబ్బరి– ఒక చిప్ప ,యాలకులు– పది, నూనె– అరకేజీ.

తయారుచేసే విధానం : ముందుగా పచ్చి శనగపప్పులో రాళ్ళు లేకుండా చేసుకోవాలి. బెల్లం తరిగి ఉంచుకుని, యాలుక్కాయలను పొడిచేసి ఉంచుకోవాలి. అలాగే, పచ్చికొబ్బరిని తురిమి, గోధుమపిండిని జల్లించుకోవాలి. తర్వాత పచ్చి శనగపప్పును రెండు గంటలపాటు నానబెట్టి నీళ్ళన్నీ ఒంపేసి... కుక్కర్‌లో ఉడక బెట్టాలి. ఉడికిన పప్పును బాగా ఆరనివ్వాలి. తర్వాత రోట్లోగానీ, మిక్సీలోగాని వేసి, మెత్తగా నూరుకోవాలి.

తురిమిన బెల్లాన్ని మెత్తగా చేసిన పప్పుకు కలపాలి. చివరిగా కొబ్బరి, యాలకుల పొడినీ కలపాలి. ఇలా చేసినప్పుడు పిండి జారుగా అయినట్లు అనిపిస్తే కాసేపు పొయ్యిమీద ఉంచితే గట్టిపడుతుంది. అయితే వేడిచేసేటప్పుడు అడుగంటకుండా జాగ్రత్తపడాలి. పిండి గట్టిపడిన తరువాత తీసి మనకు కావాల్సిన సైజులో ఉండలు చేసి పెట్టుకోవాలి. మరోవైపు జల్లించి ఉంచుకున్న గోధుమపిండిలో కాస్తంత ఉప్పువేసి జారుగా కలుపుకోవాలి. పొయ్యి మీద పాన్‌పెట్టి నూనె పోసి, మరుగుతుండగా పూర్ణం ఉండలను గోధుమపిండిలో ముంచి వేయాలి. బంగారు వర్ణం వచ్చేదాకా వాటిని వేయించి తీసేయాలి. అంతే గోధుమపిండి పూర్ణాలు సిద్ధమైనట్లే..! వేడి చల్లారిన తరువాత వీటిని తింటే చాలా రుచిగా ఉంటాయి.



బియ్యం పిండితో..

కావల్సిన పదార్థాలు : శనగపప్పు –ముప్పావు కప్పు, బెల్లం – కప్పు, తాజా కొబ్బరి తురుము – మూడు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – చిటికెడు, బియ్యంపిండి – ఒకటిన్నర కప్పు, నీళ్లు –తగినన్ని, నెయ్యి – టీ స్పూన్, ఉప్పు –చిటికెడు.

తయారుచేసే విధానం : శనగపప్పు మునిగేంత నీరు పోసి, కుక్కర్‌లో ఉడికించుకోవాలి. పప్పు మరీ మెత్తగా కాకుండా వేళ్లతో నొక్కితే చితికేంత మేరకే ఉడికించుకోవాలి. తడి లేకుండా చూసుకోవాలి. తర్వాత పప్పును చల్లార్చి, పొడి చేసుకోవాలి. గిన్నెలో బెల్లం, నీళ్ల పోసి పాకం పట్టాలి. పాకంలో శనగపప్పు పొడి, యాలకుల పొడి, కొబ్బరి తురుము వేసుకుని కలుపుకోవాలి. ఈ మిశ్రమం చిక్కబడే వరకూ సన్నని మంటపై ఉడికించుకోవాలి. మిశ్రమం పిండి ముద్దగా మారాక, మంట తీసేయాలి. పూర్తిగా చల్లారాక ఉండలు చుట్టుకోవాలి. నీళ్ల, నెయ్యి, ఉప్పు కలిపి మరిగించుకోవాలి. బియ్యంపిండిని ఓ గిన్నెలో తీసుకుని, మరిగించిన నీటిని చేర్చుతూ పిండి కలుపుకోవాలి. రెండు నిమిషాలాగి, వేడిగా ఉన్నప్పుడే పిండి మెత్తబడే వరకూ కలపాలి. చేతికి నూనె రాసుకుని పిండిని ఉండలుగా చేసుకోవాలి. ఉండలను చేత్తో చిన్న పూరీల్లా వత్తుకుని వాటి మధ్యలో శనగ ఉండను ఉంచి గుండ్రంగా చుట్టాలి. ఇలా తయారుచేసిన వాటిని 10 –12 నిమిషాలపాటు ఆవిరి మీద ఉడికించి, చల్లారాక వడ్డించాలి.



సగ్గుబియ్యంతో..

కావల్సిన పదార్థాలు : మినపప్పు– మూడు కప్పులు, బియ్యం– ఆరు కప్పులు, సన్న సగ్గుబియ్యం– కప్పు, ఎండు కొబ్బరి తురుము– పావుకప్పు, పంచదార–కప్పు, అటుకులపొడి–పావుకప్పు, యాలకుల పొడి– టీస్పూను, నూనె– వేయించడానికి సరిపడా.

తయారుచేసే విధానం: ముందుగా మినపప్పు, బియ్యం నాలుగు గంటలపాటు నానబెట్టాలి. నానాక సరిపడా నీటితో మరీ గట్టిగానూ, పలుచగానూ కాకుండా పూర్ణాల కోసం రుబ్బినట్లే మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. పాన్‌లో మూడు కప్పుల నీళ్లుపోసి కాగాక సగ్గుబియ్యం వేసి ఉడికించాలి. అవి ఉడికిన తరవాత పంచదార, యాలకులపొడి వేసి కలిపి ఉడికించాలి. ఓ గిన్నెలో ఉడికించిన సగ్గుబియ్యం మిశ్రమం, ఎండు కొబ్బరి తురుము, అటుకులపొడి వేసి ముద్దగా కలపాలి. మిశ్రమాన్ని చిన్న చిన్న ముద్దల్లా చేసుకోవాలి. వీటిని ముందుగా గ్రైండ్ చేసుకున్న పిండి మిశ్రమంలో ముంచి, కాగిన నూనెలో ఎర్రగా వేయించుకోవాలి.


నువ్వులతో..

కావల్సిన పదార్థాలు: నువ్వులు– కప్పు, పల్లీలు– అరకప్పు, కొబ్బరిముక్కలు– అరకప్పు, బెల్లం తురుము– ఒకటిన్నర కప్పులు, నూనె– వేయించడానికి సరిపడా, బియ్యం– రెండు కప్పులు, మినపప్పు– కప్పు, ఉప్పు– తగినంత.

తయారుచేసే విధానం: మినపప్పు, బియ్యం విడివిడిగా ఆరు గంటలసేపు నానబెట్టాలి. బాగా నానాక తగినన్ని నీళ్ల పోసి, మెత్తగా రుబ్బాలి. పాన్‌లో నువ్వులు పది నిమిషాలు వేయించాలి. పల్లీలు కూడా వేయించాలి. చల్లారాక రెండూ కలిపి మిక్సీ పట్టాలి. అందులోనే బెల్లం తురుము వేసి బాగా కలపాలి. సన్నగా కోరిన కొబ్బరి కూడా వేసి కలపాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఉండలుగా చేసుకోవాలి. ఇప్పుడు ఒక్కో ఉండనీ పిండి మిశ్రమంలో ముంచి, కాగిన నూనెలో పూర్ణాల మాదిరిగా వేసి ఎర్రగా వేయించి తీయాలి.



పోషకాలు మెండు



పూర్ణాల తయారీలో ఉపయోగించే ముడిపదార్థాలన్నీ అత్యుత్తమ పోషకాలతో ఉన్నవే. ఈ వంటకాల వల్ల వచ్చే పోషకాలు దేహానికి బలం చేకూర్చుతాయి. యుక్త వయస్సు వారికి, పిల్లలకు, పాలిచ్చే తల్లులకు, గర్భవతులకు, బరువు తక్కువుగా ఉన్నవారికి, రక్తహీనత ఉన్నవారికి ఈ పదార్థాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

జానకి బడుగు,
పోషకాహార నిపుణులు

బనానాతో..

కావల్సిన పదార్థాలు: కొద్దిగా పండిన అరటిపళ్లు– ఆరు, పచ్చి కొబ్బరి తురుము– కప్పు, చక్కెర–ఒకటి లేదా రెండు స్పూన్లు, యాలకుల పొడి–అర స్పూను, జీడిపప్పు, కిస్మిస్‌లు–తగినన్ని, మైదా – నాలుగు స్పూన్లు, ఉప్పు– చిటికెడు, నెయ్యి– రెండు లేదా మూడు స్పూన్లు, నూనె– వేయించడానికి సరిపడా.

తయారుచేసే విధానం: అరటిపండును ఆవిరి మీద కొద్దిసేపు ఉడికించుకోవాలి. అవి చల్లారిన తరువాత పై తొక్క తీసేసి చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవాలి. పాన్‌లో నెయ్యి వేసి కాగిన తరువాత అరటిపండు ముక్కలు, చక్కెర, కొబ్బరిపొడి, జీడిపప్పు, కిస్మిస్‌లు వేసి దోరగా వేయించుకుని దింపేయాలి. ఇవి చల్లారిన తరువాత చేతితో మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని సమాన భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి. మైదా పిండిలో తగినంత నీరు, ఉప్పు వేసి గరిటెజారుగా కలుపుకోవాలి. ఈ పిండిలో ముందుగా చేసిపెట్టిన అరటిపండు ఉండలు ముంచి, నూనెలో దోరగా వేయించుకోవాలి.



పిల్లల్లో.. మార్పును గమనించండి!

చదువు, ఆటల్లో పోటీ ఒత్తిడి.. హోమ్‌వర్కు చేయాలి లేకపోతే టీచరు కొడుతారన్న భయం.. మనసులో భావాలు వెల్లడించాలన్న ఉత్సుకత.. ఇవన్నీ పిల్లల అంతరంగంలో భావోద్వేగాల అలజడులు.

ఇది తెలిసినా, కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు మాటవినకపోతేనో, వెంటనే ఫలితం కనపడకపోతేనో ఒక పదునైన ఆయుధాన్ని ఉపయోగిస్తుంటారు. అది పిల్లల భావోద్వేగాలను, భయాలను తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడం! తిట్లు చీవాట్ల కంటే ఇది మరింత దుష్ప్రభావాన్ని కలిగిస్తుంది.



'పది నిమిషాల్లో హోమ్‌వర్క్ పూర్తిచేయకపోతే చూడు.!', 'ఇకపై తాతయ్య ఇంటికి తీసికెళ్లను. వాళ్లనూ రావొద్దని చెప్పేస్తా..!', 'నా మాట వినకపోతే నాతో మాట్లాడొద్దు..!' వంటి బెదిరింపుల వల్ల ఆశించిన ఫలితం వెంటనే కనబడుతుంది. కానీ దాని తాలూకు దుష్ప్రభావాలు బలంగా వారి మనస్సులో నాటుకుపోతాయి. అవి అంత సులభంగా పోగొట్టలేరు కూడా. రాత్రివేళ మెలకువ వచ్చిన ఎనిమిదేళ్ల పాపకో..బాబుకో పక్కన తల్లి కనిపించకపోతే మనసులో కలిగే భయం తీవ్రతను అంచనా వేయడానికి ప్రయత్నించి చూడండి. పెరిగి పెద్దయ్యాక కూడా బాంధవ్యాలు కోల్పోతాననే భయం, ప్రియమైన వారు కనిపించకుండా పోతారేమోననే ఆందోళన .. ఇవన్నీ బాల్యంలో ప్రభావాల పర్యవసానాలే అంటున్నారు మానసిక నిపుణులు. నిజానికి తల్లిదండ్రుల్లో చాలామంది బాల్యంలో తమ పెద్దవారితో ఇలా చీవాట్లూ శిక్షలూ అనుభవించినవారే. నాటి అవమానపు జ్ఞాపకాలు వారిలో అంతర్లీనంగా ఉండి, వాటిని పిల్లలపై చూపిస్తుంటారని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోపక్క 'నేనెందుకిలా ప్రవర్తిస్తున్నాను?' అని బాధతో ప్రశ్నించుకుంటూనే పిల్లల పట్ల తీరును మార్చుకోని తల్లిదండ్రులు ఉన్నారంటున్నారు. మాటలతో పసి మనసులు గాయపడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మీ కోసం



చిటికెడు పసుపు, స్పూను పాలపొడి, రెండు స్పూన్ల తేనె, అరచెక్క నిమ్మరసం కలిపి మిశ్రమంలా చేసుకొని, ముఖానికి రాసుకుని ఆరిపోయాక కడిగేసుకుంటే ముఖం కాంతివంతంగా ఉంటుంది.

జీవన సౌరభం

నిన్నటి గురించి బాధపడకుండా, రేపటి గురించి ఆలోచించగలిగిన వ్యక్తికి విజయం తథ్యం.

సెన్సెక్స్ ▲ 60 — 32,575 | నిఫ్టీ ▲ 38 — 10,144 | రూపాయి ▲ 11 పైసలు — ఒక అమెరికా డాలరుకు రూ. 64.07


కార్పొరేట్లకు రూ.2 లక్షల కోట్ల రుణ పునరుద్దరణ

ఆర్థిక మంత్రి జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ : కార్పొరేట్లకు చెందిన భారీ మొత్తం రుణాలను బ్యాంకులు పునరుద్ద రించాయి. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఆ వర్గాలకు చెందిన రూ.2,04,884 కోట్ల అప్పులను పునరద్దరించినట్లు ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం రాజ్య సభకు లిఖితపూర్వకంగా తెలిపారు. 2014-15లో రూ.3,70,279 కోట్లు, 2015-16 లో రూ.2,99,111 కోట్ల చొప్పున కార్పొరేట్ల అప్పులను పునరుద్దరించి నట్లు వెల్లడించారు. ఎవరి రుణాలు పునరుద్దరించారు, ఏ ప్రతిపాదికన చేశారు అనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ ఈ వ్యవహారం రిజర్వు బ్యాంకు చూసుకుంటుం దన్నారు. ఆర్‌బిఐ దీనిపై విధివిధానాలు కలిగి ఉందని, ఆ ప్రకారం జాయింట్ లెండర్స్ ఫోరమ్ (జెఎల్ఎఫ్), స్ట్రాటజిక్ డెట్ రీస్ట్రక్షరింగ్ (ఎస్‌డిఆర్), స్కీమ్ ఫర్ సస్టెయినెబుల్ స్ట్రక్షరింగ్ ఆఫ్ స్ట్రెస్‌డ్ అసెట్స్ (ఎస్4ఎ) ప్రకారం అప్పుల పునరుద్ద రణ జరుగుతుందన్నారు. రుణ గ్రహీతల పేర్లు, వివరాలు 1934 బ్యాంకింగ్ చట్టాల ప్రకారం ఆర్‌బిఐ యాక్ట్ 45ఇ సెక్షన్ ప్రకారం రహస్యంగా ఉంచబడు తాయన్నారు. రాజ్యాంగం ప్రకారం ఈ వ్యవహారం జరుగుతుందన్నారు.

త్వరలో పేటీఎం మేసెజింగ్ యాప్!



ముంబయి : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎం మేసేజింగ్ సేవలను ప్రారంభించే యోచనలో ఉంది. ప్రత్యర్థి సంస్థలైన ఫేస్‌బుక్, వాట్సాఫ్‌లకు గట్టి పోటీ ఇచ్చేందుకు ఈ నెల చివరిలోపు ఈ సేవలను తీసుకోచ్చే అవకాశాలు ఉన్నాయని సంబంధిత అధికార వర్గాలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న తమ పేటీఎం వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు పేటీఎం యాప్‌లో ఈ సరికొత్త సేవలను ప్రారంభించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. నోట్ల రద్దు తర్వాత పేటీఎం సేవలకు ఆధారణ భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. ఈ యాప్‌ను ఉపయోగించి ఫుడ్ నుంచి సినిమా టికెట్ల వరకు బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ కొత్త సేవల ద్వారా తమ వినియోగదారులకు ఆడియో, వీడియో, ఫోటో, టెక్ట్స్ సందేశాలు షేరు చేసుకునే అనుమతివ్వినుంది. ప్రస్తుతం పేటీఎంకు దేశవ్యాప్తంగా 225 మిలియన్ వినియోగాదారులున్నారు. ఇప్పటికే ప్రముఖ దేశీయ సంస్థ మెసేజింగ్ యాప్ హైక్ తన ప్లాట్‌ఫామ్‌పై ఈ పేమెంట్ ఫీచర్‌ను ప్రారంభించింది. దీంతో తమ యూజర్లకు హైక్ ద్వారానే పేమెంట్ ట్రాన్స్ ఫర్స్, తదితర సేవలు ఉపయోగించే వీలు కల్పించిన సంగతి విదితమే. గత కొంత కాలంగా వాట్సాఫ్ డిజిటల్ పేమెంట్స్ ఫీచర్‌ను ప్రారంభించాలని యోచిస్తోన్న సంగతి తెలిసిందే. ఇక పేటీఎం కొత్త సేవలపై మంగళవారం వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం వెల్లడించింది. ఈ అంశంపై పేటీఎంను వివరణ కోరగా స్పందించకపోగా, వాట్సాఫ్ కూడా స్పందన తెలిపేందుకు ముందురాలేదని పేర్కొంది.

ఫ్లిప్‌కార్ట్‌లో ఈబే ఇండియా విలీనం

న్యూఢిల్లీ : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ మరో ఆన్‌లైన్ పోర్టల్ ఈబే ఇండియాను స్వాధీనం చేసుకుంది. గత ఏప్రిల్‌లోనే దీనిపై ఒక అవగాహనకు రాగా, మంగళవారం చర్చలు పూర్తయినట్లు ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది. దీంతో ఇక నుంచి ఈబే. ఇన్ వెబ్‌సైట్ ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌లో భాగమని ఆ సంస్థ పేర్కొంది. అయినప్పటికీ ఈబే స్వతంత్ర్యంగానే వ్యాపారం కొనసాగించనుంది. దీంతో ఈ కంపెనీలో మైక్రోసాఫ్ట్, ఈబే, టెన్ సెంట్ కంపెనీలు దాదాపు రూ.9,030 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. స్నాప్‌డీల్, ఫ్లిప్‌కార్ట్‌లో విలీన రద్దు ప్రకటన వెలుపడిన తదుపరి రోజే ఈబే విలీనం పూర్తయిన ప్రకటన చేయడం విశేషం.

ఐటిలో గడ్డు స్థితి



- ఉసురుమంటున్న ఉద్యోగులు
- తొలిసారి తగ్గిన సిబ్బంది
- నాస్కామ్ అంచనాలు తారుమారు..!

బెంగళూరు : దేశీయ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో గడ్డు పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగుల సంఖ్య పడిపోతోంది. ఒకప్పుడు భారీగా ఉపాధి కల్పనకు నెలవుగా ఉన్న 154 బిలియన్ డాలర్ల దేశీయ ఐటి పరిశ్రమ పరిస్థితి ప్రస్తుతం తారుమారవుతోంది. కొత్త ఉద్యోగాలు కల్పించడంలో స్తబ్దతను ఎదుర్కొంటుంది. తొట్టతొలిసారి అగ్రశ్రేణి ఐదు ఐటీ కంపెనీల్లోని మూడింటిలో ఉద్యోగులు భారీగా తగ్గిపోయారని మింట్ ఓ కథనం ప్రచురించింది. ప్రస్తుత ఏడాది జూన్30తో ముగిసిన త్రైమాసికం నాటికి ఈ టాప్-5 కంపెనీల్లో 984,913 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. కాగా ఇంతక్రితం మార్చితో ముగిసిన త్రైమాసికం సంఖ్యతో పోల్చితే 1,821 మంది తగ్గిపోయారు. 2017 మార్చి ముగింపు నాటికి దేశీయ ఐటీ పరిశ్రమలో మొత్తంగా 39 లక్షల మంది పని చేస్తున్నారని ఐటి పరిశ్రమ బాడీ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) వెల్లడించింది. ప్రస్తుత ఏడాదిలో ఐటి రంగంలో కొత్తగా కనీసం 150,000 మందికి ఉద్యోగాలు లభించవచ్చని నాస్కామ్ అంచనా వేసింది. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తే నాస్కామ్ అంచనాలు తప్పేలా కనిపిస్తున్నాయి.

కంపెనీల వ్యాపార పద్దతులు, విధానాలు మారడంతో ఐటీ కంపెనీలు కొత్తగా ఉద్యోగులను నియమించుకోవడంలో తీవ్ర కఠినతరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని పరిశ్రమ విశ్లేషణ. ఓ వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపు విధానాలు, మరోవైపు ఆటోమేషన్ ప్రభావంతో చాలా కంపెనీలు తమ ప్రస్తుత ఉద్యోగులు, నియామకాల విషయంలో పునఃసమీక్షించుకోవడం మొదలుపెట్టాయి. ప్రధానంగా ఈ రెండు ప్రభావాలతోనే కంపెనీలు సిబ్బందికి కోత పెడుతున్నాయని అంచనా. దేశంలోని ప్రముఖ ఏడు ఐటి కంపెనీలు దాదాపుగా 56 వేల మంది ఇంజనీర్లను వెళ్లిపోవాలని సూచించినట్లు ఆంగ్ల పత్రిక మింట్ ఒక కథనం వెలువరించింది. గతేడాదితో పోల్చితే ఈ సంఖ్య రెండింతలు పెరుగుతుందని అంచనా వేసింది.

టిసిఎస్, ఇన్ఫీలోనూ..

దేశంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సర్వీసుల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)లో జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,414 మంది తగ్గి 3,85,809కి చేరింది. ఇన్ఫోసిస్‌లో నికరంగా 1,811 ఉద్యోగాలు పోయాయి. టెక్ మహీంద్రాలో 1,713 మంది ఉద్యోగాలు తగ్గాయి. కేవలం విప్రో, హెచ్‌సిఎల్‌లు మాత్రమే తమ ఉద్యోగుల నికర సంఖ్యలో పెరుగుదల చోటు చేసుకుంది. అది కూడా బెంగళూరుకి చెందిన ఓ ఐటీ సంస్థతో విప్రో కుదుర్చుకున్న ఒప్పందం సఫలమవడంతో విప్రో అదనంగా ఉద్యోగులను చేర్చుకోగలిగింది. ఇన్ఫోసర్వర్‌ను విప్రో కొనుగోలు చేయడంతో కొత్తగా 200 మంది ఉద్యోగులను తీసుకుంది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న ఈ కంపెనీ ఒక అవుట్ సోర్సింగ్ క్లయింట్ ద్వారా మరో 1000 మంది ఉద్యోగులను తీసుకుంది. ఇతర ఐటి కంపెనీలు ఎల్ అండ్ టి ఇన్ఫోటెక్ లిమిటెడ్, మైండ్‌ట్రి లిమిటెడ్, కెపిఐటి టెక్నాలజీస్ లిమిటెడ్, హెక్సావేర్ లిమిటెడ్, సైయంట్ లిమిటెడ్‌లు క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 2,026 మంది ఉద్యోగులను తీసుకున్నాయి. ఈ కంపెనీల్లో మొత్తంగా 77,447 మంది సిబ్బంది పని చేస్తోన్నారు. అంటే దాదాపుగా దేశంలోని అతిపెద్ద 10 ఐటి కంపెనీలు ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరంగా కొత్తగా 205 మంది ఉద్యోగులను తీసుకున్నాయి. ప్రతీ త్రైమాసికంలో వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే ఐటి పరిశ్రమ నియామకాలపై నీలినీడలు కమ్ముకోవడంతో ఈ రంగంపై ఆశలు పెట్టుకుంటున్న అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన మొదలయ్యింది.

మార్కెట్లకు 'వడ్డీ రేట్ల' మద్దతు

ముంబయి : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ద్రవ్యపరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీ రేట్లలో 25 బేసిస్ పాయింట్లు మేర తగ్గించవచ్చునన్న అంచనాలు మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో విశ్వాసాన్ని నింపాయి. దీనికి తోడు వాహన అమ్మకాల మద్దతు రెండో రోజూ మార్కెట్ల రికార్డు లాభాలకు దోహదం చేశాయి. అంతర్జాతీయంగా సానుకూల వాతావరణం నెలకొనడం కూడా స్టాక్‌మార్కెట్లకు కలిసోచ్చింది. కొత్తపన్ను విధానం వల్ల అవుట్‌పుట్ డిమాండ్ పడిపోవడంతో జులై నెల తయారీ రంగానికి చెందిన పీఎంఐ గణాంకాలు భారీ కనిష్టానికి పడిపోయాయి. ఈ నేపథ్యంలో బిఎస్ఇ సెన్సెక్స్ 60.23 పాయింట్లు లాభపడి 32,575.17 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 37.55 పాయింట్లు పెరిగి 10,114.65 వద్ద ముగిసింది. ఆర్‌బిఐ ద్వైమాసిక ద్రవ్య సమీక్ష నిర్ణయాలను బుధవారం వెల్లడించనుంది. గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమీక్షలో వడ్డీ రేట్లలో పావు శాతం తగ్గింపునకు అవకాశం ఉందని ఇప్పటికే పలు అంచనాలు వెల్లడయ్యాయి.

బిఎస్ఇలోని రంగాల వారిగా ఆటో సూచీ 1.57 శాతం, లోహ 1.02శాతం, మౌలికం 0.48శాతం, అయిల్ అండ్ గ్యాస్ 0.36శాతం చొప్పున లాభాలతో ముగిశాయి. మరోవైపు కన్స్యూమర్ డురెబుల్స్ 0.75శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.37శాతం, విద్యుత్ 0.08శాతం, పీఎస్‌యూ 0.07శాతం చొప్పున పడిపోయాయి. హీరో మోటో కార్ప్ 2.05శాతం, మారుతీ 1.96శాతం, విప్రో 1.82శాతం, ఎంఅండ్ఎం 1.77శాతం, హెచ్‌యూఎల్ 1.73శాతం చొప్పున భారీ లాభాలను అర్జించిన వాటిలో ముందు వరుసలో నిలిచాయి. మరోవైపు లూపిన్ 1.36శాతం, ఓఎన్‌జీసీ1.21శాతం, ఎస్‌బిఐ 1.2శాతం, ఏషియన్ పేయింట్స్ 0.98శాతం, కోటాక్ బ్యాంకు 0.67శాతం చొప్పున భారీగా నష్టపోయిన వాటిలో ముందున్నాయి.

ఆసియాలోనే రెండో అత్యంత ధనికుడు ముఖేష్ అంబానీ



న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ ఆసియా లోనే రెండో అతిపెద్ద కుబేరుడిగా రికార్డు నమోదు చేశారు. హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త లి కా-షింగ్‌ను అధిగమించి అంబానీ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నట్టుగా బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ తెలిపింది. ఈ ఏడాది ముఖేష్ అంబానీ సంపదకు మరో 12.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.77 వేల కోట్లు) జత కలిసినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం తెలుస్తోంది. ఆయిల్ నుంచి టెలికాం రంగం వరకు అంబానీ నిర్వహిస్తున్న కంపెనీల షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీ ర్యాలీ నమోదు చేయడమే ఆయన సంపద పెరగడానికి ప్రధాన కారణమైందని బ్లూమ్‌బర్గ్ నివేదించింది. 2016లో బ్లూమ్‌బర్గ్ బిలీనీయర్ ఇండెక్స్‌లో 29వ స్థానంలో ఉన్న ముఖేష్ అంబానీ ప్రస్తుతం 34.8 బిలియన్ డాలర్ల నికర విలువతో 19వ స్థానానికి చేరువయ్యేరని తెలిపింది.

4జి చౌక ఫీచర్ ఫోన్లపై గురి

సెల్‌ఫోన్ తయారీ కంపెనీల ప్రణాళికలు

న్యూఢిల్లీ : దేశంలో చౌక 4జి ఫీచర్ ఫోన్లకు డిమాండ్ పెరుగనున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ తయారీ కంపెనీలు ఈ మార్కెట్‌ను అందిపుచ్చుకోవడానికి వీలుగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. రిలయన్స్ జియో ఈ విభాగంలో అతి చౌక ఫోన్‌కు తెరలేపోవడంతో ఇతర సెల్యూలర్ కంపెనీలు కూడా ఇదే తరహా ఆఫర్లను ప్రకటించే అవకాశం లేకపోలేదు. తాము నాలుగైదు టెలికం కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని స్ప్రెడ్‌ట్రమ్ కమ్యూనికేషన్స్ కంట్రీ హెడ్ నీరజ్ శర్మ పేర్కొన్నారు. నాలుగో త్రైమాసికంలో వారు కొత్త ఫోన్లను తెచ్చే అవకాశం ఉందన్నారు. జియోకు చౌక ధరల్లో ఫోన్లను సరఫరా చేస్తోన్న కంపెనీల్లో ఇది ఒక్కటిగా ఉంది. భారత దేశంలో అత్యధిక మంది 2జి ఫీచర్ ఫోన్లను వినియోగిస్తున్నారన్నారు. ఇప్పటికే లావా కంపెనీ చౌక 4జి ఫీచర్ ఫోన్‌ను ఆవిష్కరించింది. కాగా ఇంటెక్స్ ఈ నెలాఖరుకల్లా రూ.1,999కే 4జి చౌక ఫోన్‌ను తేనుందని సమాచారం.

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం


'నైట్రోజన్ స్థాపన' అంటే ఏమిటి ?



ఎస్.పి. మనోహర్ కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

(జనరల్ సైన్స్)

రసాయన మూలకాలు



మొక్కలు, జంతువుల సరైన పెరుగుదలకు నత్రజని అత్యంత ఆవశ్యక మూలకం. ప్రోటీన్ల నిర్మాణంలో ముఖ్యమైన మూలకం నైట్రోజన్, ఉగ్రవాదులు వాడే విస్ఫోటనకారకాల్లోనూ నైట్రోజన్ ప్రముఖంగా ఉంటుంది. మెరుపుల ధ్వని వేగం కంటే అధిక వేగంతో ప్రయాణించే సూపర్ సోనిక్ జెట్ విమానాల వల్ల నైట్రిక్ ఆక్సైడ్ వాతావరణంలోకి చేరుతుంది. ఇది 'ఓజోన్' పొరను క్షీణింపజేస్తుంది.

గాలిలో సుమారు 80 శాతం నైట్రోజన్ ఉంటుంది. ఇది ఆక్సిజన్‌కు విలీనకారిగా పనిచేస్తుంది. మొక్కలు, జంతువులు వాతావరణంలోని నత్రజని వాయువును నేరుగా శోషించుకోలేవు. మొక్కలు నైట్రోజన్‌ను అమ్మోనియం లేదా నైట్రేట్ లవణాల రూపంలో భూమి పైపొరల నుంచి గ్రహిస్తాయి.

★ **నత్రజని స్థాపన :** వాతావరణంలోని నైట్రోజన్ వాయువును మొక్కలకు ఉపయోగపడే అమ్మోనియం, నైట్రేట్ లవణాలుగా మార్చడాన్ని 'నైట్రోజన్ స్థాపన' అంటారు. ఇలా నైట్రేట్‌లుగా మార్చిన నైట్రోజన్‌ను మొక్కల వేర్ల ద్వారా గ్రహించి ప్రోటీన్లను (పప్పు దినుసులు) తయారుచేస్తాయి.

మేఘాల రాపిడి వల్ల మెరుపులు ఏర్పడినప్పుడు వాతావరణంలోని నైట్రోజన్, ఆక్సిజన్ వాయువులు కలిసి నైట్రిక్ ఆక్సైడ్‌ను ఏర్పరుస్తాయి. నైట్రిక్ ఆక్సైడ్ గాలిలోని ఆక్సిజన్‌తో చర్యనొంది, నైట్రోజన్ డై ఆక్సైడ్‌ను ఇస్తుంది. ఇది నీటిలో కరిగి నైట్రికామ్లంగా మారుతుంది. ఇలా ఏర్పడిన నైట్రికామ్లం భూమిని చేరి, భూమిలోని సోడియం, పొటాషియం, క్యాల్షియం తదితర లోహాలతో చర్య జరిపి, వాటి నైట్రేట్లను ఏర్పరుస్తుంది.

హేబర్ పద్ధతి ద్వారా పారిశ్రామికంగా, వాతావరణంలోని నైట్రోజన్ వాయువును అమ్మోనియాగా మారుస్తారు. అమ్మోనియాను నైట్రికామ్లం తయారీలో వినియోగిస్తారు. ఇది నైట్రేట్ ఎరువుల ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.

బఠానీ, చిక్కుడు లాంటి 'లెగ్యుమినేసి' జాతి మొక్కల వేరుబుడిపెల్లో వాతావరణంలోని నైట్రోజన్‌ను... నైట్రోజన్ సమ్మేళనాలుగా స్థిరీకరించగలిగే ప్రత్యేక రకమైన 'సహజీవన (సింబయోటియో) బ్యాక్టీరియా ఉంటుంది.

★ **నైట్రోజన్ వలయం :** వాతావరణంలోని నైట్రోజన్ వివిధ ప్రక్రియల ద్వారా భూమిని, దాని ద్వారా మొక్కలను చేరడం.. తిరిగి వాతావరణంలోకి చేరడం ఒక చక్రియ క్రమంలో జరుగుతుంది. దీన్నే 'నైట్రోజన్ వలయం' అంటారు.

మెరుపులు, ఆమ్ల వర్షాలు, సహజీవన బ్యాక్టీరియా ద్వారా నైట్రోజన్ భూమిలోకి, అక్కడి నుంచి మొక్కలను చేరుతుంది.

మొక్కలు, జంతువుల్లో ఉండే అత్యంత సంక్లిష్టమైన ప్రోటీన్లు (మాంసకృత్తులు) మొదట యూరియాగా.. చివర అమ్మోనియం లవణాలుగా మారుతాయి.

చనిపోయిన వృక్ష, జంతు, కళేబరాలు, వాటి వ్యర్థ పదార్థాలు 'అమ్మోనిఫైయింగ్ బ్యాక్టీరియా' వల్ల అమ్మోనియా, అమ్మోనియం లవణాలుగా నిక్షిప్తమవుతాయి. వీటిలో కొంత భాగం 'నైట్రసోఫైయింగ్ బ్యాక్టీరియా' వల్ల నైట్రేట్లుగా మారుతుంది.

డీనైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా అమ్మోనియం లవణాలను తిరిగి నైట్రోజన్‌గా మార్చుతుంది. ఈ విధంగా ఏర్పడిన నైట్రోజన్ వాతావరణంలోకి చేరుతుంది. తద్వారా వాతావరణంలో నైట్రోజన్ శాతం స్థిరంగా ఉంటుంది.

నైట్రోజన్ - ముఖ్యమైన అంశాలు

★ నైట్రస్ ఆక్సైడ్ అనేది నైట్రోజన్ తటస్థ ఆక్సైడ్. దీన్నే 'లాఫింగ్ గ్యాస్' అంటారు.

★ అమ్మోనియాను ఐస్ తయారీలో శీతలీకరణిగా ఉపయోగిస్తారు.

★ ఓజోన్‌తో పాటు నైట్రిక్ ఆక్సైడ్, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్లు (పిఎఎన్) కాంతి రసాయన స్మాగ్‌కు కారణమవుతాయి. పొగమంచు ఏర్పడినప్పుడు కళ్లల్లో మంటకు కారణం ఈ రసాయనమే.

★ నైట్రేట్ల ఉనికిని 'బ్రౌన్ వలయ పరీక్ష' ద్వారా గుర్తిస్తారు.


★ నైట్రోజన్ - 210.5^{0}సె వద్ద ఘన పదార్థంగా మారుతుంది.

★ నైట్రో గ్లిజరిన్, టిఎన్‌టి, సెల్యూలోజ్ నైట్రేట్, అమ్మోనియం నైట్రేట్లు పేలుడు పదార్థాలు.

★ 'అమ్మోటాల్' అనేది అమ్మోనియం నైట్రేట్, టిఎన్‌టిల మిశ్రమం. అమ్మోనియం క్లోరైడ్, అల్యూమినియం పొడిల మిశ్రమం 'అమ్మోనాల్'. ఈ రెండూ పేలుడు పదార్థాలే.

★ సల్ఫర్, బొగ్గుపొడి, పొటాషియం నైట్రేట్‌ల మిశ్రమం గన్ పౌడర్.

★ పొటాషియం నైట్రేట్ (కెఎన్ఓ3)ని వేడిచేస్తే ఆక్సిజన్ విడుదలవుతుంది. ★



నమూనా ప్రశ్నలు

1. నవ్వు పుట్టించే వాయువు ?
ఎ. నైట్రిక్ ఆక్సైడ్ బి. నైట్రోజన్ పెరాక్సైడ్
సి. నైట్రస్ ఆక్సైడ్ డి. నైట్రోజన్ పెంటాక్సైడ్

2. కృత్రిమ గర్భోత్పత్తికి ఉపయోగించే శుక్రకణాలను ఎందులో భద్రపరుస్తారు ?
ఎ. ద్రవ నత్రజని బి. మంచుగడ్డ
సి. ద్రవ ఆక్సిజన్ డి. ద్రవ కార్బన్ డై ఆక్సైడ్

3. గన్‌కాటన్ పేరుతో పిలిచే శక్తివంతమైన విస్ఫోటనకారి ?
ఎ. పొటాషియం క్లోరేట్ బి. సెల్యూలోజ్ నైట్రేట్
సి. పొటాషియం నైట్రేట్ డి. సెల్యూలోజ్ ఎసిటేట్

4. నత్రజని సమ్మేళనాలను నైట్రోజన్‌గా మార్చే బ్యాక్టీరియా ?
ఎ. డీనైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా
బి. సహజీవన బ్యాక్టీరియా
సి. సాల్మోనెల్లా డి. నైట్రిఫైయింగ్

5. భూమిలో నైట్రోజన్‌ను స్థాపించే బ్యాక్టీరియా ?
ఎ. సాల్మోనెల్లా బి. ఇ-కొలై
సి. సహజీవన బ్యాక్టీరియా డి. నైట్రసోఫైయింగ్ బ్యాక్టీరియా

6. పేలుడు పదార్థమైన అమ్మోనాల్ వేటి మిశ్రమం ?
1. అమ్మోనియం క్లోరైడ్ 2. అల్యూమినియం పొడి
3. టిఎన్‌టి 4. పిక్రికామ్లం
ఎ. 1, 2 బి. 1, 3
సి. 2, 4 డి. 2, 3

7. డ్రై సెల్‌లో ఎలక్ట్రోలైట్ ఏది ?
ఎ. అమ్మోనియం క్లోరైడ్ బి. అమ్మోనియం నైట్రేట్
సి. యూరియా డి. క్యాల్షియం సయనమైడ్

8. లెగ్యుమినేసి మొక్కలు వేరుబుడిపెల్లో ఉండే సహజీవన బ్యాక్టీరియా ?
ఎ. రైజోబియం బి. సాల్మోనెల్లా
సి. అమ్మోనోబియం డి. అమ్మోనిఫైయింగ్ బ్యాక్టీరియా

9. మొక్కలు, జంతువుల సరైన పెరుగుదలకు అవసరమయ్యే ముఖ్యమైన మూలకం ?
ఎ. హైడ్రోజన్ బి. కార్బన్
సి. నైట్రోజన్ డి. ఆక్సిజన్

10. ద్రవ నైట్రోజన్‌తో పొందగలిగే ఉష్ణోగ్రత ?
ఎ. 0^{0} సె (273 కె) బి. -4^{0} సె (269 కె)
సి. -196^{0} సె (177 కె) డి. -273^{0} సె (0 కె)

11. కిందివాటిలో ఉత్పతనం చెందే సమ్మేళనం ?
ఎ. యూరియా బి. అమ్మోనియం క్లోరైడ్
సి. పొటాషియం నైట్రేట్ డి. టీఎన్‌టీ

12. మొక్కలకు చాలా అవసరమైన మూలకం ?
ఎ. నైట్రోజన్ బి. కార్బన్
సి. క్లోరిన్ డి. పొటాషియం

13. కోడి ఈకలను కాల్చినప్పుడు వెలువడే వాయువు ?
ఎ. నైట్రోజన్ బి. అమ్మోనియా
సి. ఆక్సిజన్ డి. హైడ్రోజన్

14. ఎరువుల గుట్ట నుంచి గాఢమైన (ఘాటైన) వాసనకు కారణమయ్యే వాయువు ?
ఎ. అమ్మోనియా బి. హైడ్రోజన్ సల్ఫైడ్
సి. నైట్రస్ ఆక్సైడ్ డి. నైట్రిక్ ఆక్సైడ్

15. స్పృహ తప్పిన మనిషికి స్పృహ తెప్పించడానికి ఉపయోగించే అమ్మోనియం లవణం (స్మెల్లింగ్ సాల్ట్) రసాయన నామం ?
ఎ. అమ్మోనియం కార్బొనేట్ బి. అమ్మోనియం నైట్రేట్
సి. అమ్మోనియం సల్ఫేట్ డి. అమ్మోనియం క్లోరైడ్

16. కిందివాటిలో ఆమ్ల వర్షానికి కారణమైనవి ?
ఎ. నైట్రోజన్ ఆక్సైడ్‌లు బి. సల్ఫర్ ఆక్సైడ్‌లు
సి. ఫాస్ఫరస్ ఆక్సైడ్‌లు
ఎ. ఎ బి. ఎ, బి సి. సి డి. ఎ, బి, సి

17. గాలిలో ఐదింట ఒక వంతు ఆక్సిజన్ ఉంటే, మిగిలిన నాలుగు భాగాలు ఉండే వాయువు ఏది ?
ఎ. హైడ్రోజన్ బి. కార్బన్ డై ఆక్సైడ్
సి. నైట్రోజన్ డి. హీలియం

18. కిందవాటిలో నత్రజని స్థాన చేయగలిగే మొక్క ఏది ?
ఎ. వెదురు బి. బఠానీ
సి. చిక్కుడు డి. వరి
ఎ. ఎ, డి, బి. బి, సి
సి. ఎ, బి డి. పైవన్నీ

19. వీర్యాన్ని ఎందులో నిల్వ చేస్తారు ?
ఎ. ద్రవ హైడ్రోజన్ బి. పొడిమంచు
సి. ద్రవ హీలియం డి. ద్రవ నైట్రోజన్

సమాధానాలు

1.సి, 2.ఎ, 3.బి, 4.డి, 5.సి, 6.ఎ, 7.ఎ, 8.ఎ , 9.సి, 10.సి, 11.బి, 12.ఎ, 13.బి, 14.ఎ, 15.డి, 16.బి, 17.సి, 18.బి, 19.డి.

ఉద్యోగాలు

ఈఎస్ఎస్ఓ-ఇన్‌కాయిస్‌లో 19 ఖాళీలు

ఎర్త్ సిస్టమ్ సైన్స్ ఆర్గనైజేషన్ (ఈఎస్ఎస్ఓ)-ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్‌సీఓఐఎస్-ఇన్‌కాయిస్).. 19 ఖాళీలను భర్తీ చేయనుంది.

పోస్టుల పేరు-ఖాళీలు : ప్రాజెక్ట్ సైంటిస్ట్ 'బి'-5, ప్రాజెక్ట్ అసిస్టెంట్-11, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 'బి'(సివిల్)-1, ప్రాజెక్ట్ అసిస్టెంట్ (హిందీ) (జూనియర్ ట్రాన్స్‌లేటర్)-1, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్-1.

వేతనం : ప్రాజెక్ట్ సైంటిస్ట్ 'బి' పోస్టులకు రూ.55,860, ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ (హిందీ)(జూనియర్ ట్రాన్స్‌లేటర్) పోస్టులకు రూ.35,910, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 'బి' (సివిల్)-45,592, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,218.

అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి ఎంఎస్సీ/ ఎంపీఏ/ బీఈ/ బీటెక్/ ఎంటెక్/ బీఎస్సీ. దీంతోపాటు నిబంధనల మేరకు ఉద్యోగానుభవం, మార్కుల శాతం, కంప్యూటర్ అంశాల్లో పరిజ్ఞానం ఉండాలి.

వయోపరిమితి : 2017, ఆగస్టు 24 నాటికి జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 32 ఏళ్లు, ప్రాజెక్ట్ అసిస్టెంట్ (హిందీ) (జూనియర్ ట్రాన్స్‌లేటర్) పోస్టులకు 30 ఏళ్లు, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులకు 28 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : పోస్టులను అనుసరించి రాతపరీక్ష/ ఇంటర్వ్యూ.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరి తేదీ : ఆగస్టు 24, 2017.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.incois.gov.in

ఐటీబీపీలో ఉద్యోగాలు

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ)లో కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మ్యాన్) కొలువుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

ట్రేడ్‌ల వారీగా ఖాళీలు : టైలర్-19, గార్డెనర్-38, కోబ్లర్-27, వాటర్ క్యారియర్-95, సఫాయి కర్మచారి-33, కుక్-55, వాషర్‌మ్యాన్-25, బార్బర్-11.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు పూర్తి చేయాలి.

దరఖాస్తు చివరి తేదీ : సెప్టెంబర్ 7, 2017.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.itbpolice.nic.in, www.recruitment.itbpolice.nic.in

కదం తొక్కిన కార్మికులు

- 279 జిఒను రద్దు చేయాలని మున్సిపల్ కార్మికుల డిమాండ్
- పలుచోట్ల ర్యాలీలు, మానవహారాలు, రాస్తారోకోలు
- శ్రీకాకుళంలో 25 మంది అరెస్టు


శ్రీకాకుళంలో మున్సిపల్ కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు



విశాఖలో మానవహారం నిర్వహిస్తున్న జివిఎంసి కార్మికులు

ప్రజాశక్తి- యంత్రాంగం

మున్సిపల్ కార్మికుల ఉపాధిని దెబ్బతీసే 279 జిఒను రద్దు చేయాలని, 151 జిఒ ప్రకారం వేతనాలు పెంచాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం కదం తొక్కారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన రాస్తారోకోలు, ర్యాలీలు, మానవ హారాలు, వివిధరూపాల్లో నిరసనలు వ్యక్తం చేశారు.

శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద కార్మికులు ర్యాలీ అనంతరం మానవహారం చేపట్టేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి టి.తిరుపతిరావు, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం తో పాటు 25 మందిని అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడిచిపెట్టారు. పాలకొండలో కార్మికులు రాస్తారోకో చేశారు.

విజయవాడ వన్‌టౌన్‌లోని నెహ్రూ బొమ్మ సెంటర్, సింగ్‌నగర్‌ల్లో మానవహారం నిర్వహించారు. కృష్ణలంక సత్యం హోటల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు జ్యోతిబసు, సిఐటియు తూర్పు సిటీ కార్యదర్శి గురుమూర్తి పాల్గొన్నారు. కృష్ణా జిల్లా నూజివీడులో కార్మికులు మానవహారం నిర్వహించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట, మంగళగిరి, తాడేపల్లి, బాపట్ల, సత్తెనపల్లి, నరసరావుపేట, మాచర్లలో మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు మానవహారం నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. తెనాలిలో కార్మికులు ఉరి తాడును మెడలో వేసుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కార్మికులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ లకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని రాజ్యాంగం చెబుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. జిఒ 279ని టిడిపి నాయకుల, కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే ప్రభుత్వం ముందుకు తెచ్చిందని విమర్శించారు. పారిశుధ్య నిర్వహణను దెబ్బతీస్తూ యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపే నిర్ణయాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. యూనియన్ అధ్యక్షులు జి.సుబ్బారావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

విజయనగరంలో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన గంటస్తంభం వద్ద మున్సిపల్ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు.

అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యాన అనంతపురం నగరంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌కు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మానవహారం చేపట్టారు. తాడేపల్లి గూడెం, తణుకు, కొవ్వూరు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, పాలకొల్లు, నరసాపురం, భీమవరాల్లో మానవహారాలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో సిఐటియు ఆధ్వర్యాన కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు నిరసన ప్రదర్శన, మానవహారం చేపట్టారు. చిత్తూరు జిల్లాలో తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. కడపలో పాతబస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.

పోరాటం ఆగదు

- పునరావాసం కల్పించాకే పోలవరం నిర్మించాలి
- నిర్వాసితుల మహాధర్నాలో వక్తలు
- ఐదు రాష్ట్రాల సరిహద్దు రహదారి దిగ్బంధనం


చట్టి జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, చింతూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం డిమాండ్ చేసింది. తూర్పుగోదావరి జిల్లా చింతూరులో మంగళవారం నిర్వాసితుల సమస్యలపై మహాధర్నా నిర్వహించింది. ఎటపాక, విఆర్ పురం, కూనవరం, చింతూరు మండలాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది గిరిజనులు చింతూరు సెంటర్ నుంచి ఐదు రాష్ట్రాల సరిహద్దు జంక్షన్ అయిన చట్టి వరకూ మూడు కిలోమీటర్ల మేర మండుటెండలో పాదయాత్ర నిర్వహించి, రహదారిని దిగ్బంధించారు. నిర్వాసితుల ందరికీ పూర్తి పునరావాసం కల్పించాలని, భూమికి భూమి ఎప్పుడిస్తారో చెప్పాలని, ఇళ్లు ఎప్పుడు కట్టిస్తారో చెప్పాలని నిర్వాసి తులు నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠా యించి నిరసన తెలపడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ ముంపు మండలాల్లోని గిరిజన, గిరిజనేతరులందరికీ పునరావాసం కల్పించే వరకూ పోలవరం ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న కొండపోడు భూమికి పట్టా భూమితో సమానంగా పరిహారం చెల్లించాలన్నారు. భద్రాచలం ఎంఎల్ఎ సున్నం రాజయ్య మాట్లాడుతూ గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరు సాగిస్తామన్నారు. గిరిజనుల పోరాటం అమరావతికి, ఢిల్లీకి వినిపించేలా ఉండాలన్నారు. ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడారు.

17, 18 తేదీల్లో ముంపు మండలాల బంద్

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17, 18 తేదీల్లో ముంపు మండలాల్లో 48 గంటల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ చెప్పారు.

నిర్వాసితుల సంఘం నాయకులతో సిఐ వాగ్వివాదం

చట్టి జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ప్రాంతానికి చింతూరు సిఐ దుర్గాప్రసాద్ చేరుకుని ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న మిడియం బాబూ రావు, కృష్ణమూర్తి, భద్రాచలం ఎంఎల్ఎ సున్నం రాజయ్య, టి.అరుణ్‌తో వాగ్వివా దానికి దిగారు. భద్రాచలం ఎంఎల్ఎ రాజయ్య, మాజీ ఎంపీ మిడియం బాబూ రావు, ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ నిర్వా సితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసమే దిగ్బంధనం చేస్తున్నా మని చెప్పారు. సిఐ దురుసుగా మాట్లాడడం తో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ జోక్యం చేసుకుని గిరిజనుల సమస్యలు పరిష్కరించే వరకూ మహాధర్నాను విరమించేది లేదని ప్రకటించారు. పోలీసు కేసులకు తామేమీ భయపడబోమని, ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ గాని, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి గానీ రావాలని డిమాండ్ చేశారు. దీంతో చింతూరు ఐటిడిఎ పిఒ చినబాబు ఆందోళన జరుగు తున్న ప్రాంతానికి చేరుకున్నారు. నిర్వాసితుల సమస్యలను కలెక్టర్, ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రజల గొంతు 'ప్రజాశక్తి'

- ఘనంగా 37వ వార్షికోత్సవ సభ
- పలుచోట్ల వైద్య, రక్తదాన శిబిరాలు
- ప్రత్యేక సంచికల ఆవిష్కరణ


రక్తదానం చేస్తున్న ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ మేనేజర్ ఎంఎల్‌వి.ప్రసాదరావును పరామర్శిస్తున్న ప్రకాశం జిల్లా కలెక్టర్


విజయవాడలోని ఎంబివికెలో జరిగిన 37వ వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, యంత్రాంగం

ప్రజాశక్తి దినపత్రిక 37వ వార్షికోత్సవం, దినపత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరి హనుమంతరావు శత జయంతిని మంగళవారం రాష్ట్రంలో ఘనంగా నిర్వహించారు. విజయవాడ ఎంబివికెలో నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన తెలకపల్లి రవి మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలబడే ప్రధాన ఆయుధం ప్రజాశక్తి దినపత్రికేనని అన్నారు. నిత్యం ప్రజల పక్షాన ఉంటూ అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. తెలుగు నేలపై మొట్టమొదటిగా స్థాపించిన ప్రజాశక్తి' దినపత్రిక ఎన్నో నిర్బంధాలు, ఒత్తిళ్లు ఎదుర్కొందన్నారు. సైద్ధాంతిక సవాళ్లను తట్టుకోంటూ ఒక వ్యవస్థగా మారి మారుమూల ప్రాంతాల్లో సైతం ఎడిషన్లు పెట్టుకునే స్థాయికి వచ్చిందన్నారు. ప్రజాశక్తి పత్రిక రాజకీయాలకు సంబంధించింది కాదని, శ్రామికవర్గం కోసం దాని పునాదిపై నిలబడిందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రజాశక్తి పత్రిక మరిన్ని మార్పులు చేసుకుని ముందుకెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రజాశక్తి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్ వెంకట్రావు మాట్లాడుతూ పత్రిక కోసం అనేక మంది తమ ఆస్తులు, జీవితాలను త్యాగం చేశారన్నారు. అనేకమంది శ్రేయోభిలాషులు దీనికి సహాయం చేసినట్లు చెప్పారు. కార్మికవర్గం సైతం పత్రిక కోసం అహర్నిశలు పని చేసిందన్నారు. అలాంటి వారందరినీ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాశక్తి సంపాదకులు పాటూరు రామయ్య మాట్లాడుతూ ప్రజాశక్తి సిబ్బంది అంతా శ్రామిక వర్గంలోని భాగమేన్నారు. వీరంతా ఐక్యతతో ఒక్కటిగా ఉండి సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఇందులో పనిచేసేవారంతా త్యాగాలు చేసేవారేనన్నారు. ప్రజాశక్తి సిజిఎం ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ ఉద్యమ సంబంధాలే ప్రజాశక్తికి ఆధారం, సంఘటితమైన బలం కూడా అని అన్నారు. గరగపర్రు దళితుల బహిష్కరణ, విశాఖ భూకుంభకోణం ప్రజాశక్తే బయటపెట్టిందన్నారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఒంగోలులో వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరంల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. పలుచోట్ల ప్రజాశక్తి వెలువరించిన ప్రత్యేక సంచికలను ఆవిష్కరించారు. ఒంగోలులో ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ వి.వినయ్ చంద్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభ కలెక్టర్ వి.వినయ్ చంద్ మాట్లాడారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ నల్లూరి రంగారావు, ఎడిషన్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాదరావు పాల్గొన్నారు. గుంటూరులో జరిగిన సమావేశంలో ప్రజాశక్తి సాహితీ సంస్థ ఛైర్మన్ వి.కృష్ణయ్య మాట్లాడుతూ..పేదల సమస్యలను వెలుగులోకి తీసుకు రావడానికి ప్రజాశక్తి దినపత్రిక ప్రతి నిత్యం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఎడిషన్ మేనేజర్ జి.శివరామకృష్ణ, ప్రజాశక్తి జిల్లా కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రజాశక్తి సిబ్బంది రక్తదానం చేశారు. శిబిరాన్ని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి ప్రారంభించి ప్రత్యేక సంచికను జెసి-2 పి.రజనీకాంతారావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎస్.తిరు పతిరావు, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవేణి, శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు కె.శ్రీనివాసు ఆవిష్కరించారు. విజయన గరంలో ముఖ్యఅతిథిగా హాజరైన పోలీసు శిక్షణా కళాశాల ప్రిన్సిపల్ కె.రాజశిఖామణి రక్తదాన శిబిరాన్ని ప్రారంభిం చారు. అనంతరం ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా సత్యవేడులో జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ వి.గోపి అధ్యక్షత సభ జరిగింది. వైసిపి నాయకులు బాలాజీ, బిజెపి నాయకులు తులసీనెహ్రూ, పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, వెటర్నరీ జేడీ వెంకటేశ్వర్లు, ప్రజాశక్తి మేనేజర్ వి.చంద్రశేఖర్ హాజరై ప్రసం గించారు. 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఎంఎల్ఎ రామానాయుడు ఆవిష్కరించారు. ముఖ్య అతిథి శాసన మండలి విప్ అంగర రామ్మోహన్‌రావు మాట్లాడారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త గుణ్ణం నాగబాబు, మున్సిపల్ ఛైర్మన్ నారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ టిఎస్ ప్రకాష్; సిపిఐ నాయకులు వంగా జయసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విశాఖలో ప్రజాశక్తి 37వ వార్షికోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జివిఎంసి అడిషనల్ కమిషనర్ జివివిఎస్ మూర్తి, ప్రముఖ సాహితీ వేత్త రామతీర్థ, స్వాతి ప్రమోటర్స్ ఛైర్మన్, టిడిపి నాయకులు మేడపాటి కృష్ణారెడ్డి, విశాఖ పీపుల్స్ ఫ్రంట్ కన్వీనర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎస్.సుధాకర్, స్టాఫ్ రిపోర్టర్ మధుసూదనరావు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన

- గుంటూరులో మంత్రి పత్తిపాటి ఇంటివరకూ మహిళల ర్యాలీ


మంత్రి పత్తిపాటి ఇంటికి ర్యాలీగా వెళుతున్న మహిళలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట/ఏలూరు అర్బన్

జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని గుంటూరు జిల్లా చిలకలూరిపేట మహిళలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. సిఆర్ కాలనీ నుంచి పండరీపురంలోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు ఇంటి వరకూ ర్యాలీ నిర్వహిం చారు. మంత్రి పుల్లారావు అందుబాటులో లేకపోవటంతో ఆయన సతీమణి వెంకట కుమారితో మాట్లాడి సమస్యను వివరిం చారు. ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణం కారణంగా, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి సతీమణి వెంకటకుమారి మాట్లాడుతూ.. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్తానని, హామీనిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ హనుమాన్‌నగర్‌లో పడమర లాకుల వద్ద మద్యం దుకాణం ఏర్పాటును ప్రజలు అడ్డుకున్నారు.

గ్యాస్ సబ్సిడీ ఎత్తివేయడం దారుణం : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం దశల వారీగా గ్యాస్‌కు ఇచ్చే సబ్సిడీని ఎత్తివేయాలన్న నిర్ణయాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా అనంతపురం సిపిఎం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందరికీ సామాజిక భద్రత కల్పించే బాధ్యతను విస్మరించి గ్యాస్‌పై అందుతున్న రాయితీ తొలగించాలని చూడటం అన్యాయమని అన్నారు. ప్రతినెలా రూ.2లు చొప్పున పెంచి సబ్సిడీని ఎత్తివేస్తే పేదలు ఇబ్బందులు పడతారన్నారు. అన్ని వర్గాల ప్రజల మీద అదనపు భారం వేయడానికి బిజెపి కుట్ర పన్నుతోందన్నారు. ఒకవైపు పేదల సబ్సిడీలు రద్దుచేస్తూ మరో వైపు బడాబాబులు, కార్పొరేట్లకు రాయితీలు కల్పించడం బిజెపి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రిలయన్సు గ్యాస్ నిక్షేపాలు ఆంధ్రరాష్ట్రంలో ఉన్నాయని, సక్రమంగా వాటిని వినియోగిస్తే రాష్ట్ర ప్రజలందరికీ గ్యాస్ ఉచితంగా అందించే ఆస్కారం ఉందన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

డయేరియాతో చిన్నారి మృతి

ప్రజాశక్తి - పెదబయలు రూరల్ (విశాఖ)

వాంతులు, విరేచనాలతో బాధపడుతూ మూడేళ్ల చిన్నారి మంగళవారం మృతి చెందింది. పెదబయలు మండలంలోని పర్రెడ గ్రామానికి చెందిన వెచ్చంగి ప్రసాద్, రాములమ్మ దంపతుల కుమార్తె అవంతి వాంతులు, విరేచనాలతో మంగళవారం ఉదయం తీవ్ర అస్వస్తతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పాపను ఆస్పత్రికి తరలించేందుకు అంగన్వాడీ వర్కర్లు ప్రయత్నించినా కుటుంబ సభ్యులు ససేమిరా అంటూ నాటు వైద్యాన్ని ఆశ్రయించారు. దీంతో పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది.

రక్తహీనతతో కస్తుర్బా విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ (విశాఖ)

రక్తహీనత కారణంగా విశాఖ జిల్లా డుంబ్రిగుడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి చదువుతున్న రూడి బుజ్జి (13) అనేక గిరిజన బాలిక మంగళవారం మరణించింది. బుజ్జి కొన్నాళ్లుగా రక్తహీనతతో బాధపడుతుంది. శరీరంలో రక్త శాతం తగ్గడంతో సోమవారం స్పృహ కోల్పోయింది. దీంతో ఆమెను పాఠశాల సిబ్బంది డుంబ్రిగుడ పిహెచ్‌సికి తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యసేవల నిమిత్తం అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయడంతో కెజిహెచ్‌కు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో బుజ్జి మంగళవారం మృతి చెందింది. బుజ్జి రక్తహీనతతో బాధపడుతున్నట్లు రెండేళ్ల క్రితమే వైద్యాధికారులు గుర్తించారు. అయినా అధికార యంత్రాంగం సరైన పౌష్టికాహారం అందించకపోవడంతో బుజ్జి మృత్యువాత పడింది.

7న చేనేత నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- అనంతపురం టౌన్

చేనేత రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చేనేత కార్మిక అఖిలపక్ష సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఎఐటియుసి అనంతపురం కార్యాలయంలో చేనేతల అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జింకా చలపతి, రాజారెడ్డి, అమీర్‌బాషా, నరసింహులు, రవీంద్ర, గోవిందులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 7న ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా అనంతపురంలో భారీ నిరసన ప్రదర్శన చేస్తామని తెలిపారు. చేనేత రంగంపై జిఎస్‌టి పన్ను వేయడం దారుణమన్నారు. వైసిపి అధినేత జగన్ తన నవరత్నాలలో చేనేత పరిశ్రమ గురించి ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. చేనేత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాల్లో పెద్దఎత్తున చేనేత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎసిబి వలలో కోవూరు పిఆర్ ఇఒ

ప్రజాశక్తి-కోవూరు (నెల్లూరు)

ఎసిబి వలలో నెల్లూరు జిల్లా కోవూరు పంచాయతీరాజ్ (పిఆర్) కార్యదర్శి ఎన్.మురళీమోహన్ చిక్కుకున్నారు. ఎసిబి అధికారుల కథనం మేరకు.. కోవూరు లక్ష్మీనగర్ ప్రాంతంలో బిల్డింగ్ నిర్మించుకునేందుకు బిల్డర్ అయిన వేగూరు రాజేంద్రరెడ్డి అప్రూవల్ కోసం పంచాయతి కార్యాలయానికి వెళ్లాడు. అప్రూవల్ చేసేందుకు ఇఒ మురళీమోహన్ రూ.35 వేలు లంచం కావాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను సంప్రదించాడు. ఎసిబి అధికారుల సూచనలతో బాధితుడు పంచాయతి కార్యదర్శి వద్దకెళ్లి తాను రూ.35 వేలు ఇవ్వలేనని, రూ.30 వేలు ఇస్తానని చెప్పడంతో మంగళవారంలోపు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఇఒకు లంచం ఇస్తుండగా ఎసిబి డిఎస్‌పి పరమేశ్వరరెడ్డి, సిఐలు శ్రీహరిరావు, ప్రసాద్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు.

ప్రజ్ఞ

జవాబులు

1. జస్టిస్ అశోక్ కుమార్ రూపన్ వాల్ కమిటీ, 2. చంద్రబాబునాయుడు
3. జస్టిస్ ఎంబి లోకుర్
4. డేవిడ్ ఆర్.సిమ్లిహ్
5. హెచ్‌కే హల్దార్

సూర్జిత్ ఆశయ సాధనకు కృషి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హరికిషన్‌సింగ్ సూర్జిత్ ఆశయాలను ప్రతి కార్యకర్త సాధించేదాకా అవిశ్రాంతంగా పోరాడాలని సిపిఎం కర్నూలు నగర కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కోరారు. మంగళవారం కర్నూలు పాతబస్తీలోని సూర్జిత్ భవన్‌లో హరికిషన్ సింగ్ సూర్జిత్ 9వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎండి.షరీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. ఐక్య సంఘటన ప్రభుత్వాలు, కాంగ్రెసేతర ప్రభుత్వాలు విపిసింగ్, చంద్రశేఖర్, ఐకె గుజ్రాల్, దేవగౌడలాంటి ప్రభుత్వాల ఏర్పాటుకు కీలక సూత్రధారిగా సూర్జిత్ పని చేశారని గుర్తు చేశారు. ఆయన చిన్న వయస్సులోనే బ్రిటీష్ వారి కోర్టుపై వున్న జెండా దింపి మన జాతీయజెండా ఎగురవేసిన వీరుడని కొనియాడారు. ఆయన చనిపోవడానికి నాలుగేళ్ల ముందు తన యావదాస్తిని పంజాబ్ యువ వీరులకు, సిపిఎం అభివృద్ధి కోసం ధారాదత్తం చేసిన మహానుభావుడని, అలాంటి గొప్పనేత ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



తిరుపతిలో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌రెడ్డి, వేదికపై అఖిలపక్ష నాయకులు

పోరాడితే.. పోలీసు కేసులా..!

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'సమస్యలు పరిష్కరించాలని అడిగితే.. పోలీసులు కేసులు పెడతారా' అని అఖిలపక్ష నేతలు ప్రశ్నించారు. జులై 22న దళిత సమస్యలపై కలెక్టరేట్ కార్యాలయం వద్ద వేలాదిమంది ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాలో పోలీసులు అక్రమంగా 42 మందిపై కేసులు పెట్టడం.. ప్రజా ఉద్యమాల పట్ల అనుసరిస్తున్న వైఖరి, అధికారుల నియంతృత్వ ధోరణి అర్థమవుతోందన్నారు. చిత్తూరు జిల్లాలోని తిరుపతిలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.కుమార్‌రెడ్డి నేతృత్వంలో, పలమనేరులో కార్యదర్శివర్గ సభ్యులు వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో, చౌడేపల్లిలో కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి నేతృత్వంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన కలెక్టర్, పోలీసులు దళితుల పట్ల వివక్ష చూపుతుంటే, దౌర్జన్యాలు చేస్తుంటే ఏమీ చేయలేని అధికారులు దళితులపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారన్నారు. సిపిఐ నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ రాస్తారోకో చేస్తే వందలాది మంది ఇబ్బంది పడ్డారని కేసులు పెట్టారని, మరి వేలాది మంది దళితులు గ్రీవెన్స్‌డేకని వస్తే వారిని ఇబ్బంది పెట్టి వినతిపత్రాలు తీసుకోక పోవడం ఏంటన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేసులు పెట్టి ఉద్యమాలను అణచలేరన్నారు. వైసిపి నాయకులు రాజేంద్ర మాట్లాడుతూ టిడిపి వస్తే కరువులు, కేసులు వస్తాయన్నారు. టిడిపి ఏజెంట్లుగా అధికారులు పనిచేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీదేవి మాట్లాడుతూ టిడిపి పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు.

పాసుబుక్ కోసం సెల్‌టవర్ ఎక్కిన రైతు

కలెక్టర్‌తో మాజీ మంత్రి రావెల చర్చ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వనందుకు నిరసనగా గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కాట్రపాడు గ్రామానికి చెందిన రైతు పెరుగు రామకృష్ణయ్య టవర్ ఎక్కి దూకుతానని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. టిడిపి జెండా పట్టుకుని నిరసనకు దిగాడు. శివరామకృష్ణ పాసు పుస్తకం కోసం కొంత కాలంగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అధికారులు ఏదో కొర్రీలతో వేధిస్తుండంటంతో లంచం ఇవ్వందే పాసు పుస్తకం రాదని సిబ్బంది ద్వారా తెలుసుకున్న రైతు గత్యంతరం లేక మంగళవారం సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ప్రకటించారు. గ్రామస్తులు, పోలీసులు జోక్యం చేసుకుని అతన్ని కిందకు దింపారు. స్థానిక ప్రజా ప్రతినిధులూ పట్టించుకోవడం లేదని శివరామకృష్ణ వాపోయాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు స్పందించి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పాసు పుస్తకం ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌డిఒతో మాట్లాడి తక్షణం సమస్య పరిష్కరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వెంటనే పాసు పుస్తకం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రావెల స్పందన, జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ అంశాన్ని స్థానిక పోలీసు అధికారులు రామకృష్ణయ్యకు సమాచారం ఇచ్చి టవర్ నుంచి కిందకు దింపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ విషయం పలుమార్లు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా క్షేత్రస్థాయిలో సమస్య అలాగే కొనసాగుతోంది.

ఆదివాసీ ఉత్సవాలను జయప్రదం చేయండి

గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి- సీతంపేట (శ్రీకాకుళం జిల్లా)

ఈ నెల తొమ్మిదిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజన సంఘం ఆధ్వర్యాన ఈ నెల రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకూ నిర్వహించే ఆదివాసీ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి కోరారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం, ఏజెన్సీ యువజన సంఘం, నవర భాష వాలంటీర్ల సంఘం, చిన్నమ్మి ఆదివాసీ సంఘం, గిరిజన ఉపాధ్యాయ సంక్షేమ సంఘాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. గిరిజనుల పనిముట్లు, వాయిద్యాలు, నృత్యాలు, కళలు, పంటలు, చిరుధాన్యాలు, కట్టుబాట్లు, ఆహార అలవాట్లు బాహ్య ప్రపంచానికి తెలియజేసేలా ప్రదర్శించాలన్నారు. ప్రతి ఐటిడిఎలో గిరిజన మ్యూజియంను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ నెల తొమ్మిదిన సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

పెర్ఫార్మెన్స్ పేరుతో పదవీ విరమణ తగదు

యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెర్ఫార్మెన్స్ పేరుతో ఉద్యోగుల్ని పదవీ విరమణ చేసే ఆలోచనను విరమించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. దీనికోసం ఫండమెంటల్ రూల్స్, పెన్షన్ రూల్స్ సవరణకు ఎవరికోసం, ఎందుకోసం ప్రతిపాదనలు చేశారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐ వెంకటేశ్వరరావు, పి బాబురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60 ఏళ్ళ పెంపు ఘనకార్యంగా చెప్పుకొనే ప్రభుత్వానికి ఇంతలోనే ఈ వైపరీత్యం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి, అలాంటి ఆలోచనేమీ లేదని నమ్మబలకడం పట్ల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని, ముఖ్యమంత్రి, మంత్రులు ఇస్తున్న వివరణలు నిజాయితీగా లేవని తెలిపారు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు, గురుకులాలకు 60 ఏళ్ల పదవీ విరమణ ఇంతవరకు ఎందుకు వర్తింపచేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ఉద్యోగుల ప్రభుత్వమని చెప్పుకుంటూ ఎందుకు వివక్ష చూపుతోందని ప్రశ్నించారు. గత్యంతరం లేక కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఈ వివక్షను ప్రశ్నించిందని గుర్తు చేశారు.

రేపటి రాష్ట్ర వ్యాప్త ధర్నాల్ని జయప్రదం చేయాలి

మున్సిపల్ టీచర్ల సమస్యలు, పాఠశాలల సమస్యలు పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 3న జరిగే రాష్ట్ర వ్యాప్త ధర్నాలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐ వెంకటేశ్వరరావు, పి బాబురెడ్డి మరో ప్రకటనలో పిలుపునిచ్చారు. మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్ని కొనసాగించాలనే ప్రధానమైన డిమాండ్లతో అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల ఎదుట ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మున్సిపల్ మంత్రి ఏకపక్ష నిర్ణయాలతో మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం రద్దయ్యిందని విమర్శించారు. పాఠశాలల్లో అప్‌గ్రేడ్ అయిన పండిట్, పిఇటి పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వాలని, టీచర్ల పిఎఫ్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని మున్సిపాల్టీలకు ఎంఇఒ, మున్సిపల్ కార్పొరేషన్లకు డివైఇఒ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ పవర్‌తో పాటు జీవో 40లో అన్ని అధికారాలివ్వాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల్ని పరిష్కరించాలని ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో మున్సిపల్ టీచర్లు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

చైనా చొరబాటు వార్తలను తోసిపుచ్చిన సైన్యం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ లోని చమోలీ జిల్లా బారాహోతీ ప్రాంతంలో చైనా సైనికులు భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చినట్లు వెలువడిన వార్తలను సైన్యం తోసిపుచ్చింది. ఈ వార్తల్లో పేర్కొన్నట్టుగా బారాహోతీ ప్రాంతంలో ఎటువంటి చొరబాట్లు జరగలేదని సైన్యం ప్రతినిధి కల్నల్ అమల్ ఆనంద్ మీడియాకు చెప్పారు. వాస్తవాధీన రేఖపై భిన్నాభిప్రాయాలు వుండటం వల్లే తరచు పొరుగుదేశాల భూభాగంలోకి ప్రవేశించటం జరుగుతుందని ఆయన వివరించారు. కాగా ఈ ఘటనపై విచారణ కమిటీని నియమించినట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రతినిధి మదన్ కౌశిక్ చెప్పారు. ప్రస్తుతం ఈ ఘటన గురించిన సమాచారం తమకు అందిందని, అయితే తాము దీనిని పూర్తిగా తోసిపుచ్చలేమని ఆయన మీడియాకు చెప్పారు. ఈ ఘటనపై విచారణ జరిపి రెండు రోజుల్లో నివేదిక అందించాలని తాము అధికారులను ఆదేశించినట్లు ఆయన వివరించారు.

విజయమాల్యా అప్పగింత పత్రాలు అందజేత



న్యూఢిల్లీ : విజయమాల్యాను స్వదేశానికి రప్పించేందుకు 'ఓపెనింగ్ నోట్'తో సహా అవసరమైన పత్రాలను ఆయన తరుపు న్యాయవాదులకు సమర్పించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. విజయమాల్యా కేసుపై బ్రిటన్ కోర్టు విధించిన గడువులోగానే ఆ పత్రాలను సమర్పించినట్లు వారు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సమగ్ర వివరణతో 'ఓపెనింగ్ నోట్'ను మాల్యా తరుపు డిఫెన్స్ బృందానికి జులై 31లోగా అందించాలని లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టు జులై 6నాటి విచారణ సందర్భంగా ఆదేశించింది. దాదాపు రూ.9 వేల కోట్ల బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకున్న 61 ఏళ్ళ విజయమాల్యాను తిరిగి స్వదేశానికి పంపాలని భారత్ అధికారులు ఆ దేశ న్యాయస్థానాన్ని కోరిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన అన్ని వ్యవహారాలు సక్రమంగానే నడుస్తున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టులో సెప్టెంబరు 14న జరగనున్నది.

సోహ్రాబుద్దీన్ కేసులో మాజీ డిజికి విముక్తి

ముంబయి : సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌లో గుజరాత్ మాజీ పోలీస్ అధికారి డిజి వంజరాకు ప్రత్యేక కోర్టు విముక్తి ప్రసాదించింది. వంజరాతో పాటు, రాజస్తాన్ పోలీస్ అధికారిపై చేసిన ఆరోపణలకు తగిన సాక్ష్యాలు లేవని కోర్టు మంగళవారం తెలిపింది. దీంతో 12 ఏళ్ల ఈ కేసులో 38 మంది నిందితుల్లో ఇప్పటి వరకూ 15 మంది విముక్తులయ్యారు. గుజరాత్‌లో వివాదాస్పద పోలీస్ అధికారుల్లో వంజర ఒకరు. రానున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కూడా అతను భావిస్తున్నారు. క్రిమినల్‌గా పేరుగాంచిన సోహ్రాబుద్దీన్ 2005లో గాంధీనగర్‌కు సమీపంలో అతని భార్యతో సహా పోలీసులు కాల్చిచంపారు. సోహ్రాబుద్దీన్ దంపతులు మహారాష్ట్రకు ప్రయాణిస్తున్న సందర్భంలో గుజరాత్ యాంటీ టెర్రర్ స్క్వాడ్ వారి కిడ్నాప్ చేసి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రచారం చేశారనే ఆరోపణలు వున్నాయి. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. తరువాత ఏడాది ఈ కేసులో సాక్షి ఉల్లాసిరామ్ ప్రజాపతి కూడా హత్యకు గురయ్యాడు. సిబిఐ అభ్యర్ధన మేరకు 2012లో ఈ కేసు విచారణను గుజరాత్ నుండి మహారాష్ట్రకు సుప్రీంకోర్టు బదిలీ చేసింది. ఈ కేసులో 2014లో వంజరకు బెయిల్ మంజారయింది. తరువాత ఏడాది ఫిబ్రవరిలో మరో కేసులో సబర్మతి జైలు నుంచి వంజర విడుదలయ్యాడు. కళాశాల విద్యార్థి ఇష్రాత్ జెహన్‌ను కాల్చి చంపిన ఈ కేసు కూడా నకిలి ఎన్‌కౌంటర్‌గా ఆరోపణలు రావడం గమనార్హం.

కాశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో మిలిటెంట్ కమాండర్ హతం

చెలరేగిన నిరసనలు

శ్రీనగర్ : పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన మిలిటెంట్ కమాండర్ ఒకరు మంగళవారం నాడు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు పోలీసులు చెప్పారు. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా అల్లర్లు చెలరేగటంతో అధికారులు ఇంటర్నెట్, రైలు సర్వీసులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పుల్వామా జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే గ్రూప్‌కు చెందిన కమాండర్ అబూదుజానా మరణించినట్లు పోలీసు ప్రతినిధి మనోజ్ పండితా చెప్పారు. ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు హద్రిపురా గ్రామంలో మంగళవారం వేకువజామున గాలింపు చర్యలు చేపట్టారని, ఈ సమయంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మిలిటెంట్లు మరణించారని ఆయన చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన దుజానా దక్షిణ కాశ్మీర్‌లోని అనేక మిలిటెంట్ దాడుల్లో పాల్గొన్నాడని, అతడి తలపై 15 లక్షల రూపాయల రివార్డు వుందని ఆయన వివరించారు. ఈ ఎన్‌కౌంటర్ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా చెలరేగిన అల్లర్లలో ఒక పౌరుడు మరణించగా, పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. దాదాపు ఏడాది క్రితం జరిగిన బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా చెలరేగిన అల్లర్లలో దాదాపు 90 మంది పౌరులు మరణించిన విషయం తెలిసిందే.

ఆన్‌లైన్ శకంలో 'గోప్యత' అనేది లేదు

సుప్రీం కోర్టుకు వెల్లడించిన యుఐడిఎఐ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆన్‌లైన్ శకంలో 'గోప్యత' అనేది లేదని యునిక్ ఐడెంటిఫికేషన్ అథార్టీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ప్రతినిధి ఒకరు మంగళవారం సుప్రీం కోర్టుకు తెలిపారు. చట్టంలో పౌరుల రక్షణకు సంబంధించిన అంశాలున్నాయని, కోర్టు అనుమతి లేకుండా ప్రభుత్వం ఆధార్‌ను ఉపయోగించి పౌరుల సమాచారం సేకరించే వీలులేని విధంగా నిబంధనలు ఉన్నాయని యుఐడిఎఐ తరుపున కోర్టులో ప్రాతినిధ్యం వహిస్తున్న తుషార్ మెహతా తెలిపారు. పౌరుల 'గోప్యత'కు ఆధార్ ఇప్పటికే రక్షణ కల్పిస్తోందని, అన్ని సమస్యలను ఆధార్ చట్టం పరిష్కరిస్తుందని ఆయన తెలిపారు.

'గోప్యత' ప్రాథమిక హక్కా? అనే అంశంపై ఇప్పటికే చాలా వాదనలు జరిగాయని, ప్రస్తుత ఆన్‌లైన్ శకంలో ఏదీ ప్రయివేటు కాదని అన్నారు. దేశ పౌరునికి రాజ్యాంగం కల్పించిన స్వతంత్ర హక్కుకు రక్షణకల్పించడంలో ప్రభుత్వం సమతుల్యతను పాటించాల్సిన అవసరముంద న్నారు. అదే సమయంలో డేటాకు కూడా రక్షణ కల్పించాలని మెహతా తెలిపారు.

అమెరికాలో వలే మన దేశంలో గోప్యతపై అంతగా ఆందోళన చెందాల్సిన అసరం లేదని మెహతా పేర్కొన్నారు. దేశ పౌరులకు ఆధార్ నంబర్‌ను ఇచ్చేందుకు యుఐడిఎఐను తొలిసారిగా 2009లో ఏర్పాటు చేశారు. అయితే దీనికి రక్షణ కల్పించే చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదం పొందలేదు. పాలనాపరమైన చర్యల ద్వారా యుఐడిఎఐ పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నది. 'గోప్యత' హక్కును ప్రాథమిక హక్కుగా పార్లమెంట్ మాత్రమే చట్టం చేయగలదని అంతకుముందు మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది.

రాజ్యసభలో ప్రభుత్వానికి చుక్కెదురు

- నెగ్గిన విపక్షాల సవరణలు
- ఓబిసి బిల్లు సవరణలను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం
- బిజెపి ఎంపీల గైర్హాజరే కారణం



న్యూఢిల్లీ : వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు (ఓబిసి) రాజ్యాంగ బద్ధమైన హోదాను కల్పించేందుకు రాజ్యసభలో ప్రతిపాదించిన సవరణ బిల్లును ఆమోదింప చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. దాదాపు 30 మంది ఎంపీలు, మంత్రులు హాజరు కాకపోవడంతో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తప్పలేదు. మరోవంక ప్రతిపక్షాలు ప్రతిపాదించిన కొన్ని సవరణలకు సభ ఆమోదం లభించింది.

జాతీయ కమిషన్ కూర్పుకు సంబంధించిన నిబంధన-3ను చేర్చకుండానే 123వ రాజ్యాంగ సవరణ ఆమోదం పొందింది. సంబంధిత బిల్లుకు చేసిన సవరణలు 74-52 సాధారణ మెజార్టీతో ఆమోదం పొందినప్పటికీ సవరించబడిన నిబంధన బిల్లులో చేర్చబడాలంటే రెండింట మూడోవంతు మెజార్టీ అవసరం. ఒక సారి రాజ్యాంగ సవరణను ఆమోదించిన తరువాత దానిని వెనక్కి తీసుకోవ డం కుదరదు. అందువల్ల నిబంధనను సవరణలో చేర్చా లంటే రాజ్యసభలోని సభ్యులందరూ కూడా తప్పనిసరిగా ఓటు వేయాలి. అయితే దీనిపై ఏకాభిప్రాయం కుదర నందువల్ల సవరణకు ఆ నిబంధనను చేర్చడంలో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి, రాజ్యసభ నేత అరుణ్ జైట్లీ మాట్లాడుతూ ఓబిసి రిజర్వేషన్‌ను ప్రతిపక్షాలు వద్దనుకుంటున్నాయని, అందువల్లే అలా వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించారు. దీనికి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, కాంగ్రెస్ నేత గులాం నబి అజాద్‌లు స్పందిస్తూ తాము ఓబిసి రిజర్వేషన్‌కు కట్టు బడి ఉన్నామన్నారు. ఇటువంటి పొరపాటు మళ్ళీ జరగరాదు

ఎంపీలను హెచ్చరించిన అమిత్ షా

రాజ్యసభకు పార్టీ ఎంపీలు హాజరు కాకపోవడం పట్ల బిజెపి అధ్యక్షులు అమిత్ షా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి పొరపాటు మళ్ళీ జరగకుండా చూడాలని ఎంపీలను హెచ్చరించారు. ఓబిసి కమిషన్‌కు రాజ్యాంగ హోదాను కల్పించే కీలకమైన బిల్లును ఆమోదింప చేయడంలో ప్రభుత్వం విఫలమవ్వడంతో అమిత్ షా ఎంపీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో 123వ రాజ్యాంగ సవరణ బిల్లు ఓటింగ్‌కు వచ్చిన సమయంలో పలువురు బిజెపి ఎంపీలు, కీలక మంత్రులు గైర్హాజరయ్యారు. మళ్ళీ ఇటువంటి పొరపాటు జరగకుండా చూడాలని రాజ్యసభ సభ్యులను అమిత్ షా కోరారు. రాజ్యసభకు పార్టీ ఎంపీలు హాజరు కాకపోవడంపై గత వారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్‌కు క్రమం తప్పకుండా హాజరు కావాలని మోడీ వారిని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులు ఆమోదం పొందేలా చూడటం ప్రతిపక్ష సభ్యుల పని కాదని, అధికార పార్టీకి చెందిన ఎంపీలు, మంత్రుల బాధ్యతని మోడీ వారిని హెచ్చరించారు. ఓబిసి బిల్లును ఆమోదింప చేయడం పట్ల బిజెపి సీరియస్‌గా లేదనిసీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం ఆరోపిస్తూ ట్వీట్ చేశారు.

చైనా ఎంబసీలో ఘనంగా పిఎల్ఎ 90వ వార్షికోత్సవం

న్యూఢిల్లీ : చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) 90వ వార్షికోత్సవం సందర్భంగా ఇక్కడి చైనా ఎంబసీ ప్రముఖులకు విందు ఇచ్చింది. సోమవారం ఇక్కడ హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి భారత వైమానిక దళ వైస్ మార్షల్ ఎస్.ప్రభాకరన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. భారత్‌లో చైనా రాయబారి లూ ఝువోహుయితో కలిసి ఆయన వేదిక పంచుకున్నారు. భారత ప్రభుత్వ, సైనిక, పార్లమెంట్, రాజకీయ పార్టీలకు చెందిన దాదాపు 300మంది ఈ విందుకు హాజరయ్యారు. పిఎల్ఎ ఆధునిక సైన్యంగా అభివృద్ధి చెందిందని, అకుంఠిత దీక్షతో దేశ జాతీయ భద్రత, సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకుంటుందని, ఎటువంటి భద్రతాపరమైన సవాళ్ళనైనా ధీటుగా ఎదుర్కొంటుందని చైనా సీనియర్ సైనికాధికారి జియాన్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏ ఒక్క వివాదాన్ని ప్రస్తావించకపోయినప్పటికీ ప్రస్తుతం భారత్, చైనా సరిహద్దు ప్రాంతాల్లో కొన్ని కొత్త సంక్లిష్టతలు ఏర్పడ్డాయని వ్యాఖ్యానించారు. అయితే ఇరు దేశాల మధ్య మంచి సంబంధాలు వున్నాయని అన్నారు.

ఈశాన్య రాష్ట్రాలకు రు.2,350 కోట్ల వరదసాయం

ప్రధాని ప్రకటన



గువాహాటి: వరద బీభత్సానికి గురైన ఈశాన్య రాష్ట్రాలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రాతిపదికన రు.2,350 కోట్ల రూపాయల సాయం అందించనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. వరద బాధిత ఈశాన్య రాష్ట్రాలను సందర్శించేందుకు మంగళవారం ఇక్కడికి చేరుకున్న ప్రధాని అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్ ముఖ్యమంత్రులు, వారి కేబినెట్ సహచరులతో కలిసి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు రు.2,350 కోట్ల వరద సాయం ప్యాకేజ్‌ని ప్రధాని ప్రకటించినట్లు అసోం ఆర్థిక మంత్రి హిమంత బిశ్వశర్మ చెప్పారు. ఏఏ రాష్ట్రాలకు ఎంతెంత సాయం అందించేది త్వరలోనే ప్రకటిస్తారని ఆయన వివరించారు. దీనికి అదనంగా బ్రహ్మపుత్రా నది వరదలపై అధ్యయనం చేసేందుకు ఒక రిసెర్చ్ ప్రాజెక్టు కోసం రు.100 కోట్ల కార్పస్ ఫండ్‌ను కూడా ప్రధాని ప్రకటించారని ఆయన చెప్పారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్లతో కూడిన ఈ ఉన్నతాధికార కమిటీ బ్రహ్మపుత్రా నది ప్రవాహాన్ని అధ్యయనం చేసి వరదలను ఎదుర్కొనేందుకు అవసరమైన సూచనలిస్తారని, ఇది దీర్ఘకాలిక ప్రాజెక్టు అని ఆయన వివరించారు.

పార్లమెంట్ భవన సముదాయ ప్రారంభం

- అన్సారీకి అందని ఆహ్వానం
- ప్రతిపక్షాల ఆగ్రహం

న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో నూతనంగా నిర్మించిన భవన సముదాయ ప్రారంభోత్సవానికి రాజ్యసభ ఛైర్మన్‌ను హమీద్ అన్సారీని ఆహ్వానించక పోవడం పట్ల ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఆక్షేపించాయి. దీంతో ప్రభుత్వం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కో వలసి వచ్చింది. హమీద్ అన్సారీని నిర్లక్ష్యం చేసి రాజ్యసభను, దాని సభ్యులను ప్రభుత్వం అవమా నించిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ కార్యక్రమానికి అన్సారీని ఆహ్వానించి ఉండాల్సిం దని రాజ్యసభ వైస్ ఛైర్మన్ పిజె కురియన్ అన్నా రు. భవన సముదాయ ప్రారంభోత్సవానికి అన్సా రీని, రాజ్యసభ ఎంపీలను ఆహ్వానించక పోవడాన్ని సిపిఎం, కాంగ్రెస్, ఎస్పి సభ్యులు లేవనెత్తారు. హమీద్ అన్సారీని ఆహ్వానించక పోవ డానికి గల కారణమేమిటో తెలపాలని కోరుతూ లోక్‌సభ సెక్రటరియేట్‌కు ఇప్పటికే రాజ్యసభ సెక్రటరియేట్ లేఖరాసిందని కురియన్ తెలిపారు. సభ్యులు లేవనెత్తిన ఈ అంశంపై కురియన్ స్పందిస్తూ పార్లమెంట్ భవన సముదాయానికి సంబంధించిన నిర్వహణ బాధ్యత లోక్‌సభ స్పీకర్‌దే అయినప్పటికీ, దీనిని తెలియచేసే డాక్యుమెంట్ ఏదీ నమోదై లేదని తెలిపారు. రాజ్యసభ నేత , ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ పార్లమెంట్ భవన సముదాయ నిర్వహణకు 1952 నుంచి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2009లో శంకు స్థాపన చేసిన భవన నిర్మాణం పూర్తి కావడం తో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం దానిని ప్రారంభించారు. నూతన భవనాన్ని ప్రధాన మంత్రి ప్రారంభించడం పట్ల తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, రాజ్యసభ ఛైర్మన్, డిప్యూటి ఛైర్మన్‌లు అక్కడ లేక పోవడంపైనే తమ అభ్యంతరమని అజాద్ తెలిపారు.

జిఎస్‌టితో తగ్గిన వాణిజ్య కార్యకలాపాలు

న్యూఢిల్లీ/బెంగళూరు : దేశంలో ఈ ఏడాది జులై 1 నుంచి కొత్తగా అమలులోకి వచ్చిన జిఎస్‌టి పన్ను విధానం నేపథ్యంలో ఒక్క నెలలోనే వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా పడిపోయాయని ఒక సర్వేలో వెల్లడైంది. గడిచిన తొమ్మిదేళ్ళ కాలంలో ఇంత తక్కువ స్థాయికి ఎన్నడూ పడిపోలేదని సర్వే పేర్కొంది. జాతీయ స్థాయిలో కొత్తగా అమలులోకి వచ్చిన అమ్మకం పన్ను నేపథ్యంలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు జులై నెలలో తీవ్ర అంతరాయం కలిగిందని ఆ సర్వే పేర్కొంది. నిక్కీ/ఐహెచ్‌ఎస్ మార్కిట్ మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్స్ సంస్థ సర్వే నిర్వహించింది. ఆ సంస్థ నిర్వహించిన సర్వే మేరకు అంతకుముందు నెలలో 50.9గా ఉన్న సూచీ జులై నెలలో ఎవరూ ఊహించని విధంగా 47.9 శాతానికి పడిపోయింది. సూచీ 50 పాయింట్లకు దిగువకు పడిపోవడం ఇదే తొలిసారి. అదేవిధంగా 2008 నవంబరు నాటి ఉంచి చూస్తే వృద్ధి రేటు ఈ ఏడాది జులై నెలలోనే అత్యధికంగా క్షీణించింది. వృద్ధి రేటు నిర్ణయంపై రిజర్వు బ్యాంకు సమావేశం జరగడానికి ఒక రోజు ముందుగా ఈ గణాంకాలు వెల్లడయ్యాయి. రెపో రేటును ఆరున్నరేళ్ళ దిగువకు, 25 బేసిస్ పాయింట్లకు తగ్గించాలని రిజర్వు బ్యాంకు ద్రవ్య విధాన కమిటీ భావిస్తోంది.

నితీష్ కుమార్ మండలి సభ్యత్వం రద్దు

విచారణకు సుప్రీం అంగీకారం




న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శాసనమండలి సభ్యత్వం రద్దు చేయాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీ కరించింది. ఇటీవలి ఎన్నికల సమయంలో దాఖలుచేసిన అఫిడవిట్‌లో తనపై గతంలో నమోదయిన క్రిమినల్ కేసును ఆయన పేర్కొనలేదని, అందువల్ల 2002 ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నితీష్ మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టాలంటూ పిటిషనర్ తరపు న్యాయవాది ఎంఎల్ శర్మ చేసిన వినతిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తులు దీపక్ మిశ్రా, అమితావరాయ్, ఎఎం ఖాన్‌విల్‌కర్‌తో కూడిన ధర్మాసనం ఇందుకు అంగీకరిస్తూ విచారణ తేదీని త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంది. నితీష్ కుమార్‌పై ఒక హత్య కేసు ఇప్పటికీ పెండింగ్‌లో వుందని, 1991లో బార్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నిక సమయంలో కాంగ్రెస్ నేత సీతారామ్ సింగ్ ను హత్య చేయటంతోపాటు మరో నలుగురిని గాయపర్చిన కేసులో నితీష్‌కు ప్రమేయం వున్నట్లు కేసు నమోదయిందని పిటిషనర్ తరపు న్యాయవాది శర్మ గుర్తు చేశారు.

యమునా నది తీరప్రాంతం నుండి చెత్తను తొలగించండి

ఢిల్లీ, యుపి ప్రభుత్వాలకు ఎన్‌జిటి ఆదేశం

న్యూఢిల్లీ : వరద ముంపునకు గురైన యమునా నది తీరప్రాంతాలలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రభుత్వాలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశించింది. నది కాలుష్యానికి విచక్షణారహి తంగా వ్యర్థ పదార్థాలు పడేయడమే కారణమని పేర్కొంది.

తమ ఆదేశాలను పాటించాల్సిన బాధ్యత ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లకు చెందిన నీటిపా రుదల శాఖ విభాగాలదేనని ఎన్‌జిటి ఛైర్‌పర్సన్ జస్టిస్ స్వతంతర్‌కుమార్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. యమునానదికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించి ఉండకపోతే, మూడు వారా ల్లోగా తొలగించాలని ఆదేశించింది. యమునా నది పునరుద్ధరణ పనులను అనవసరంగా నిలిపివేయొద్దని తెలిపింది. రోజు రోజుకు కాలుష్యం పెరిగి పోతున్నదని, ఈ విషయంలో అధికారుల నిష్క్రియాపరత్వాన్ని సహించేది లేదని బెంచ్ వెల్లడించింది. పర్యావరణం, ప్రజారోగ్య పరిరక్షణల దృష్ట్యా ప్రభుత్వంతో పాటు సంబంధిత అన్ని శాఖలు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి యమునానదిని పునరుద్ధరించి దాని పూర్వ స్థితికి తీసుకు రావాలని చెప్పింది. ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా పనులు చేపట్టాలని, ఇందులో ఎటు వంటి అవరోధాలు ఏర్పడినా సహించేది లేదని తెలి పింది. యమునానది వద్ద పారిశుద్ధ్య పనులు అమ లయ్యేలా చూసేందుకు ఏర్పాటు చేసిన ప్రిన్సిపల్ కమిటీని పునరుద్ధరించింది. జలవనరుల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి శశిశేఖర్‌ను ప్రత్యేక ఆహ్వానితు నిగా కమిటీలో చేర్చింది. యమునానది పునరుద్ధ రణపై ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాలకు చెందిన అధికారులతో ఈ నెల 8న సమావేశం నిర్వహించనున్నట్లు ఎన్‌జిటి తెలిపింది.



విమర్శలు ఆపండి

శరద్‌యాదవ్‌పై నితీష్ ఆగ్రహం

పాట్నా : తనపై విమర్శలు కట్టిపెట్టాలని తన సొంత పార్టీ నేత శరద్ యాదవ్‌కు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సూచించారు. తాను ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు పార్టీకి ఏది మంచిదో అని అనేకసార్లు ఆలోచిస్తానని నితీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఆర్‌జెడి, కాంగ్రెస్‌లతో కూడిన మహా కూటమి నుంచి విడిపోయి బిజెపి మద్దతతో నితీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై జనతాదళ్ (యు) మాజీ అధ్యక్షులు శరద్‌యాదవ్ విమర్శలు చేస్తున్నారు. దీనిపై నితీష్ కుమార్ తీవ్రంగా స్పందించారు. మహా కూటమి నుంచి విడిపోతున్నట్లు శరద్‌యాదవ్‌కు ముందుగానే సమాచారం ఇచ్చానని నితీష్‌కుమార్ తెలిపారు. అలాగే ఎన్‌డిఎలో చేరాలా.. వద్దా అనే విషయంపై ఈ నెల 19న పాట్నాలో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని నితీష్ వెల్లడించారు. సోమవారం పార్లమెంట్ వద్ద శరద్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ 'జరిగింది చాలా దురదృష్టకరం. ప్రజల ఆదేశం దీనికి లేదు' అని అన్నారు. బిజెపి మద్దతుతో నితీష్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంపైనే శరద్ ఈ వ్యాఖ్యలు చేశారు. మిగిలిన ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా నితీష్ చర్యపై అసంతృప్తిగా వున్నారు. బిజెపిపై పోరాటానికి కలిసిరావాలని శరద్ యాదవ్‌ను కోరుతున్నారు.

సునంద హత్య కేసు ఆలస్యంపై ఢిల్లీ కోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ భార్య సునంద పుష్కర్ హత్య కేసు విచారణలో ఆలస్యం జరుగుతుం డటంపై ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. 2015 ఫిబ్రవరిలోనే సాక్ష్యాల సేకరణ పూర్తయినా తుది నివేదిక ఇంకా ఎందుకు అందచేయలేదని ఢిల్లీ పోలీసులను సూటిగా ప్రశ్నించింది. ఈ కేసులో సిబిఐ విచారణ కోరుతూ బిజెపి ఎంపి సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు జిఎస్ సిస్తాని, చంద్ర శేఖర్ విచారించారు. సునంద కుమారుడు శివ మీనన్ కూడా కేసు విచారణను వేగవంతం చేయాలని మరొక పిటిషన్ దాఖలు చేశారు.

కీలక డేటా పరిరక్షణకు శ్రీకృష్ణ నేతృత్వంలో కమిటీ

న్యూఢిల్లీ : భారత్‌లో కీలక డేటా రక్షణకు సంబంధించిన అంశాలను గుర్తించేందుకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి బి.ఎన్.శ్రీకృష్ణ నేతృత్వంలో నిపుణుల కమిటీని మోడీ సర్కార్ నియమించింది. ఏమైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించే పద్ధతులను ఈ కమిటీ సిఫార్సు చేస్తుంది. ఈకమిటీలో పది మంది సభ్యులుంటారు. టెలికమ్యూనికేషన్స్, ఐటి, యుఐడిఎఐ, విద్యా విభాగాలకు చెందిన ప్రతినిధులు ఈ కమిటీలో వుంటారు. భారత్‌లో డేటా రక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై అధ్యయనం చేయడమే కాకుండా డేటా రక్షణ బిల్లు ముసాయిదాను కూడా రూపొందిస్తారు. ఆ తర్వాత బిల్లును కేంద్రం పరిశీలిస్తుంది. కమిటీ ఏర్పాటుకు సంబంధించిన సర్క్యులర్‌ను జారీ చేసిన ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, కమిటీ సభ్యులకు కావాల్సిన సమాచారాన్ని అందిస్తుంది. భారత్‌లో రిలయన్స్, మెక్‌డొనాల్డ్స్ వంటి కార్పొరేట్ సంస్థలు గోప్యత, డేటా ఉల్లంఘనలకు పాల్పడుతుండడంతో డేటా పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఐటి మంత్రిత్వశాఖ గత ఆరు మాసాలుగా డేటా రక్షణపై కసరత్తు ప్రారంభించింది.



కుడంకుళం అణువిద్యుత్ ప్లాంట్

భారత్-రష్యా మధ్య 3 ఒప్పందాలు

న్యూఢిల్లీ : తమిళనాడులోని కుడంకుళం అణు విద్యుత్ కర్మాగారంకోసం భారత్, రష్యాల మధ్య మూడు ఒప్పందాలు కుదిరాయి. ఈ ప్లాంట్‌లోని 5, 6 యూనిట్లు నిర్మాణ పనులు, కీలక పరికరాల సరఫరా వంటి అంశాల ఈ ఒప్పందంలో వున్నాయి. ప్రధాని మోడీ రష్యా పర్యటనలో ఈ ఒప్పందాలకు అంగీకారం లభించగా, రెండు నెలల తరువాత ఈ ఒప్పందాలు కుదిరాయి. భారత ప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్), రష్యాకు చెందిన జెఎస్‌సి అటమ్‌స్ట్రాయ్‌ఎక్స్‌పోర్ట్ ఈ మూడు ప్రధాన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ' ఈ నిర్మాణ ఒప్పందంతో 5,6 యూనిట్లు ఉత్పత్తి దశకు చేరుకుంటాయి. ప్రాజెక్టులో 3వ దశను పూర్తి చేయడానికి రష్యా పరికరాలను, నమూనాలను అందచేస్తుంది' అని జెఎస్‌సి దక్షిణాసియా ఉపాధ్యక్షులు అంద్రీ లెబ్‌దేవ్ తెలిపారు. రష్యా సహకారంతోనే 1988లో ఈ కుందంకులమ్ అణు ప్లాంట్ నిర్మాణం ప్రారంభమయింది. మొత్తం 6 యూనిట్లతో 6 వేల మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు.

దిగ్విజయ్‌పై వేటు

- తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జీగా ఆర్‌సి కుంతియా
- పలు నియామాకాలకు సోనియా ఆమోదముద్ర


ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దిగ్విజయ్ సింగ్‌పై ఆ పార్టీ అధిష్టానం వేటు వేసింది. ఆయన స్థానంలో ఆర్‌సి కుంతి యాను నియమించారు. తెలంగాణలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు ఏఐసిసి కొత్త బృం దాన్ని పార్టీ అధినేత్రి సోనియా గాంధీ నియమిం చారని పార్టీ ప్రధానకార్యదర్శి జనార్ధన్ ద్వివేది మంగళవారం తెలిపారు. అలాగే ఏఐసిసి కార్య దర్శిగా సతీష్ జర్కీహోలీని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

గోవా అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమవ్వడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో గోవా, కర్నాటక రాష్ట్రాల వ్యవహారాల ఇంఛార్జీగా దిగ్విజయ్‌ని తప్పించారు. తెలంగాణ టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షునిగా తీసుకొచ్చేం దుకు ప్రయత్నిస్తున్నారనే దిగ్విజయ్‌పై వేటు వేసినట్లు సమా చారం. అయితే దిగ్విజయ్ సింగ్ తన సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో వచ్చే సెప్టెం బర్ నుంచి 'ఆధ్యాత్మిక పాద యాత్ర' నిర్వహించా లని నిర్ణయించారనీ, అంతేకాకుండా తెలంగా ణలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ఫలి తాలు సాధించేలా పార్టీకి దిశానిర్దేశం చేయాలంటే కొత్త నాయకత్వం ఉండాలనే ఉద్దేశంతోనే దిగ్విజయ్‌ని తొలగించినట్లు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి.

ప్రొఫెషనల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా థరూర్

అఖిల భారత అసంఘటిత కార్మిక కాంగ్రెస్, అఖిల భారత వృత్తి నిపుణుల (ప్రొఫెషనల్) కాంగ్రెస్ పేరుతో కాంగ్రెస్ పార్టీ కొత్తగా ఏర్పాటు చేసిన రెండు విభాగాలకు



ఆఫీసు బేరర్లను సోనియా గాంధీ నియమించారు. అఖిల భారత వృత్తి నిపుణుల (ప్రొఫైషనల్) కాంగ్రెస్ అధ్యక్షులుగా పార్లమెంటు సభ్యులు డాక్టర్ శశి థరూర్‌ను నియ మించారు. వైస్ ఛైర్మన్‌గానూ, పశ్చిమ ప్రాంత ప్రాంతీయ కన్వీనర్‌గానూ మిలింద్ దేవరాను, అలాగే సమన్వయ కర్తలుగా డాక్టర్ జె గీతారెడ్డి (దక్షిణ ప్రాంతం), గౌరవ్ గగోయ్ (తూర్పు), సల్మాన్ సోజ్ (ఉత్తర ప్రాంత)ను నియ మిస్తూ ఆమె ఆమోదం తెలిపారు. అలాగే అసంఘటిత రంగ కార్మిక కాంగ్రెస్ అధ్యక్షులుగా అరవింద్ సింగ్‌ను, వైస్ ఛైర్మన్‌గా ఇర్ఫాన్ అలామ్‌ను నియమించారు.

హెచ్-1బి వీసాదారుల్లో అత్యధికులు భారతీయులే

వాషింగ్టన్ : గత 11ఏళ్ళ కాలంలో 21లక్షల మందికిపైగా భారతీయ ఐటి నిపుణులు హెచ్-1బి వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నారని అధికార నివేదిక తెలిపింది. వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వారు పెద్దగా అర్హత కలిగిన వారు కాదన్న అభిప్రాయాన్ని అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సేవల (యుఎస్‌సిఐ ఎస్) విభాగం అందచేసిన నివేదిక తోసిపుచ్చింది. గత 11ఏళ్ళలో వీరి సగటు వేతనం 92,317 డాలర్లని, వీరిలో ఎక్కువమంది మాస్టర్లు లేదా బిటెక్ పట్టాలు కలిగినవారేనని తెలిపింది. 2007 నుండి ఈ ఏడాది జూన్ వరకు మొత్తంగా 34 లక్షల హెచ్-1బి వీసా దరఖాస్తులు వచ్చాయని వాటిలో 21లక్షల మంది భారతీయులేనని ఆ నివేదిక తెలిపింది. ఇదే సమ యంలో అమెరికా 26లక్షలమందికి వీసాలు జారీ చేసింది. ఆ తర్వాత స్థానంలో చైనా (2,96,313), ఫిలి ప్పీన్స్ (85,918), దక్షిణ కొరియా(77,359), కెనడా(68,228) వున్నాయి. మెజారిటీ లబ్దిదారులు (23లక్షల మంది) 25 నుండి 34ఏళ్ళ వయస్సులోపు వారేనని నివేదిక తెలిపింది. వీరిలో దాదాపు 20లక్షల మంది కంప్యూటర్‌కి సంబంధించిన వృత్తి నిపుణులేనని పేర్కొంది. ఈ 11ఏళ్ళ కాలంలో 2వేల మందికి పైగా విదేశీ జాతీయులు 65ఏళ్ళు అంతకుమించిన వయస్సు లో హెచ్-1బి వీసాలు తీసుకోగా ఈఏడాది ఇప్పటివ రకు కేవలం 122మంది మాత్రమే తీసుకున్నారు.



పాక్ ప్రధానిగా షాహిద్ ఖాకన్ అబ్బాసీ నియామకం

ఇస్లామాబాద్ : అవినీతి ఆరోపణలతో అనర్హత వేటుకు గురైన పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ స్థానంలో ఆయన మంత్రివర్గ సహచరుడు షాహిద్ ఖాకన్ అబ్బాసీ తాత్కాలిక ప్రధానిగా నియమితులయ్యారు. వారసుడిగా తన సోదరుడు షాబాజ్ షరీఫ్‌ను నవాజ్ షరీఫ్ ఎంపిక చేసిన నేపథ్యంలో ఆయన అర్హుడయ్యే వరకూ అబ్బాసీ ఈ పదవిలో కొనసాగుతారని పిఎంఎల్-ఎన్ వర్గాలు వివరించాయి. ప్రస్తుతం పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా వున్న షాబాజ్ షరీఫ్ పంజాబ్ అసెంబ్లీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన పార్లమెంటుకు ఎన్నికయితే తప్ప ఆయనకు ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు అర్హత లభించదు.

ఇరాక్ దురాక్రమణపై టోనీబ్లెయిర్‌పై ప్రాసిక్యూషన్‌కు లండన్ హైకోర్టు నో!

లండన్: 2003లో ఇరాక్‌పై జరిగిన దురాక్రమణ వ్యవహారంలో అప్పటి బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్‌ను ప్రాసిక్యూట్ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను లండన్ హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. ఇరాక్‌కు చెందిన మాజీ సైనికాధికారి ఒకరు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. నాటి ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్‌ను గద్దె దింపేందుకు అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ కూటమితో జతకలవాలన్న బ్లెయిర్ నిర్ణయం ఆయనకు మాయని మచ్చగా మిగిలిపోయింది. ఈ నిర్ణయాన్ని యుద్ధ నేరంగా అభివర్ణిస్తూ ఆయన వ్యతిరేకులు విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ యుద్ధ నేరంపై బ్లెయిర్, ఈ నిర్ణయంలో భాగస్వాములైన ఆయన ఇద్దరు సహచర మంత్రులను ప్రాసిక్యూట్ చేయాలంటూ ఇరాక్ మాజీ జనరల్ వహీద్ షన్సన్ అల్ రబ్బాట్ ఒక ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఇంగ్లండ్, వేల్స్ చట్ట నిబంధనల పరిధిలో అటువంటి నేరంపై తాము విచారణ కొనసాగించలేమంటూ దిగువ కోర్టు వెలువరించిన తీర్పును పున:పరిశీలించేందుకు లండన్ హైకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ పిటిషన్ సుప్రీం కోర్టు పరిశీలనకు నిలవలేదని, అందువల్ల దీనిపై న్యాయసమీక్షకు తాము అనుమతించలేమని లండన్ హైకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

బాధ్యత అమెరికా, ఉ.కొరియాలదే..!

ఉద్రిక్తతల తగ్గింపుపై చైనా వ్యాఖ్య



ఐక్యరాజ్యసమితి: ఆగ్నేయాసియా, పసిఫిక్ ప్రాంతంలో రాజుకుంటున్న ఉద్రిక్తతలను తగ్గించే బాధ్యత అమెరికా, ఉ.కొరియాలదేనని, ఇందులో తాము చేసేదేమీ లేదని చైనా స్పష్టం చేసింది. ఐరాసలో చైనా రాయబారి లియు జియు సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలకు అమెరికా, ఉ.కొరియాలే బాధ్యత వహించాల్సి వుంటుందని, ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు సరైన దశలో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా వారిదే తప్ప చైనాది కాదని అన్నారు. ఉ.కొరియా విషయంలో చైనా స్పందిస్తున్న తీరు తమకు 'తీవ్ర అసంతృప్తి' కలిగించిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన చైనా రాయబారి ఈ ప్రకటన చేశారు. ఇక్కడ చైనా ఎంత సమర్థవంతమైనదన్న అంశం ప్రధానం కాదని, చైనా ప్రయత్నాలతో ఆశించిన ఫలితాలు రాకపోవటానికి ప్రధాన కారణం ఆ రెండు దేశాలేనని ఆయన వివరించారు. అంతకు ముందు ఐరాసలో అమెరికా ప్రతినిధి నిక్కీ హేలీ మీడియాతో మాట్లాడుతూ ఉ.కొరియా గురించి తమ వైఖరి వెల్లడించామని, ఆ దేశంపై ఐరాస విధించే ఆంక్షలను బలపర్చటమో లేదో తేల్చుకోవాల్సింది చైనా యేనని అన్నారు. తాము ఉ.కొరియాతో నిరంతరం సంప్రదిస్తూనే వున్నామని, మండలి చేసే ప్రయత్నాలపై తాము కమ్యూనికేషన్లను ఎప్పుడూ నిలిపివేయలేదని లియు వివరించారు. ఇప్పుడు తాజా ఆంక్షలకు సంబంధించిన తీర్మానం భద్రతా మండలి చర్చలో వుందన్నారు. కొరియన్ ద్వీపకల్పంలో అణు నిరాయుధీకరణ, శాంతి, భద్రతల పునస్థాపన, చర్చల పున:ప్రారంభం వంటి అంశాలకు పరిష్కారాన్ని సాధించేందుకు భద్రతా మండలి స్పందనే కీలకమని చైనా భావిస్తున్నట్లు లియు చెప్పారు.

నిర్వీర్యమైన వెనిజులా ప్రతిపక్షం

న్యూయార్క్ టైమ్స్ కథనం



కారకాస్/వాషింగ్టన్: ఏడాదిన్నర క్రితం వరకూ పార్లమెంట్‌లో మెజార్టీ చూసుకుని రెచ్చిపోయిన వెనిజులా ప్రతిపక్షం ఆదివారంనాటి ఎన్నికల ఫలితాలతో ఒక్కసారిగా చతికిల పడినట్లయింది. జాతీయ అసెంబ్లీ వెనిజులా సోషలిస్టు పార్టీ చేతుల్లో నుండి తమ ఆధీనంలో వచ్చిన వెంటనే అనేక కొత్త చట్టాల రూపకల్పనకు సిద్ధం చేసింది. రాజకీయ ఖైదీల విడుదల, ఆర్థిక సంక్షోభం వంటి సమస్యల నుండి వెనిజులాను బయటపడేసేందుకు అవసరమైన చర్యలపై దృష్టి పెట్టింది. అంతేకాదు వచ్చే ఏడాది జరుగనున్న అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించేందుకు సైతం పావులు కదపటం ప్రారంభించింది. ఆదివారం నాటి ఎన్నికల ఫలితాలతో ఇవన్నీ పగటి కలలుగా మారిపోయాయి.

ట్రంప్ సర్కారు ఆంక్షలు

అమెరికా అక్కసు వెళ్లగక్కుతోందన్న మదురో

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోపై కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికాలోని ట్రంప్ సర్కారు ప్రకటించింది. ఆదివారం నాటి ఓటింగ్‌లో ప్రజాస్వామ్యానికి విజయం లభించటంపై అమెరికా అక్కసు వెళ్లగక్కుతోందని మదురో ఎద్దేవా చేశారు. పార్లమెంటుకు జరిగిన ఓటింగ్‌లో వెల్లడయిన ఫలితాలు మదురో ప్రభుత్వానికి అనుకూలంగా వుండటంతో దీనిపై స్పందించిన అమెరికా మదురో సర్కారుపై ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించటం విశేషం. అయితే చమురు కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన వ్యవహారాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకు రాలేదు. తాజా ఆంక్షల ప్రకారం అమెరికా పరిధిలో వున్న మదురో ఆస్తులన్నింటినీ స్తంభింప చేస్తారు. మదురో ప్రభుత్వంతో అమెరికన్లు వ్యాపార లావాదేవీలు కొనసాగించటంపై నిషేధం విధించినట్లు అమెరికా ఆర్థిక శాఖలోని విదేశీ ఆస్తుల నియంత్రణా విభాగం వెల్లడించింది. తద్వారా మదురో ప్రభుత్వం తీసుకున్న విధానాలపై తమ వైఖరిని అమెరికా స్పష్టం చేసిందని, వెనిజులా ప్రజలకు తమ మద్దతును కొనసాగిస్తామని ఆర్థిక మంత్రి స్టీవెన్ మ్యూచిన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. వెనిజులా కొత్త పార్లమెంట్ కార్యకలాపాలలో ఎవరైనా భాగస్వాములైతే వారు భవిష్యత్‌లో విధించే అమెరికా ఆంక్షల పరిధిలోకి వస్తారని ఆయన హెచ్చరించారు.

వైట్‌హౌస్ నుండి మరొకరు ఔట్



వాషింగ్టన్: వైట్‌హౌస్‌లో ఎటువంటి లుకలుకలు లేవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే మరో అధికారి తన పదవి నుండి తప్పుకుంటున్నట్లు అధ్యక్షభవనం ప్రకటించింది. వైట్‌హౌస్‌లో కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా వున్న ఆంథోనీ స్కారాముక్కి తన పదవి నుండి వైదొలగుతున్నారని అధ్యక్ష భవనం ఒక ప్రకటనలో వివరించింది. బాధ్యతలు చేపట్టిన వారం రోజుల వ్యవధిలోనే స్కారాముక్కి వైట్ హౌస్‌లో తన పదవిని కోల్పోవటం గమనార్హం. వైట్‌హౌస్ నుండి మీడియాకు లీకేజీలు వెల్లడవుతున్న వ్యవహారంపై ఉక్కు పాదం మోపేందుకు ట్రంప్ సర్కారు కృతనిశ్చయంతో వున్న నేపథ్యంలో ఇంతకు ముందు వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ప్రీబస్, ట్రంప్ సహాధారు స్టీవ్ బానన్ పదవుల నుండి తప్పుకున్న విషయం తెలిసిందే. ఇటువంటి వ్యవహారంలోనే ట్రంప్ స్కారాముక్కికి కూడా ఉద్వాసన పలికారని వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. ఆంథోనీ వంటి వ్యక్తిలో వున్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదని అధ్యక్షుడు విశ్వసించినందు వల్ల ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని వైట్ హౌస్ ప్రతినిధి సరా శాండర్స్ మీడియాకు వివరించారు. ట్రంప్ గత జనవరి 20న అధికార బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన నియమించిన అధికారులు పదవుల నుండి తప్పుకోవటం లేదా వారిని తప్పించటం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాక ట్రంప్ నియమించిన కొంతమంది అధికారులు ఇప్పటి వరకూ ఆ పదవీ బాధ్యతలను చేపట్టకపోవటం గమనార్హం.

చైనా శాంతినే కోరుకుంటుంది

పిఎల్ఎ 90వ వార్షికోత్సవంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టీకరణ



బీజింగ్ : చైనా ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుందని, కానీ తమ దేశ భద్రత, సార్వభౌమాధికారం విషయంలో మాత్రం రాజీపడే ప్రసక్తే లేదని అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ మంగళవారం స్పష్టం చేశారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) 90వ వార్షికోత్సవాల సందర్భంగా 'గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్'లో జరిగిన కార్య క్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రత్యేకించి ఏ ఒక్క ప్రాదేశిక వివాదాన్ని ప్రస్తావించకుండా జిన్‌పింగ్ మాట్లాడారు. తాము ఎవరినీ బెదిరించ మనీ, ఎవరైనా బెదిరిస్తే తాము సహించబోమని స్పష్టం చేశారు. "చైనీయులు శాంతికాముకులు. దురాక్రమణలకు లేదా విస్తరణలకు ఎన్నడూ పాల్పడబోరు. తమకు ఎదురయ్యే అన్ని సమస్యలపై పోరాడి గెలుస్తా మనే విశ్వాసం వుంది." అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఏ సమయం లోనైనా, ఏ రూపంలోనైనా చైనా భూభాగాన్ని వీల్చేందుకు వ్యక్తులు, సంస్థలు, రాజకీయ పార్టీలు చేసే ఏ ప్రయత్నాన్ని అనుమతించబో మని అన్నారు. మా సార్వభౌమ త్వానికి, భద్రతకు, అభివృద్ధి ప్రయోజనాలకు హాని కలిగించే చేదు గుళికలను భరిస్తామని ఎవరూ భావించరాదని అన్నారు. ఎంతటి కఠోర శ్రమ అనంతరం పిఎల్ఎ విజయవంతంగా తన సంస్థాగత నిర్మాణాన్ని మార్చుకుందని, ప్రజల్లో వున్న పేరు ప్రతిష్టలను కాపాడుకుందని జిన్ పింగ్ చెప్పారు. పటిష్టమైన సైన్యాన్ని నిర్మిం చాలంటే సాయుధ బలగాలపై పార్టీ సంపూర్ణ నాయకత్వానికి కట్టుబడి వుండాలని, పిఎల్ఎ ఎప్పుడూ అదే ఆచరిస్తూ వచ్చిందని చెప్పారు. "పార్టీ తుపాకులను ఆదేశించాలి తప్ప తుపా కులు పార్టీని ఆదేశించరాదని వ్యాఖ్యానించారు.

అరబ్ దేశాల వాణిజ్య బహిష్కరణపై డబ్ల్యుటిఓలో కతార్ ఫిర్యాదు

జెనీవా : అరబ్ దేశాలైన సౌదీ అరేబియా, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు వాణిజ్యపరంగా తనను బహిష్కరించడంపై కతార్ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో సోమవారం ఫిర్యాదు చేసిందని కతార్ డబ్ల్యుటిఓ కార్యాలయ డైరెక్టర్ అలీ అల్వలీద్ మీడియాకు తెలిపారు. ఆ మూడు దేశాలతో చర్చలు జరిపేందుకు కతార్ లాంఛనప్రాయంగా అభ్యర్థించింది. ఈ వాణిజ్య వివాదాన్ని పరిష్కరించుకునేందుకు తీసుకున్న మొదటి చర్యలో భాగంగా ఆ మూడు దేశాలకు 60 రోజుల గడువును విధించింది. ఈలోగా తమ ఫిర్యాదును పరిష్కరించాలని, లేని పక్షంలో డబ్ల్యుటిఓలో వ్యాజ్యాన్ని, ప్రతీకార వాణిజ్య ఆంక్షలను ఎదుర్కోవాల్సి వుంటుందని హెచ్చరించింది. ఇచ్చిన హామీలకు అనుగుణంగా వారి చర్యలు వున్నాయా లేదా అనే విషయమై చట్టపరమైన వివరణలు ఇవ్వడానికి తాము తగినంత సమయం ఇచ్చామని అల్వలీద్ తెలిపారు. చర్చలు జరపడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చని తాము నమ్ముతామని చెప్పారు. ఆ దేశాలు తీసుకున్న చర్యలపై మరింత సమాచారం తాము తెలుసుకోవాలనుకుంటున్నామని అన్నారు. తర్వాతా ఈ వివాదానికి పరిష్కారాన్ని కనుగొనాలన్నారు. కతార్‌ను బహిష్కరించడం వెనుక జాతీయ భద్రతే ప్రధాన కారణమని అరబ్‌దేశాలు డబ్ల్యుటిఓకు ఇంతకుముందే స్పష్టం చేశాయి.

రష్యా చర్యలను సమీక్షిస్తున్నాం

వైట్‌హౌస్ వెల్లడి

వాషింగ్టన్ : సెప్టెంబరు 1లోగా దౌత్య సిబ్బందిని కుదించాలంటూ రష్యా ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తలెత్తిన పరిస్థితిని అమెరికా సమీక్షిస్తోంది. కాగా రష్యాపై కొత్త ఆంక్షలు విధిస్తూ అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ ఇంకా సంతకాలు చేయాల్సి వుంటుంది. పుతిన్ ఆదేశాలపై సోమవారం విలేకర్లు వైట్‌హౌస్ ప్రతినిధి సారా హకబీ శాండర్స్‌ను ప్రశ్నించగా పెద్దగా స్పందించలేదు. 'ప్రస్తుతానికి మాకు గల అవకాశాలను సమీక్షిస్తున్నాం. దీనిపై ఏమైనా చెప్పాలనుకుంటే వెంటనే మీకు తెలియచేస్తాం' అని శాండర్స్ చెప్పారు. బిల్లుపై ట్రంప్ సంతకాలు చేస్తారని ఆమె పునరుద్ఘాటించారు. అయితే ఎప్పుడనేది మాత్రం వెల్లడించలేదు. కాగా విదేశాంగ శాఖ అధికారి మాత్రం ఈ పరిణామం 'విచారకరం' అంటూ వ్యాఖ్యానించారు. రష్యా చర్యను నిరసిస్తూ ట్రంప్ తన ట్రేడ్‌మార్క్ ట్వీట్లు చేయలేదు. రష్యాపై కొత్త ఆంక్షలను విధిస్తూ గురువారం అమెరికా సెనేట్ అత్యధిక మెజారిటీతో బిల్లును ఆమోదించింది. దీంతో మండిపడిన రష్యా 755మంది అమెరికా దౌత్య సిబ్బందిని తగ్గించాలంటూ ఆదేశించింది.

బెల్టు షాపులుంటే 1100కి ఫిర్యాదు చేయండి: కుటుంబరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడైనా బెల్టు దుకాణాల్ని నిర్వహిస్తుంటే కాల్ సెంటర్ 1100కి ఫిర్యాదు చేయాలని ప్రజాణిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు సూచించారు. విజయవాడలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం చంద్రబాబు బెల్టు షాపులను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల అస్తవ్యస్త విధానాలతోనే గ్రామీణ స్థాయిలో బెల్టు షాపులు ఏర్పాటయ్యాయన్నారు. కాల్ సెంటర్ సర్వే ద్వారా బెల్టు షాపుల తొలగింపు, అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తమయ్యిందని ఆయన పేర్కొన్నారు. 1100కి వచ్చిన ఫిర్యాదుపై తగిన చర్యతో పాటు పరిష్కారమైన విధానం కూడా సంబంధిత వ్యక్తికి తెలియ చేయడం జరుగుతుందన్నారు. ఇళ్ల మంజూరు, పెన్షన్లు, చంద్రన్న ఫీమా, రేషన్ సరుకుల సరఫరాపైనా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు.

పింగళి వెంకయ్యకు సిఎం నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేడు జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు నివాళులర్పించారు. త్రివర్ణ పతాకాన్ని చూస్తే ఆయనే స్ఫురణకు వస్తారని, దేశభక్తునికి మాటకు పింగళి నిజమైన నిర్వచనమని మంగళవారం ఒక ప్రకటనలో సిఎం కొనియాడారు. ఆయన దేశానికి ముద్దుబిడ్డ అని, తుదిశ్వాస వరకు విలువలకు నిబద్ధుడై, నిజాయతీగా జీవించారన్నారు.

మొదటి పేజీ తరువాయి

మంత్రుల నంద్యాల బాట

వ్యూహాన్ని నంద్యాలలో కూడా అమలు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో టిడిపి వ్యతిరేక గ్రామాలన్నిటిలోనూ పార్టీతో సంబంధం లేదనే పేరుతో వ్యాపారవేత్తల్ని దింపి వారితో సేవా కార్యక్రమాల్ని చేయించారు. తొలుత పార్టీతో సంబంధం లేదని చెప్పించారు. పరిపాలన బాగుంటుందని ప్రచారం చేయించి చివరకు టిడిపికి ఓట్లు వేయించారు. ప్రస్తుతం నంద్యాలలోనూ అదే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకూ పెర్మార్మెన్స్

సంచాలకులు ప్రతిపాదిస్తూ లేఖ రాశారని, అందుకు అనుమతిస్తున్నామని జీవోలో పేర్కొన్నారు. ఉద్యోగులను ఎ,బి,సి గ్రేడులుగా విభజిస్తారు. పెర్మార్మెన్స్ మార్కులు 80 శాతం పైన వస్తే ఆ ఉద్యోగులకు 'ఎ' గ్రేడ్ ఇచ్చి రూ.3 వేలు ప్రోత్సాహకం చెల్లిస్తారు. పెర్మార్మెన్స్ మార్కులు 60-80 శాతం వస్తే 'బి' గ్రేడు ఇచ్చి ప్రోత్సాహకం రూ.వెయ్యి చెల్లిస్తారు. పెర్మార్మెన్స్ మార్కులు 60 శాతం లోపు వస్తే 'సి' గ్రేడు ఇచ్చి ఎలాంటి ప్రోత్సాహకం ఇవ్వరు. తమను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలైనా చెల్లించాలని కాంట్రాక్టు ఉద్యోగులు మొరపెట్టుకుంటుండగా జీతం పెంచకుండా పెర్మార్మెన్స్ ప్రాతిపదికన ఇన్సెంటివ్ ఇస్తామని పశుసంవర్ధక శాఖ నిర్ణయించడం గందరగోళానికి దారి తీసింది. పైగా తామిచ్చిన జీవోకు ఆర్థిక శాఖ అనుమతి ఉందని జెడిఎస్ ప్రసాద్ ప్రస్తావించడం గమనార్హం. పెర్మార్మెన్స్ ఆధారిత ప్రోత్సాహక సర్కారుకు నచ్చిన వారికి వస్తుందని, నచ్చని వారికి రాదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తక్కువ మార్కులొచ్చాయని సాకుతో కాంట్రాక్టు పొడిగించకపోవడం బలవంతంగా ఇంటికి గెంటేసే కుట్ర ఈ జీవో వెనుక దాగుందని విమర్శిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకొచ్చాక మూడేళ్లలో ఆ పని చేయకపోగా, కాంట్రాక్టు ఉద్యోగులకు పెర్మార్మెన్స్ ఆధారిత జీతాలంటున్నారని తప్పుబడుతున్నారు.

ఇన్సెంటివ్ ఇలా

గ్రేడు	మార్కుల శాతం	ఇన్సెంటివ్
ఎ	80 పైన	రూ.3 వేలు
బి	60-80	రూ. వెయ్యి
సి	60 లోపు	సున్నా

పార్లమెంట్‌లో గ్యాస్ మంటలు

(మొదటిపేజీ తరువాయి)

వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. పేదలకు రాయితీ కొనసాగించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అయినా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించగా రాజ్యసభ మరోసారి వాయిదా పడింది. "వంట గ్యాస్ (ఎల్‌పిజి) సిలిండర్లపై రాయితీని ఎత్తివేయాలని కేంద్రం నిర్ణయించింది. ఒకేసారి కాకుండా ప్రతి నెలా ధర పెంచుతూ.. కన్నాళ్లలో రాయితీకి స్వస్తి పలకనుంది. వచ్చే మార్చి నాటికి రాయితీని తొలగించేలా సిలిండర్ ధరను ప్రతి నెలా రూ.4 పెంచాలని కేంద్రం చమురు సంస్థలను ఆదేశించింది. రాయితీ వంట గ్యాస్ సిలిండర్(14.2 కిలోలు) ధరను ప్రతి నెలా రూ.2 పెంచాలని (వ్యాట్ మినహాయించి) గతంలోనే ప్రభుత్వం చమురు సంస్థలను ఆదేశించింది. రాయితీని తొలగించడానికి ఇప్పుడు మొత్తాన్ని రెట్టింపు (రూ.4) చేశామని మంత్రి వివరించారు. రాయితీ పూర్తిగా తొలగే వరకు లేదా మార్చి 2018 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ పెంపు ప్రక్రియ కొనసాగుతుంది.' అని ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం లోక్‌సభలో ప్రకటించడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి.

మరోవైపు లోక్‌సభలో కూడా ఇదే అంశంపై ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి. వంట గ్యాస్ ధర పెంపును వెనక్కి తీసుకోవాలని, ఇది ప్రజా సంక్షేమానికి విఘాతం కలిగిస్తోందని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ సభ్యుడు కె.సి వేణుగోపాల్ మాట్లాడుతూ వంట గ్యాస్ పెంపు అన్యాయమని, ప్రజలపై భారాలు సరికాదని అన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిఎంసి పక్షనేత సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ వంట గ్యాస్‌పై ఎప్పుడూ లేని విధంగా గత ఆరేళ్లలో అధిక శాతం పెంచారని, జిఎస్‌టితో కలిపి ఆ పెంపు మరింత పెరిగిందని అన్నారు. సిపిఎం ఎంపి శ్రీమతి టీచర్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి మహిళా దీన్ని వ్యతిరేకిస్తోందని, మహిళల కన్నీళ్లు ప్రభుత్వం చూడాలనుకోవటం లేదని విమర్శించారు. సబ్సిడీ ఎత్తి వేతను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళాభ్యున్నతి అని ప్రగల్భాలు పలికే మోడీ సర్కార్, మహిళల నెత్తిపైన గుదిబండ వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్.కె ప్రేమ్ చంద్రన్ మాట్లాడుతూ ప్రజలకు, పార్లమెంట్‌కు తెలపకుండా ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. దొడ్డిదారి నిర్ణయాల వల్ల ప్రజలపై భారం పడుతోందని విమర్శించారు. దేశ చరిత్రలోనే ఇది అధిక పెంపు అని పేర్కొన్నారు. సబ్సిడీని ఎలా ఎత్తివేస్తారని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం సమాధానమివ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. సిపిఎం సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయినా స్పందించని ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలిస్తూ కాంగ్రెస్, సిపిఎం, టిఎంసి, ఆర్జేడీ, నేషనల్ కాన్ఫరెన్స్, ఎన్సీపీ తదితర పార్టీల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

ప్రజలపై అధిక భారం: ఏచూరి

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రజలపై అధిక భారం పడుతోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం రాజ్య సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ప్రజలపై మరిన్ని భారాలు మోపే దిశగా వంట గ్యాస్ ధరను ప్రతినెలా పెంచాలని కేంద్రం నిర్ణయం తీసుకొంది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో ముందుగా సభ దృష్టికి తేకుండా, ప్రజానీకం నెత్తి పిడుగు లాంటి విధంగా ఇటువంటి నిర్ణయం తీసుకోవడం దారుణం. సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్నారు, ఇదేనా సంక్షేమ మంటే? ప్రధాని మోడీ ప్రతిసారి ఇచ్చే "సబ్ కా సాత్..సబ్ కా వికాస్" నినాదం ఏమైపోయింది, ప్రజా సంక్షేమం పట్ల ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధి ఇలాంటి నిర్ణయాల ద్వారా తేటతెల్లమౌతోంది. వంట గ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం దీన్ని గమనంలో పెట్టుకోకుండా ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తోంది. ఇది అనుమతించతగింది కాదు. జమిలిగా ప్రజావ్యతిరేక నిర్ణయాలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోంది. ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి" అని ఏచూరి డిమాండ్ చేశారు.

అభ్యుదయ శాస్త్రవేత్త పిఎం భార్గవ మృతి

(మొదటిపేజీ తరువాయి)

విజయకుమార్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ బి బంగారరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పార్వర్డ్ బ్లాక్ పివి సుందరరామరాజు, ఎస్‌యుసిఐ (సి) గోవిందరాజు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. సైన్స్ ఉద్యమాలకు ఆయన ఆరాధ్యుడని వారు పేర్కొన్నారు. ఆయన మృతి తీరని లోటని తెలిపారు.

1928 ఫిబ్రవరి 22న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జన్మించిన ఆయన 21 ఏళ్లకే సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డీ పట్టా పొందారు. భార్గవ అందించిన సేవలకు గాను 1986లో భారత ప్రభుత్వం ఆయన్ని పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. అయితే దేశంలో నెలకొన్న అసహన పరిస్థితుల నేపథ్యంలో ఈ పురస్కారాన్ని 2015లో తిరిగి వెనక్కి ఇచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భారత భవిష్యత్తు అంధకారంలో ఉన్నానని, దేశంలో ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే...భారత్ మరో పాకిస్తాన్‌గా తయారౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అవార్డుతో పాటు ఆయన ఆవేదనను కేంద్ర హోం శాఖకు పంపారు. నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన భార్గవ, ప్రభుత్వానికి విలువైన సూచనలు చేశారు. శాస్త్రవిజ్ఞానాన్ని సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విశాల దృక్పథంతో వ్యవహరించారు. సైంటిస్టుగానే కాకుండా జనం కోసం కూడా పనిచేసిన మహా మనిషి భార్గవ. ప్రజలకు ఉపయోగపడే అంశాలపైనే ఆయన ఎక్కువ ప్రయోగాలు చేసేవారు. మూఢనమ్మకాల నిర్మూలనకు ఆయన ఎంతో కృషి చేశారు. సైంటిస్టుల్లో ఉన్న మూఢనమ్మకాలపై కూడా ఆయన అధ్యయనం చేసి వాటిని పోగొట్టేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో జరిగిన సైన్స్ కాంగ్రెస్ జరుగుతున్న సందర్భంలో సైన్స్ కాంగ్రెస్‌లో సైన్స్ లేదంటూ భార్గవ సంచలన వ్యాఖ్యలు చేశారు. సూడో సైన్స్‌ను ప్రచారం చేస్తున్న శాస్త్రవేత్తల డిగ్రీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రెయిన్‌గన్‌లెక్కడ?



కర్నూలులో ఎండిపోయిన వేరుశనగ పైరు

- తీవ్రమైన వర్షాభావం
- 2.5 లక్షల ఎకరాల్లో ఎండిన పైర్లు

ప్రజాశక్తి కర్నూలు ప్రతినిధి

'వర్షాభావంతో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వం... వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తే రెయిన్‌గన్‌లతో కృత్రిమ తడులిచ్చి పంటలను కాపాడుతాం'... ఇది ఏడాది క్రితం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు చేసిన వాగ్దానం. కర్నూలు జిల్లా అవసరాలకోసం 4,500 రెయిన్‌గన్‌లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకోసం దాదాపుగా రూ.150 కోట్లు దాకా ఖర్చుచేశారు.

జూన్‌లో సాధారణ వర్షపాతం కన్నా అధికంగా వర్షాలు పడటంతో రైతాంగం దాదాపు 6.75లక్షల ఎకరాల్లో పంటను సాగు చేశారు. ఇప్పుడే రోజులుగా చినుకు అనదే లేకపోవడంతో దాదాపుగా 2.50 లక్షల ఎకరాల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం రెయిన్‌గన్‌ల ఊసేత్తకపోవడం చర్చనీయాంశమైంది. కేవలం కంపెనీల లాభాల కోసమే కొనుగోలు చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెయిన్ గన్లను ఒక్కో గ్రామపంచాయితీకి సగటున నాలుగు నుంచి ఐదు రెయిన్‌గన్‌లను అందుబాటులో ఉంచింది. వర్షాలు లేనప్పుడు అందుబాటులో ఉండే నీటివనరుల నుంచి తడులనిచ్చి పంటలను కాపాడుకోవాలని ప్రభుత్వం రైతులకు సూచించింది. జూన్‌లో అధిక వర్షాలు కురవడంతో పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న లాంటి పంటలను సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా వర్షాభావపరిస్థితులు నెలకొనడంతో సాగు చేసిన పంటల్ని వాడుముఖం పట్టాయి. వర్షాభావం నుంచి పంటలను కాపాడుతామంటూ గతేడాది ఆర్భాటంగా చేసిన ప్రకటనలు ఏమయ్యాయంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులకు పంటలు ఎండిపోతుండటంతో ఇకపైనా పెట్టుబడులన్ని మట్టిలోకే కలిసిపోతాయేమోనని రైతాంగం ఆందోళన చెందుతోంది. గతేడాది కొనుగోలు చేసిన రెయిన్‌గన్‌లను వినియోగించి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రూ.50వేలు పెట్టుబడి పెట్టాను


ఈ ఏడాది వర్షాలు బాగుంటాయనే ఆశతో రూ.50 వేలు పెట్టుబడి పెట్టి ఐదెకరాల్లో వేరుశనగ సాగుచేశాను. మొలకదశలోనే వర్షాలు లేక పంట ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా మట్టిలో కలిసిపోయింది.

- వెంకట్రాముడు తుగ్గలి

ఆదేశాలు రాగానే ఆదరణలోకి ...

రెయిన్‌గన్లకు సంబంధించిన ప్రభుత్వం నుంచి ఆదేశాలురాగానే ఆదరణలోకి పోతాం. వర్షాలు లేక జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పంటలన్నీ ఎండిపోతున్నాయి. పత్తి, వేరుశనగ, మొక్కజొన్న లాంటి పంటలు ఎండిపోయాయి. ప్రభుత్వానికి నివేదించాం.

- వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ



1.20 కోట్ల మందికి ఎంఆర్ టీకాలు

ప్రారంభించిన ముఖ్యమంత్రి బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని కోటి 20 లక్షల మందికి తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు మీజిల్స్ రుబెల్లా (ఎంఆర్) టీకా ఇచ్చే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఉండవల్లిలోని తన నివాసంలో స్కూలు పిల్లకు వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్నిమంగళవారం వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం, యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, లయన్స్ ఇంటర్నేషనల్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పెద్దఎత్తున నిర్వహిస్తోంది. మంగళవారం నుంచి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 9 నుంచి 15 సంవత్సరాల వయసు పిల్లలందరికీ ప్రభుత్వం ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే దేశంలో 5 రాష్ట్రాల్లో ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారని, ఇప్పుడు ఏపి సహా మరో 8 రాష్ట్రాల్లో ఈ టీకా ఇస్తున్నామని వెల్లడించారు. దేశంలో 40 కోట్ల మంది పిల్లలకు ఎంఆర్ టీకాలిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులంతా స్వచ్ఛందంగా పాల్గొని పిల్లలకు టీకాలు వేయించాలని సిఎం కోరారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ సుజాత శర్మ, సంచాలకులు అరుణ కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సైన్స్ ఫిక్షన్ చిత్రాలకు ఇక్కడి మార్కెట్ సరిపోదు

- సుకుమార్



"నేను ఎక్కువగా గ్యాప్ తీసుకోవడానికి కారణమొక్కటే.. నా దగ్గర కథ రెడీగా ఉండదు. ఒక సినిమా పూర్తయిన తర్వాతే మరో కథ రెడీ చెయ్యాలి. దాని వల్ల ఆలస్యమవుతుంది. కథ రెడీగా ఉంటే ఇప్పుడు ఎవరైనా హీరోకి చెప్పేసి సినిమా అనౌన్స్ చేసుకోవచ్చు. కథలన్నీ సింగిల్ లైన్‌లో ఉంటాయి. దాని మీద కూర్చొని రాయాలి' అని దర్శకుడు సుకుమార్ అన్నారు. అశోక్, ఈషా జంటగా నటించిన చిత్రం 'దర్శకుడు'. సుకుమార్ రైటింగ్స్, బి.టి.ఆర్.ఎన్. క్రియేషన్స్, ప్లేబ్యాక్ పిక్చర్స్ పతాకాలపై రూపొందింది. ఈ చిత్రానికి సుకుమార్ సమర్పకుడు. ఈనెల నాలుగో తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందు రానున్న నేపథ్యంలో మంగళవారం సుకుమార్ మీడియాతో మాట్లాడారు.

- ఈ సినిమా మొత్తంగా చూశాక చాలా బాగుందనిపించింది. ఇది నేను ఓ ప్రొడ్యూసర్‌గా చెప్పడం లేదు. ప్రేక్షకుడిగా చెప్తున్నాను. కొన్నిసార్లు సినిమా చూస్తున్నప్పుడే తెలిసిపోతుంది.
- ఇది నా తరహా కథ కాదు. అందుకే నాకు బాగా నచ్చిందేమో. అశోక్‌కి బాగా తెలిసిన డైరెక్టర్‌ని నేనే కాబట్టి నా బాడీ లాంగ్వేజ్ అలా వచ్చేసిందేమో. ఇందులో అతను చేసింది డైరెక్టర్ క్యారెక్టర్. చాలా కాలంగా నా పక్కనే ఉన్నాడు కాబట్టి నా బిహేవియర్ కాస్త వచ్చి ఉంటుంది.
- నేనంటే చిన్నప్పటి నుంచీ డైరెక్టర్ అవ్వాలన్న ప్యాషన్‌తో వచ్చినవాడిని. అశోక్ నన్ను చూసిన ఇన్‌స్పైర్ అయి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేస్తానని వచ్చాడు. నేను వద్దని చెప్పాను. చిన్నప్పటి నుంచి కథలు, కవితలు రాసేవాడు. డైరెక్షన్ జాబ్ అంత ఈజీ కాదని వద్దన్నాను. దానికి వాడికి కోపం వచ్చింది. 100 పర్సెంట్ లవ్ చిత్రంలో అతన్ని తీసుకునే ఛాన్స్ ఉంది. కానీ, నేను తీసుకోలేదు. '1 నేనొక్కడినే'కి మళ్ళీ వచ్చి అడిగాడు. ఈ సినిమాకి నేను ఒక కథ అనుకుంటున్నాను. దానికి నీ వెర్షన్ రాసివ్వమని చెప్పాను. చాలా బాగా రాశాడు. బాగా రాయగలుగుతున్నాడని డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లోకి తీసుకున్నాను.
- ఈ సినిమా కథ చాలా బాగుంది. ఎవరైనా మార్కెట్ ఉన్న హీరోతో చేస్తే బాగుంటుంది అని కాదు, కొత్తవాళ్ళయితే వర్కవుట్ అవుతుంది. అశోక్‌ని పెట్టి తీస్తానన్నాడు. అతనితో ఎలా చేయించుకోవాలో నాకు తెలుసు అన్నాడు. వర్క్‌షాప్స్ పెట్టి అతనితో చేయించాడు. బాగా పెర్‌ఫార్మ్ చేశాడు. అప్పుడు నమ్మకం కలిగి తీసుకున్నాం.
- అశోక్ సీరియస్ ఎమోషన్స్ బాగా చేశాడు. చాలా ఎక్స్‌పీరియన్స్ ఉన్న ఆర్టిస్టులా పెర్‌ఫార్మ్ చేశాడు. రియల్ ఎక్స్‌ప్రెషన్స్ అతని ఫేస్‌లో కనిపించాయి. కోపం అంటే నిజమైన కోపం, బాధ అంటే నిజమైన బాధ.. ఇలా అన్నీ రియల్‌గా అనిపించాయి.
- సినిమా చూస్తున్నప్పుడు మిమ్మల్ని మీరు చూసుకున్న ఫీలింగ్ కలిగిందా? అని అందరూ అడుగుతున్నారు. కానీ అలాంటిదేమీ లేదు. ఎందుకంటే ఇది నా కథ కాదు. ఒక దర్శకుడికి, ఒక కాస్ట్యూమ్ డిజైనర్‌కి మధ్య నడిచే ప్రేమకథ. ఒక డైరెక్టర్‌గా చెప్పాలంటే వాడికి ఎక్కువ తెలిసిన డైరెక్టర్‌ని నేనే. సెట్‌లో ఒక్కోసారి నా బిహేవియర్ చూసి కొన్ని సీన్స్‌లో అలా చేసి ఉండొచ్చు.
- చేతిలో నైపుణ్యం ఉంటే దానితో ఎలాగైనా బతికేయొచ్చు. ఈ సినిమా హిట్ అవ్వడాన్ని బట్టి అశోక్ ఫ్యూచర్ ఉంటుంది. ఈ సినిమా సూపర్‌హిట్ అయితే తనకి రెండు, మూడు ఛాన్సులు వస్తాయి. హీరోగా కంటిన్యూ అయిపోవచ్చు. అలా కాని పక్షంలో చేతిలో విద్య ఉంది. డైరెక్టర్ అవుతాడు. అది అతని ఛాయిస్.

రంగం స్థలం 50 శాతం పూర్తి

'రంగస్థలం' సినిమా 50 శాతం పూర్తయింది. సంక్రాంతికి రిలీజ్ అవుతుంది. ఈ సినిమా టైటిల్‌లో 1985 అని స్పెసిఫిక్‌గా చెప్పడానికి రీజన్ ఏమిటంటే కథపరంగా ఆ సంవత్సరానికి వెళ్ళాల్సి వచ్చింది. అలా చేస్తే ఆ కథ వర్కవుట్ అవుతుంది. అప్పట్లో మొబైల్ ఫోన్స్ లేవు అనే లాజిక్ ఉంది కదా అందుకు.

- నేను పాతిక సంవత్సరాలకుపైగా పల్లెటూళ్లోనే ఉన్నాను. అక్కడే స్కూల్‌లో చదువుకున్నాను. పల్లెటూరు నేపథ్యంలో సినిమా ఎప్పుడు తీద్దామా? అని ఎదురుచూస్తున్నాను. ఇప్పటికి కుదిరింది. అయితే ఈ ఆలోచన ఎప్పటి నుంచో ఉంది కాబట్టే 'ఆర్య'లాంటి సినిమాలో సిటీ నుంచి విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లోకి వెళ్ళి కొన్ని సీన్స్ కూడా పెట్టడం జరిగింది. అలాగే '100 పర్సెంట్ లవ్'లో కూడా విలేజ్ సీన్స్ ఉంటాయి.
- సైన్‌ఫిక్షన్ చిత్రాలు చెయ్యాలంటే ఇక్కడి మార్కెట్ సరిపోదు. హిందీలో చెయ్యాలి. అప్పుడప్పుడు అలాంటి ఆలోచనలు వస్తుంటాయి. చిన్న చిన్న లైన్స్ అనుకుంటాం. అవి వర్కవుట్ అవ్వాలంటే అన్నీ కుదరాలి. మనం ఒక మార్కెట్ చట్రంలో ఇరుక్కుపోయి ఉంటాం. ఆ లిబర్టీ రావాలంటే కంటిన్యూగా సక్సెస్‌లు రావాలి.

ఖమ్మంలో గీతావిష్కరణ



బాలకృష్ణ, పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'పైసా వసూల్' చిత్రం సెప్టెంబర్ ఒకటో తేదీన ప్రేక్షకుల ముందుకు రానుందన్న విషయం తెలిసింది. దీనికి ముందు ఈ చిత్రం గీతావిష్కరణ ఎక్కడ చేయనున్నారన్న విషయాన్ని మంగళవారం చిత్రబృందం ప్రకటించింది. ఆ వేడుకకు ఖమ్మంను వేదికగా ఎంపిక చేసుకుంది. ఈనెల 17వ తేదీన అక్కడ ఎస్.ఆర్.అండ్ బి.జి.ఎన్.ఆర్. కళాశాల మైదానంలో 'పైసా వసూల్' ఆడియోను విడుదల చేస్తున్నారు. శ్రియ, కైరా దత్‌లు కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని భవ్యా క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూరుస్తున్నారు.

సెప్టెంబర్ 1న 'జవాన్'

బీవీఎస్ రవి దర్శకత్వంలో సాయి ధరమ్ తేజ్ హీరోగా చేస్తున్న సినిమా 'జవాన్'. ప్రతి ఇంటికీ ఒక్కడు ఇటువంటి వాడు ఉండాలన్న కాన్సెప్ట్‌తో తీస్తున్న సినిమా. మెహ్రీన్ కౌర్ కథానాయికగా చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తమన్ బాణీలు సమకూర్చిన గీతాలను త్వరలో విడుదల చేయనున్నారు. దిల్ రాజు, కృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ ఒకటో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోందీ చిత్రబృందం. మంగళవారం ఈ సినిమాకు సంబంధించిన రెండు పోస్టర్లను విడుదల చేశారు.


సాయి ధరమ్ తేజ్

తెలుగులో 'కలి'


సాయి పల్లవి, దుల్కర్ సల్మాన్

మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్, 'ఫిదా' ఫేమ్ సాయి పల్లవి జోడీగా నటించిన మలయాళ చిత్రం 'కలి'. ఇది ఇప్పుడు తెలుగులో విడుదల కాబోతుంది. ఈ సినిమాను తెలుగు అనువాద హక్కులను ప్రముఖ సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ డి.వి.కృష్ణస్వామి దక్కించుకున్నారు. ప్రస్తుతం తెలుగు అనువదానికి సంబంధించిన డబ్బింగ్, మిక్సింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈనెల రెండో వారంలో ఈ సినిమా టైటిల్, లోగో విడుదల చేస్తారు. సెప్టెంబర్‌లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గోపీసుందర్ బాణీలు సమకూరుస్తున్నారు సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

'లచ్చి' ఏం చేస్తుంది?

వెన్నెల పోగ్రాం ద్వారా బుల్లి తెర ప్రేక్షకులకు దగ్గరైన జయతి ఇప్పుడు హీరోయిన్‌గా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'లచ్చి'. జె94షోస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా ఈశ్వర్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. హార్రర్ కామెడీలో వైవిధ్యాన్ని ఈ చిత్రం ద్వారా పరిచయం చేస్తున్నారు. షూటింగ్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ మొదటి వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జయతి మాట్లాడుతూ "చాలా టీవి ప్రొగ్రామ్స్ ప్రొడ్యూస్ చేసిన అనుభవంతో ఈ సినిమా నిర్మాణం చేపట్టాను. అలాగే ఈ చిత్రం కథ నచ్చి నేను మెయిన్ లీడ్‌లో నటించాను. హార్రర్ కామెడీ చిత్రాలు చాలానే వచ్చాయి. కానీ 'లచ్చి' చిత్రం కొత్త అనుభూతిని అందిస్తుంది. వైవిధ్యమైన కథ, కథనం ప్రేక్షకుల్ని థ్రిల్‌కు గురి చేస్తుంది. ఈ చిత్రం అంతా లచ్చి పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అనేక మలుపులు ఆడియెన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తాయి. ప్రముఖ కమెడియన్స్ కడుపుబ్బా నవ్విస్తారు. అలాగే లెజెండ్ కెమెరామెన్ యం.వి.రఘుతో పనిచేయటం చాలా ఆనందంగా ఉంది" అని అన్నారు.


'లచ్చి' చిత్రంలో జయతి

ఈ సినిమాలో వేగం ఉంటుంది

'హైస్కూల్', '1940లో ఓ గ్రామం', 'కమలతో నా ప్రయాణం', 'లజ్జ' వంటి వ్వి. ౖఅ కథాంశాలతో కూడిన చిత్రాలు చేశాడు దర్శకుడు నరసింహ నంది. తాజాగా 'బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్' పేరుతో మరో సినిమాని రూపొందించారు. లక్ష్మీ నరసింహ సినిమా పతాకంపై నరసింహ నంది ఖ్ధిసేలు నిర్మించిన ఈ సినిమా ఈ నాలుగో తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నరసింహ నందితో మంగళవారం విలేకరులతో మాట్లాడారు.


నరసింహ నంది

ఈ సినిమా కథేమిటి?

ఈ సినిమా ఒక విలేజ్‌లో జరిగే కథ. గేదె ఒక ఫ్యామిలీని పోషిస్తుంటుంది. ఆ గేదె చనిపోతే ఆ ఫ్యామిలీకి ఎలాంటి సమస్యలు వస్తాయి అనేది మెయిన్ కాన్సెప్ట్. ఇరానియన్ మూవీ 'ది కౌ' ఈ సినిమాకి ఇన్‌స్పిరేషన్. దరుషి మెహర్జాన్ ఆ సినిమాకి దర్శకుడు. ఒక జంతువుకి, మనిషికి ఉన్న రిలేషన్ ఎలాంటిది అనేది ఆ సినిమా చూసిన తర్వాత నాకు తెలిసింది. వాళ్ళిద్దరి మధ్య ఎలాంటి ఎఫెక్షన్ ఉంటుందనే ఆ సినిమాలో చూపించారు. ఆ తర్వాత 'బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్' సినిమా చెయ్యడానికి మెయిన్ రీజన్ నేను కళ్ళారా చూసిన ఓ యాక్సిడెంట్. ఆ ఊరికి వెళ్తున్నప్పుడు నలుగురు కుర్రాళ్ళు కారుని ర్యాష్‌గా డ్రైవ్ చేస్తూ ఓ గేదెను కొట్టేసి వెళ్ళిపోయారు. కనీసం కారు కూడా ఆపకుండా వెళ్ళిపోయారు. ఆ గేదె చనిపోయింది. ఆ గేదె తాలూకు మనిషి వచ్చి బాధపడుతూ ఉంటే వెంటనే వెళ్ళి పోలీస్ కేస్ పెట్టండి అని చెప్పి వచ్చేశాను. ఒక జంతువు తమ కారు కిందే పడి చనిపోతే ఎలాంటి బాధ, బాధ్యత లేకుండా వెళ్ళిపోయారు. దానికి ఏదో ఒక నష్టపరిహారం ఇస్తే బాగుండేది అనిపించింది. కొడుకులా తమ కుటుంబాన్ని పోషిస్తున్న గేదె చనిపోతే ఆ రైతు పరిస్థితి ఏమిటి? ఈ ఆలోచన వచ్చిన తర్వాత దీనిమీద ఒక సినిమా చేద్దాం అనిపించింది. దీనికి సంబంధించిన కథ రెడీ చేసుకొని కొన్ని కమర్షియల్ హంగులు కూడా అద్ది ఆ రైతు తనకు జరిగిన నష్టానికి ఎలాంటి పోరాటం చేశాడు? ఎలా నెగ్గాడు? కోర్టు ఎలాంటి జడ్జిమెంట్ ఇచ్చింది అనేది కథ.

మీ గత చిత్రాలు కమర్షియల్‌గా సక్సెస్ అవ్వలేదు. ఈ సినిమాకి కమర్షియల్‌గా ఎలాంటి ఫలితం వస్తుందనుకుంటున్నారు?

ఈ కథని కొంచెం కమర్షియలైజ్ చేశాను. ఇందులో లాయర్ క్యారెక్టర్ ఉంటుంది. అతనికి ఓ లవ్‌స్టోరీ ఉంది. తన గేదె చనిపోయిందని, తనకు న్యాయం చెయ్యాలని గేదె యజమాని ఫైట్ చేస్తుంటాడు. దీన్ని కమర్షియల్ యాంగిల్‌లోనే తియ్యడం జరిగింది. అతనికి ఎలాగైనా న్యాయం జరగాలని ఒక టి.వి. రిపోర్టర్ పోరాడుతూ ఉంటాడు. ఆ ఛానల్ కూడా అతనికి సపోర్ట్ చేస్తుంది. ఒక పక్క మీడియా, ఒక పక్క రిపోర్టర్, మరో పక్క టి.వి. ఛానల్.. ఇలా మూడు యాంగిల్స్‌లో కమర్షియల్‌గానే చెప్పాను. ఇంతకుముందు నేను చేసిన సినిమాలు స్లో నేరేషన్‌లో ఉంటాయి. అందులో మూడు, నాలుగు క్యారెక్టర్స్‌తోనే కథ రన్ అవుతూ వుంటుంది. ఈ సినిమా మాత్రం ఫాస్ట్‌గా ఉంటుంది. క్యారెక్టర్స్ కూడా ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ క్రౌడ్‌తో చేసిన సినిమా. ఈ చిత్రం అంతా బుడ్డారెడ్డిపల్లి అనే గ్రామంలోనే చేయడం వల్లే ఆ టైటిల్ పెట్టాం. ఆ గ్రామం నుంచి వెళ్ళినవారంతా చాలా గొప్పవాళ్ళయ్యారని చెబుతారు. ఆ ఊరికి 200 సంవత్సరాల చరిత్ర ఉంది.

మా దెయ్యాలు భయపెడుతూనే నవ్విస్తాయి

ఏ.వి రమణ మూర్తి సమర్పణలో చిన్మయనంద ఫిల్మ్స్ పతాకంపై ఎస్.సరిత నిర్మిస్తోన్న చిత్రం 'ఇదేం దెయ్యం'. శ్రీనాథ్ మాగంటి హీరోగా పరిచయం అవుతున్నాడు. సాక్షి కక్కర్ , రచన స్మిత్, రుచి పాండే నాయికలు. రచ్చ రవి, కిరాక్ ఆర్.పి కీలక పాత్రధారులు. వి.రవివర్మ దర్శకత్వం వహించారు. బాలు స్వామి సంగీతం అందించారు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఈనెల నాలుగున ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ మీడియా సమావేశం ఏర్పాటు చేసింది.

హీరో మాగంటి శ్రీనాథ్ మాట్లాడుతూ 'హాస్యానికి పెద్ద పీట వేస్తూ తెరకెక్కించిన సినిమా ఇది. భయపడే సన్నివేశాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. సినిమా కోసం చాలా కష్టపడ్డాం. కానీ ఆ కష్టాలు థియేటర్‌కు వచ్చిన ఆడియన్స్‌ను నవ్విస్తాయి. ముఖ్యంగా రచ్చ రవి, ఆర్‌పితో నా కాంబినేషన్ సీన్స్ బాగుంటాయి. సినిమా బాగా వచ్చింది" అని తెలిపారు.

దర్శకుడు రవి వర్మ 'రచ్చరవి, ఆర్.పి, శ్రీనాథ్‌లను దృష్టిల్లో పెట్టుకుని కథ రాసుకున్నా. నేను అనుకున్న దానికన్నా బాగా నటించారు. శ్రీనాథ్ కొత్త కుర్రాడైనా చక్కగా నటించాడు. కామెడీ హైలైట్‌గా ఉంటుంది. హార్రర్ సన్నివేశాలు ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తాయి. సినిమా చూసిన వాళ్లంతా బాగా ఎంజాయ్ చేస్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో మొత్తం 100 థియేటర్లలలో సినిమా రిలీజ్ చేస్తున్నాం' అని చెప్పారు.సంగీత దర్శకుడు బాలుస్వామి మాట్లాడుతూ 'మా దెయ్యాలు భయపెడుతూనే నవ్విస్తాయని తెలిపారు.


శ్రీనాథ్ మాగంటి, సాక్షి కక్కర్, రచన స్మిత్, రచ్చ రవి

ఆకట్టుకునే డిజైన్, ఆహ్లాదాన్నిచ్చే రంగులతో హ్యాంగ్ చేసిన కర్టెన్లు ఇంటీరియర్ డెకరేషన్‌లో కీలకం. చూడగానే 'వావ్!' అనిపించాలంటే.. కలర్‌ఫుల్‌గానే కాదు.. విభిన్నంగానూ హ్యాంగ్ చేయాలి. ఇది ఇంటి అందాన్ని మరింత ఆకర్షణీయంగా చేస్తుంది... మరి విండో కర్టెన్స్‌ని డిఫరెంట్‌గా ఎలా హ్యాంగ్ చేయాలి..? కొత్త స్టయిల్లో కర్టెన్‌ని ఎలా డెకరేట్ చేయాలి..? ఆ విశేషాలు.. ఈవారం 'నివాసం'లో..

ఇంటీరియర్ డెకరేషన్‌లో కీలకం

కర్టెన్ హ్యాంగింగ్



గుమ్మానికి అటూ.. ఇటూ మేకులు కొట్టి..దానికి ఓ స్ప్రింగ్ తగిలించి కర్టెన్‌ను అమర్చడం.. ఒకప్పటి ఫ్యాషన్. దాని తర్వాత తలుపు దగ్గర ఒక రాడ్‌కి రెండు కర్టెన్స్‌ని వేలాడదీయడమూ ఓ ట్రెండ్‌నే సెట్ చేసింది. దాని కన్నా విభిన్నంగా కర్టెన్స్‌ని హ్యాంగ్ చేయడానికి సరికొత్త ఐడియాలతో పాటు.. ట్రెండీ రాడ్స్ ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎప్పటిలాగా కర్టెన్స్‌ని డోర్ నుంచి వేలాడదీస్తే కొత్తేముంది..? సీలింగ్ నుంచి కిందకి వేలాడదీస్తే ఆ లుక్కే వేరు.

సీలింగ్ నుంచి కిందకు

ప్రస్తుతం మార్కెట్‌లో ట్రెండీ కర్టెన్స్ అందరినీ ఆకర్షిస్తున్నాయి. డిజైనర్స్ ఎప్పటికప్పుడు ట్రెండ్‌ని ఫాలో అవుతూ రకరకాల కర్టెన్స్‌ను డిజైన్ చేస్తున్నారు. కర్టెన్స్‌ని తలుపు



లేదా కిటికీ పైభాగం నుంచి కాకుండా.. సీలింగ్ నుంచి వేలాడదీస్తే అందంగా కనిపిస్తుందన్న ఆలోచన వారిదే. ఇలా సీలింగ్ నుంచి కర్టెన్స్‌ని హ్యాంగ్ చేయడం వల్ల అందంగానే కాదు.. గదీ పెద్దదిగా.. విశాలంగా కనిపిస్తుంది.

డబుల్ లేయర్డ్ కర్టెన్స్

డబుల్ లేయర్ కర్టెన్స్ ఇప్పుడు ఇదో ఫ్యాషన్. రెండు డిఫరెంట్ షేడ్స్‌లో కర్టెన్స్ తీసుకుని.. సెపరేట్ రాడ్స్‌కి హ్యాంగ్ చేస్తే.. ఎట్రాక్టివ్‌గా ఉంటుంది. ఇలా డెకరేట్ చేస్తే.. ఎలాంటి వాతావరణంలో అయినా ఆకట్టుకుంటాయి. వీటిలో ఒక కర్టెన్‌ని అలా వదిలేసినా.. మరో కర్టెన్‌ని.. అక్కడక్కడ ఫోల్డ్ చేస్తూ అలంకరిస్తే మరింత అందంగా కనిపిస్తుంది.

మరింకే...ఇంటి అందాన్ని రెట్టింపు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నవారు పాత ఫ్యాషన్‌కి గుడ్‌బై చెప్పేసి.. మార్కెట్‌లో కొలువుదీరిన కొత్త ట్రెండ్‌ని సెట్ చేయండి. వెంటనే షాపింగ్ చేసి, రంగురంగుల పొడవాటి కర్టెన్లు కొనుగోలు చేసి, మీ గదికి సరికొత్త అందాన్ని తెచ్చుకోండి. లేదంటే.. కొంచెం కలర్‌ఫుల్‌గా ఉన్న ఇంట్లో పాత చీరలు గానీ.. దుప్పట్టాలను గానీ ఈ తరహాలో వేలాడదీయొచ్చు. అవీ సరికొత్త అందాల్ని మనకు పంచుతాయండోయ్!

- సేకరణ : లక్ష్మితేజస్విని







ఇంటి వాతావరణాన్ని మార్చే

ఇండోర్ ప్లాంట్స్



స్వచ్ఛమైన గాలిని కోరుకోనివారు ఉండరు. ఎందుకంటే ప్రస్తుత కాంక్రీట్ జంగిల్‌లో స్వచ్ఛమైన గాలికోసం అప్పుడప్పుడు పార్కులవైపు పరుగులు తీస్తుంటారు. మరికొంతమంది ఏకంగా తమ ఇంటి పెరట్లోనో, రూఫ్‌పైనో మొక్కలు పెంచుతూ.. స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తుంటారు. అయితే ఇండోర్‌ప్లాంట్స్‌తోనూ స్వచ్ఛమైన గాలిని పొందొచ్చు. ఎలాంటి మొక్కలైతే స్వచ్ఛమైన గాలిని పంచుతాయి..? వాటిని ఎలా ఎంపిక చేసుకోవాలి..? ఆ విశేషాలు మీ కోసం..!

కొన్ని మొక్కలు గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చడమే కాదు. గాలిలోని మలినాలనూ విషవాయువులనూ పీల్చేసుకుని, పరిశుభ్రం చేస్తాయి. వీటిని ఇండోర్ మొక్కలుగా పెంచుకుంటే ఆరోగ్యమూ బాగుంటుందంటున్నారు నిపుణులు. మీరు ఇప్పటికే ఇండోర్ గార్డెన్ నిర్వహిస్తున్నట్లయితే, తక్షణమే వీటికి మీ ఇంట్లో స్థానం కల్పించి, కాలుష్యం లేని చక్కటి గాలితో ఆరోగ్యాన్ని పొందండి. ఈ మొక్కలతో మీరు ఉండే ప్రదేశాలను అలంకరించుకుంటే.. మీరు పీల్చే గాలి స్వచ్ఛంగా ఉంటుంది. అవేంటో చూద్దాం...!

వెదురు మొక్క చాలా గొప్పది. దాన్ని మీ ఇంట్లో పెంచినట్లయితే వాతావరణంలో ఉండే అన్నిరకాల రసాయనాలనూ ఇది తొలగిస్తుంది. దీనికి ఎక్కువ సూర్యకాంతి కూడా అవసరం లేదు. అందువల్ల ఇంట్లోనే నీడ ఉన్నచోట దీన్ని ఎంచక్కా పెంచుకోవచ్చు. ఇది కార్బన్ మోనాక్సైడ్, బెంజీన్, ఫార్మాల్డిహైడ్, క్లోరోఫారం తదితర రసాయనాల ప్రభావాన్ని తొలగిస్తుంది. వీటిని లాండ్రీ రూమ్, లివింగ్ రూమ్ లేదా బెడ్‌రూమ్‌లో ఉంచడం మంచిది.

రబ్బరు చెట్లు..

మనదేశంలో రబ్బరు చెట్లు చాలా సర్వసాధారణం. వీటిని ఆరోగ్యంగా ఉంచడానికి వెలుగు, నీరు, ఎరువులు ఎక్కువ మోతాదులో అవసరం. ఇది కార్బన్ మోనాక్సైడ్, ఫార్మాల్డిహైడ్, ట్రైక్లోరోథైలిన్‌ని తొలగించడానికి ఎంపిక చేసుకోవచ్చు.

పోకచెక్క..


వెదురులాగానే పోకచెక్క మొక్క కూడా ఒకటి. దీని ఆకులు అల్లుకున్నట్లు ఉండి.. ఆకర్షణీయంగా, అందంగా కనిపిస్తాయి. వీటి పెరుగుదలకు ఎక్కువ సూర్యకాంతి, నీరు అవసరం. అందుకే దీన్ని కిటికీల దగ్గరగా పెట్టుకోవాలి. ఇది బెంజీన్, కార్బన్ మోనాక్సైడ్, ట్రైక్లోరోథైలిన్, ఫార్మాల్డిహైడ్‌ని తొలగిస్తుంది. అంతేకాదు గాలిని చల్లబరుస్తుంది.

తులిప్..

తులిప్ మొక్కలు ఇంట్లో అందంగా కనిపించడమే కాకుండా, గాలిని స్వచ్ఛంగా మారుస్తాయి. నేరుగా సూర్యకాంతి పడనిచోట వీటిని ఉంచాలి. ప్రతిరోజూ నీళ్లుపోస్తూ.. మట్టి తేమగా ఉందో లేదో అని పరీక్షిస్తే చాలు. ఇది అమ్మోనియాను పారదోలుతుంది.

- సేకరణ : త్రిభువన్ ఆకుల






పొడుపు కథ

ఇంతింతాకు, ఇంపైన ఆకు,
రాజులు మెచ్చిన రత్నాల ఆకు.

నవ్వులు

తండ్రి : ఏరా బాబీ..! పరీక్ష ఎలా రాశావు?
బాబి : కేక! వందకు వంద వస్తాయి.
తండ్రి : నేను నమ్మను.. (బాబీని అనుమానంగా చూస్తూ)
బాబి: నువ్వు నమ్మవనే ఆన్సర్ షీట్ కూడా తెచ్చా. ఇదిగో చూడు బ్యాగ్‌లో నుండి తీస్తూ అన్నాడు బాబి.
తండ్రి : ఆఆ..!!??





ఖాళీలు పూరించండి!

పిల్లలూ.! పైనున్న చిత్రంలో పక్షులూ.. వాటి పేర్లూ.. కొన్ని ఖాళీలతో ఇచ్చారు. వాటిని పూరించండి!

గాల్లో ఫైటింగ్ చేసే పక్షి!



ఫ్రిగేట్ బర్డ్... గాలిలో ఎగురుతూనే దాడి చేసే పక్షి ఇది. సముద్రపక్షుల్ని సులువుగా వేటాడుతుంది. పొడవాటి రెక్కలు, తక్కువ బరువుతో ఇది ఆకాశంలో చిత్ర విన్యాసాలు చేస్తుంది. సముద్రంలోకి రివ్వున దూకి, చేపల్ని పట్టేస్తుంది. ఇతర పక్షుల గూళ్లపైనా దాడి చేస్తుంది. ఇవి ఫ్లోరిడా నుంచి బ్రెజిల్, కాలిఫోర్నియా నుంచి ఈక్వెడార్ వరకూ తీరప్రాంతాల్లో ఉంటాయి. అలాగే గలపాగో ద్వీపాలు, పశ్చిమ ఆఫ్రికా తీరప్రాంతాల్లోనూ కనిపిస్తాయి.

దీని ముక్కు కొక్కెంలా భలే ఒంపు తిరిగి ప్రత్యేకంగా ఉంటుంది. మెడ కింద ఎర్రగా, శరీరం, రెక్కలు నల్లగా ఉంటాయి. ఇవి సుమారు 80 గ్రాముల బరువు, నాలుగు అంగుళాల పొడవు ఉంటాయి. వీటి రెక్కలు ఎనిమిది అంగుళాలు విస్తరిస్తాయి. ఈ పక్షులు ఎక్కువగా ఎగిరే చేపల్ని, సముద్రపక్షి గుడ్లను తింటాయి. ఇవి స్వచ్ఛమైన నీటినే తాగుతాయి. ★

దుమ్మురేపిన గుజరాత్, ఉత్తరప్రదేశ్

ఢిల్లీకి షాక్... తెలుగు జట్టుకు మూడో ఓటమి



ఢిల్లీ రైడర్‌ను పట్టేసిన గుజరాత్ ఆటగాళ్లు

హైదరాబాద్ : ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో కొత్త జట్లుగా బరిలో దిగిన గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్, ఉత్తరప్రదేశ్ యోధాస్ తొలి మ్యాచ్‌ల్లోనే అదిరే ఆరంభంతో దుమ్మురేపాయి. దీంతో ఢిల్లీ జట్టుకు తొలి ఓటమి, తెలుగు టైటాన్స్ వరుసగా మూడో ఓటమిని చవి చూశాయి. తొలిసారిగా బరిలో దిగిన గుజరాత్ అంచనాలకు తగ్గట్టుగా రాణించింది. తొలి బోణి చేసింది. మంగళవారం నాటి తొలి మ్యాచ్‌లో జెయింట్ అద్భుతమైన ఆటతీరుతో దంబంగ్ ఢిల్లీను 26-20 పాయింట్లతో మట్టి కరిపించింది. సుకేష్ హెగ్డే నాయకత్వంలో యువ ఆటగాళ్లతో నిలిచిన గుజరాత్ జట్టులో సచిన్, ఇరానీ ప్లేయర్ ఫాజిల్ సత్తా చాటారు. రైడింగ్‌లో ఢిల్లీకి ధీటుగా పాయింట్లను రాబట్టారు. తొలి అర్ధ భాగంలో జెయింట్ జట్టు 15 పాయింట్లను,రెండో అర్ధభాగంలో 11 పాయింట్లను సాధించింది. ఢిల్లీ జట్టు 5, 15 పాయింట్లను మాత్రమే సాధించింది. ఏ దశలో గుజరాత్ పాయింట్లను కట్టడి చేయలేక ఓటమి పాలైంది. వ్యూహాత్మక దాడులతో గుజరాత్ రైడర్లు సచిన్ 3, ఫాజిల్ 4 పాయింట్లను తేగా, ఢిల్లీ జట్టులో ఆర్ శ్రీరామ్ 5, సునీల్ రెండు పాయింట్లను జమ చేశారు. తొలి అర్ధ భాగంలో గుజరాత్ దూకుడు పెంచి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యంతో సాగింది. 16-5 భారీ ఆధిక్యంతో దూసుకెళ్లింది. ఢిల్లీ ఏ దశలోను కోలుకున్నట్లు కనిపించలేదు. రెండో అర్ధ బాగంలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా ఫార్చ్యూన్ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది.

ఇరు జట్లు పాయింట్ల సాధన ఇలా...

రైడ్ పాయింట్లలో ఢిల్లీ, గుజరాత్‌పై 11 10తో ముందంజ వేయగా, టాకిల్ పాయింట్లలో 5-9, ఆల్ అవుట్ పాయింట్లలో 2-4, ఎక్స్‌ట్రాల సాధనలో 2-3తో ఓటమి చెందింది.

యోధులకు తలవంచిన టైటాన్స్....

నాల్గో రోజు రెండో మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, ఉత్తరప్రదేశ్ యోధాస్ జట్లు తలపడ్డాయి. తొలి అర్ధ భాగంలో నువ్వానేనా అన్న రీతిలో ఇరుజట్ల పాయింట్ల సాధనలో కుస్తీ పట్టాయి 4-3, 8-8-11-13 పాయింట్లతో తెలుగు, యూపి జట్లు సాగాయి. ఆ తర్వాత కథ మారిపోయింది. యుపి జట్టు తెలుగు టైటాన్స్‌పై పట్టు సాధించింది. తొలి అర్ధభాగంలో 11-12తో ఒక్క పాయింట్ వెనుకంజలో ఉన్న తెలుగు టీమ్‌ను ముచ్చెమటలు పట్టించిన యోధులు రైడింగ్ పాయింట్లతో ఎదురు దాడికి దిగారు. 14-19తో ముందంజ వేసిన యోధా టీమ్ చివరి వరకు అదే జోష్‌ను ప్రదర్శించి 31-18తో తెలుగు టీమ్‌ను మట్టి కరిపించింది. టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరీ దాదాపుగా ఒంటరి పోరాటం చేశాడు.రాహుల్ 7 పాయింట్లు తీసుకురాగా, రాకేష్ రెండు, విశాల్ 3 సాధించారు. యుపి కెప్టెన్ నితిన్ ఆరు, రాజేష్ 3, జీవా కుమార్ 2, 73 లక్షల ధర పలికిన రిషంక్ దేవడిగ 5, మహేష్ గౌడ్ 4 పాయింట్లతో సత్తా చాటారు. యూపి జట్టులో నితిన్ తోమర్ అత్యధికంగా రూ.93లక్షలు ధర పలికిన విషయం తెల్సిందే. ఈ స్టార్ రైడర్ తొలిసారిగా కెప్టెన్‌గా ఒత్తిడితో బరిలో దిగినప్పటికీ జట్టును విజయం పథంలో నిలిపాడు. లక్నోలోని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోచ్ ఉదయ్ కుమార్ సారథ్యంలో యోధాస్ జట్టు పూర్తిగా యువకులతో నిండి ఉంది. సొంతగడ్డపై తెలుగు జట్టు మూడో ఓటమి చవిచూడటంతో పాయింట్ల పటిక వెనుకపడింది

నేటి షెడ్యూల్
రాత్రి 8 గంటకు : గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్ × హర్యానా స్టీలర్స్
రాత్రి 9 గంటలకు : తెలుగు టైటాన్స్ × బెంగాల్ వారియర్స్

మిథాలీకి బిఎండబ్ల్యు కారు బహుకరణ



అత్యధిక పరుగులు చేసినందుకు ఇచ్చిన బిఎండబ్ల్యు కారులో మిథాలీరాజ్

హైదరాబాద్: ఐసిసి మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌లో అద్వితీయమైన ఆటతీరు ప్రదర్శించిన కెప్టెన్ మిథాలీ రాజ్‌కు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి చాముండేశ్వరి నాథ్ మంగళవారం బిఎండబ్ల్యు కారును బహుకరించారు. ఈ కారును పుల్లెల గోపీచంద్ అకాడమీ అందించింది. ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులను మిథాలీ సాధించిన విషయం తెల్సిందే. అత్యధిక పరుగులు సాధిస్తే కారు బహుకరిస్తానన్న తన హామీని నెరవేర్చుకున్నానని చాముండీ ఈ సందర్భంగా తెలిపారు. గత నెల 12 ఆరువేల పరుగుల మైలు రాయిని మిథాలీ అధిగమించిందని ఆయన గుర్తు చేశారు. ఈ విధంగా రాజ్‌కు కారును బహుకరించడం ఇది రెండో సారి. 2005లో ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరిన నేపథ్యంలో 2007లో లగ్జరీ కారును ఆయన అందించారు.

న్యూజిలాండ్ రెండో రౌండ్‌కు ప్రణయ్, కశ్యప్



ఆక్లాండ్ : భారత షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్ న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్ గోల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముందంజ వేశారు. వీరిద్దరు తొలి రౌండ్‌లో జయకేతనం ఎగుర వేసి రెండో రౌండ్‌కు ప్రవేశించారు. మంగళవారం నాటి పోరులో ప్రపంచ 17వ ర్యాంకర్ ప్రణయ్ ఇండోనేషియా షట్లర్ షీసార్ హిరెన్‌పై 21-14, 21-16 పాయింట్ల తేడాతో కేవలం 36 నిమిషాల్లో విజయం సాధించాడు. మరో షట్లర్ కశ్యప్ కూడా సునాయాసంగా తన తొలి హర్డిల్‌ను అధిగమించాడు. ఇండోనేషియా షట్లర్ డైయాన్స్యిస్ హయామ్‌పై 21-5, 21-10తో విజయం సాధించాడు. అజయ్ జయరామ్ చైనీస్ తైపీ షట్లర్ చియా హంగ్ లూ చేతిలో 19-21, 13-21తో పరాజయం పాలై నిష్క్రమించాడు.

కొత్త వేదికలు.. బిజి షెడ్యూల్

- డిసెంబర్ వరకు విరాట్ సేన బిజీ
- స్వదేశంలో 23 మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత్ దేశంలో కొత్తగా రెండు రాష్ట్రాల్లో క్రికెట్ స్టేడియాల ప్రారంభానికి ముహర్తం ఖరారైంది. నాలుగు నెలలు పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్,శ్రీలంక దేశాలు భారత్ పర్యటించనున్నాయి. ఈ సందర్భంగా అస్సామ్‌లో బర్సాపరా, కేరళ రాష్ట్రం తివేంద్రంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాలు ప్రారంభించనున్నారు.స్వదేశంలో వివిధ దేశాలతో క్రికెట్ సిరీస్‌లో విరాట్ సేన డిసెంబర్ వరకు బిజీగా గడపనుంది. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు మొత్తం 23 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తలపడనుంది. సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 11 వరకు ఆస్ట్రేలియాతో ఐదు వన్డే, మూడు టి 20ల సిరీస్‌లో ఆడనుంది.అక్టోబర్ 22 నుంచి నవంబర్ ఏడో తేదీ వరకు న్యూజిలాండ్‌తో మూడు వన్డే, మూడు టి 20 సిరీస్‌ల్లో భారత్ తలపడనుంది. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 24 వరకు శ్రీ లంకతో మూడు టెస్ట్‌ల సిరీస్, మూడు వన్డేలు, మూడు టి 20 మ్యాచ్‌ల్లో విరాట్‌సేన తలపడనుంది.

కొలంబో టెస్ట్‌కు తిరుమాన్నే చేరిక

- భారత ఓపెనింగ్ జంటపై మల్లగుల్లాలు
- రేపట్నుంచి రెండో టెస్ట్



కొలంబో : కొలంబోలో గురువారం నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌కు 16 మంది సభ్యులతో కూడిన శ్రీలంక జట్టును బోర్డు వర్గాలు ప్రకటించాయి. న్యూమోనియా జ్వరంతో గాలే టెస్ట్‌కు దూరమైన కెప్టెన్ దినేష్ చండీమాల్ రెండో టెస్ట్‌లో సారథ్య బాధ్యతలను నిర్వహించనున్నాడు.తొలి టెస్ట్‌లో 304 పరుగులతో పరాజయం చెందడంతో ఈ టెస్ట్‌లో విజయం సాధించాల్సిన నేపథ్యంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. గాయంతో బ్యాటింగ్ చేయని ఆసేల గుణరత్నే స్థానంలో లాహిరు తిరుమాన్నేను తీసుకున్నారు. 2016లో జట్టులో చేరిన ఈ బ్యాట్స్‌మెన్ తిరుమాన్నే సత్తా చాటతాడని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కెఎల్ రాహుల్ జ్వరంతో కోలుకోవడంతో అతన్ని తుది జ ట్టులోకి తీసు కోవాల్సి ఉంది. దీంతో ఓపెనింగ్ జోడిగా బరిలో దింపాలన్న విషయంపై కోచ్ శాస్త్రి, కెప్టెన్ కోహ్లీలు మల్లగుల్లాల పడుతున్నారు. గాలే టెస్ట్‌లో అనుహ్యంగా రెండో ఇన్నింగ్స్‌లో 81 పరుగుల చేసిన అభినవ్ ముకుంద్ ఉంచాలా? లేదా అన్న అంశంపై మంగళవారం శిఖర్, అభినవ్ బ్యాటింగ్ తీరును ప్రత్యక్షంగా పర్యవేక్షించాడు. పేస్ బౌలర్ల విసిరే బంతులను ఏ విధంగా ఎదుర్కొంటుందీ పరిశీలించాడు. ఫీల్డింగ్‌లో కొంత అభినవ్ వెనుకపడినట్లు గుర్తించారు. రాహుల్‌ను తీసుకుంటారా? అన్నది అనుమానంగానే మారింది. తొలి టెస్ట్‌లో 304 పరుగుల తేడాతో విజయం సాధించిన టీమిండియా కొలంబో టెస్ట్‌లోను విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని ప్లాన్‌లో రవిశాస్త్రి దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

గాయంతో ఇంగ్లాండ్ లీగ్‌కు హర్‌మన్ దూరం



లండన్ : భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ హర్‌మన్ ప్రీత్ కౌర్ భుజానికి గాయం కారణంగా ఇంగ్లాండ్ టి 20 లీగ్‌కు దూరమైంది. హర్‌మన్ ప్రీత్ దేశీవాళీ మ్యాచ్‌ల్లో సుర్రే స్టార్స్ తరపున ఆడేందుకు ఒప్పందం చేసుకుంది. గాయంతో ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో వచ్చే నెలలో కొన్ని మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం ఉండనుంది. ఇటీవల జరిగిన ఐసిసి మహిళా ప్రపంచకప్ క్రికెట్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై చిరస్మరణీ యమైన 171 పరుగులతో అజేయంగా నిలిచి సత్తా చాటింది. ఉమెన్ బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యుబిబిఎల్)లో సిడ్నీ థండర్ జట్టులో తనదైన శైలిలో రాణించిన హర్‌మన్ భుజానికి గాయంతో లీగ్‌కు అందుబాటులో ఉండటం లేదని ఫ్రాంచేజికి తెలిపారు.

తుని ఎమ్మెల్యే ఇంటిపై ఇన్‌కంటాక్స్ దాడులు

ప్రజాశక్తి-కోటనందూరు (తూర్పుగోదావరి)



తూర్పుగోదావరి జిల్లా వైసిపి తుని ఎంఎల్ఎ దాడిశెట్టి రాజా నివాసంపై ఆదాయ పన్నులశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విశాఖపట్నం ఆదాయ పన్నులశాఖ అదనపు కమిషనర్ మూర్తినాయక్ ఆధ్వర్యాన 46 మంది ఎనిమిది బృందాలుగా ఏర్పడ్డారు. తుని పట్టణంలోని లక్ష్మీగణపతి, వెంకన్నబాబు, వెంకట ధనలక్ష్మి, దాడిశెట్టి నరసయ్య, జ్యూయలరీ షాపులపై, సురేష్‌కుమార్ ఆసుపత్రి, తల్లిపిల్లల ఆసుపత్రిపై, వైద్యుల ఇళ్లలోనూ ఐటి అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. వైద్యుల నివాసంలో భారీగా నగదు, వివిధ ఆస్తుల పత్రాలు దొరికినట్టు సమాచారం. జ్యూయలరీ షాపుల్లో అధిక మొత్తంలో బంగారం నిల్వలు ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు. ఎంఎల్ఎ రాజా నివాసంలో తనిఖీలు చేపట్టగా కేజీన్నర బంగారం ఉన్నట్టు గుర్తించారు. దాడులు కొనసాగుతున్నట్టు మూర్తినాయక్ తెలిపారు. సోదాలు జరుగుతున్నాయని, పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో వివరాలను అందిస్తామని నాయక్ చెప్పారు.

వైసిపి శ్రేణుల ఆగ్రహం

దాడిశెట్టి రాజాకు ప్రజలు చూపిస్తున్న ఆదరణను ఓర్వలేక ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఎంఎల్ఎ ఇంటిపైనా, బంధువుల నివాసాలపైనా దాడులు చేయిస్తున్నారని వైసిపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

ఇకపై పాలన మాత్రమే కనిపిస్తుంది

- ఇ-ప్రగతితో అంతా పారదర్శకతే
- శిక్షణా తరగతుల ప్రారంభంలో సిఎం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇకపై ప్రభుత్వం పైకి కనపడకుండా పాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) సంయుక్త్వాధ్వర్యంలో చేపట్టిన ఇ-ప్రగతి శిక్షణా కార్యక్రమాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సిఎం మంగళవారం ప్రారంభించారు. 2017-18 సంవత్సరాన్ని ఇ-ప్రగతి సంవత్సరంగా ఆయన ప్రకటించారు. ఇ-ప్రగతి ద్వారా పాలనంతా పారదర్శకంగానే సాగుతుం దన్నారు. సాంకేతికతను వినియోగించి ఏ ప్రాంతంలో పిడుగు పడుతుందో 45 నిమిషాల ముందే కనిపెట్టగలుగుతున్నా మన్నారు. క్లౌడ్ సాంకేతికత, పీపుల్స్ హబ్‌ను తొలి సారిగా ఎపినే వినియోగిస్తోందన్నారు. సాంకేతిక వినియోగం వల్ల డబ్బు ఆదా అవుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో 16 శాతం, పింఛన్లలో 5 శాతం ఆదా చేశామన్నారు. ఇ-ప్రగతిపై నెలకోసారి సమీక్షిస్తానన్నారు. శిక్షణ పొందిన ఉద్యోగులందరూ ప్రభుత్వ కార్యకలాపాల్లో సాంకేతికత వినియోగానికి దోహదపడాలన్నారు. వాస్తవాల్ని మీడియా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అవాస్తవాల్ని తీసుకెళ్లడం సరికాదన్నారు.

ఇబ్బందులున్నా ఫలితాలు బాగుంటాయి: మంత్రి లోకేశ్ ఇ-ప్రగతి అమలులో తొలుత కొన్ని ఇబ్బందులున్నా ఫలితాలు బాగుంటాయని ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో పింఛన్లు, ప్రజా పంపిణీ వ్యవస్థలో భారీ అవినీతి జరిగేదని, సాంకేతికతను వాడటం వల్ల అవినీతికి అడ్డుకట్ట వేశామన్నారు. ఇ-ప్రగతి పారదర్శకతకు పెద్ద పీట వేస్తుందన్నారు. డ్రోన్ సాంకేతికతను కూడా ప్రభుత్వం వినియోగిస్తోందన్నారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, డిజిపి ఎన్ సాంబశివరావు, ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి కె విజయానంద్, ప్రభుత్వ సలహాదారులు జె సత్యనారాయణ, జెవి చౌదరి, ఇ-ప్రగతి సిఇఒ సుబ్రహ్మణ్యం, ఫ్యూచర్ వరల్డ్ సిఇఒ నీల్స్ జాకబ్ సన్, ఐఎస్‌బి డీన్ రాజేంద్ర శ్రీవాత్సవ, కలెక్టర్ లక్ష్మీకాంతం, విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్

- ఆ మూడు పార్టీలు ఒక్కటే
- లౌకికశక్తులన్నీ ఏకం కావాలి
- పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్‌ను ఖరారు చేసినట్లు పిసిసి చీఫ్ ఎన్. రఘువీరారెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఖాదర్ పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ నంద్యాల ఉపఎన్నికలు సైద్ధాంతిక పరమైన ఎన్నికలని, లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని నంద్యాల ప్రజలకు పిలుపు నిచ్చారు. నంద్యాల ఉప ఎన్నికలు టిడిపి,బిజెపి,వైసిపిలకు కాంగ్రెస్ పార్టీకి మధ్య జరుగుతున్న పోటీ అన్నారు. అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైఎస్‌ఆర్‌సిపీలు కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్నారు, ఈ రెండు పార్టీలకు రాష్ట్ర ప్రయోజనాల కంటే, పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. వైసిపి, టిడిపి, బిజెపి మూడు పార్టీలూ ఒక్కటేనన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, దుగ్గరాజపట్నం, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని అభివృద్ధి తదితర నిధులు రాబట్టడంలో తెలుగుదేశం, వైసిపీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. హోదాపై టిడిపి, వైసిపిలు పోటీ పడి మరీ కేంద్రానికి లొంగిపోయాయన్నారు. 2019 లో బిజెపితో కలిసి పనిచేసేందుకు జగన్, చంద్రబాబు పోటీపడుతున్నారన్నారు. నంద్యాలలో లౌకిక శక్తులన్నీ ఏకమై అధికార తెలుగుదేశం పార్టీకి, ప్రతిపక్ష వైసిపికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

ధనవంతులు, గుణవంతుల మధ్య పోటీ : అబ్దుల్ ఖాదర్

నంద్యాల ఉప ఎన్నికలు ధనవంతులకు...గుణవంతులకు మధ్య జరుగుతున్న పోటీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్ పేర్కొన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. 2019 సాధారణ ఎన్నికలకు నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. మతోన్మాద శక్తులకు వంత పాడుతున్న తెలుగుదేశం, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలకు నంద్యాల ప్రజలు బుద్ధిధ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

9న దేశవ్యాప్త జైల్‌భరోకు ఐద్వా మద్దతు

- రేషన్ షాపుల్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది
- యథేచ్ఛగా మొబైల్ మద్యం షాపులు
- జనానికి ఇబ్బంది కలిగించే వైన్ షాపులన్నింటినీ తొలగించాలి
- రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల సమస్యలపై ఈనెల 9న జరిగే జైల్‌భరోలో ఐద్వా పాలుపంచుకుంటుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. మంగళవారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమాదేవి, ఐద్వా నాయకులు శ్రీదేవి, లక్ష్మి తదితరులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. పంచదార, గోధుమలు, నూనె, కిరోసిన్ తదితర వస్తువుల సరఫరాను నిలిపేసిందన్నారు. సబ్సిడీ బియ్యాన్ని సైతం నగదు బదిలీకి మార్చాలనుకుంటోందని, గిట్టుబాటు ధరలు కల్పించేందుకు, ఆహార భద్రత కోసం ఏర్పాటు చేసిన భారత ఆహార సంస్థను సైతం కేంద్రప్రభుత్వం నిధులివ్వకుండా ఎండగడుతోందన్నారు. మార్క్ ఫెడ్, నాఫెడ్ తదితర సంస్థల్ని కూడా రైతులకు గిట్టుబాటు ధరలిచ్చేందుకు ఉపయోగించుకోవడం లేదన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ పెట్టుబడిపై 50 శాతం ధర నిర్ణయించి వ్యవసా యోత్పత్తులు కొనుగోలు చేయాలని సూచించిందని, అది కూడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. చింతపండు, కందులు, శెనగలు, మిర్చి ఉత్పత్తుల్ని రైతులు కారుచౌకగా వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. అదే సమయంలో అంతకంటే ఎక్కువ ధరలకు వినియోగదారులు నిత్యావసర సరుకుల్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం, ఎఫ్‌సిఐ, మార్క్‌ఫెడ్, గిరిజన కార్పొరేషన్ తదితర సంస్థల ద్వారా గిట్టుబాటు ధరలకు రైతాంగం నుండి కొనుగోలు చేసి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే సరఫరా చేయొచ్చన్నారు. ఇందుకు భిన్నంగా కిరాణా సరుకుల వ్యాపారంలోకి బహుళజాతి సంస్థల్ని ఆహ్వానించి రైతుల్ని, వినియోగదారుల్ని కొల్లగొట్టే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తూ రైతులు, ప్రజలకు హానికరమైన విధానాల్ని అనుసరిస్తోందన్నారు. మరోవైపు రైతులు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలంటూ 200 రైతు సంఘాలు కలిసి ఈనెల 9న దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాయని. మహిళలు ఇందులో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. మద్యం మహమ్మారికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం బెల్టుషాపుల్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. బెల్టుషాపుల్ని రద్దు చేస్తున్నామని చెబుతున్నా మొబైల్ మద్యం దుకాణాలు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరు బాటిళ్ల మద్యాన్ని కొనుగోలు చేయొచ్చన్న ఆలోచనతో మద్యం వ్యాపారులు భారీగా బెల్టుషాపుల్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తే మహిళలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. వెంటనే మద్యం అమ్మకాలపై పరిమితులు విధించాలని కోరారు. జనానికి ఇబ్బంది కలిగించే వైను షాపులన్నింటినీ రద్దు చేస్తూ తక్షణం ఉత్తర్వులివ్వాలని కోరారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68